

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★

**శుభాకాంక్షలు**

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' బక్రీద్ శుభాకాంక్షలు

**సెలవు**

బక్రీద్ సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి శనివారం సెలవు. ఆదివారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

- ఎడిటర్


సంపుటి 08, సంచిక: 188 | శనివారం | 07 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00








### ఇన్సానియత్, కశ్మీరియత్‌లపై


# పాక్ దాడి

- భారత్‌లో మత ఘర్షణలను రేకెత్తించాలనేది దాని ఉద్దేశం
- పర్యాటకంపై ఆధారపడిన కశ్మీరీ ప్రజల జీవనోపాధిని దోచుకోవాలని చూస్తోంది
- ప్రధాని మోదీ ధ్వజం
- ఎత్తయిన రైల్వే వంతెన ప్రారంభం

**కాట్రా :** పహల్గామ్‌లో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ 'ఇన్సానియత్', కశ్మీరియత్‌పై దాడి చేస్తోందని ప్రధాని మోదీ నరేంద్ర ఆరోపించారు. భారతదేశంలో మత ఘర్షణలను రేకెత్తించడం, పర్యాటకంపై ఆధారపడిన కశ్మీరీ ప్రజల జీవనోపాధిని దోచుకోవడం వారి ఉద్దేశంగా ఉందన్నారు. కశ్మీర్ లోయకు మొదటి రైలు సర్వీసును శుక్రవారం మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అదే విధంగా చినాబ్ నదిపై ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే వంతెన, భారతదేశంలో మొట్టమొదటి సారిగా తీగలతో అనుసంధానించిన అంజి వంతెనతో సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాత ప్రధానమంత్రి మాట్లాడారు. పర్యాటకం ఉపాధిని కల్పిస్తుందని, ప్రజల మధ్య అనుసంధాన లింక్‌గా పనిచేస్తుందన్నారు. కానీ దురదృష్టవశాత్తు, పొరుగు దేశం మానవత్వం, సామరస్యం, పర్యాటకానికి శత్రువుగా మారిందన్నారు. అంతే కాకుండా పాకిస్తాన్ పేదల రొట్టె, వెన్నకు కూడా శత్రువ్వేన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగినది దానికి ఒక ఉదాహరణ అని చెప్పారు. పాకిస్థాన్ పహల్గామ్‌లో 'ఇన్సానియత్', 'శ్మీరియత్' పై దాడి చేసిందన్నారు. భారతదేశంలో మత అల్లర్లను ప్రేరేపించడమే పాక్ ఉద్దేశమని, కశ్మీర్ ప్రజల సంపాదనను లాక్కోవాలని చూస్తోందని, అందుకే పర్యాటక రంగంపై పాక్ దాడికి పాల్పడిందని ఆరోపించారు. జమ్ము కశ్మీర్‌లో గత ఐదు సంవత్సరాలుగా పర్యాటకం పెరుగుతోందని, పర్యాటకులు రికార్డు సంఖ్యలో వస్తున్నారని మోడీ అన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పేదల వంటశాలలకు పర్యాటకం ఇంధనంగా పనిచేస్తుందని, పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా ఆ రంగాన్ని లక్ష్యంగా చేసుకున్నదని ఆయన మండిపడ్డారు. పర్యాటకంపై తరువాయి 2లో

# నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు

### ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదు రాష్ట్ర ప్రజలు, హక్కుల విషయంలో ఎంతటి పోరాటానికైనా ప్రభుత్వం సిద్ధమే



ప్రజాపక్షం/హైదరాబాద్

అంతర్రాష్ట్ర జలవిధానాలకు,జిఆర్ఎంబి,సిడబ్ల్యూసి, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు,ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా'బనకచర్ల ప్రాజెక్టు' ఉన్నదని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని,తెలంగాణ ప్రజలు, హక్కుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తాను జనవరి 22న కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాశానని, దీనిపైన కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ స్పందిస్తూ ఈ ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో ఎపి నుంచి ఎటువంటి ప్రతిపాదనలు అందలేదని, తరువాయి 2లో

### జగన్‌తో కెసిఆర్ అలయ్ బలయ్..

ముచ్చుమర్రి ప్రాజెక్ట్ పనులను బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్ తెలంగాణకు మరణశాసనమని, ప్రతిరోజూ 3 టిఎంసి తరలించేందూకు కెసిఆర్ ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. నాటి ఎపి సిఎం జగన్‌తో కెసిఆర్ అలయ్ బలయ్ చేసుకుని కృష్ణా నీటి దోపిడీకి సహకరించారన్నారు. పదేళ్ల కాలంలో కెసిఆర్,హరీష్‌లు ఎపి కోసమే పనిచేశారన్నారు. రాయలసీమ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్దేశపూర్వకంగా నాటి సిఎం కెసిఆర్ అపెక్స్ కమిటీకి హాజరుకాకుండా ఆ సమావేశాన్ని వాయిదా వేశారని, జగన్-కెసిఆర్ రహస్య ఒప్పందంలో భాగంగానే అపెక్స్ మీటింగ్‌కు వెళ్ళకుండా వాయిదా వేశారన్నారు.

### అది బిఆర్‌ఎస్ కాదు...

# దెయ్యాల రాష్ట్ర సమితి

- గత పదేళ్లు పాలించిన కొరివి దెయ్యాలను రాష్ట్ర పొలిమెర దాకా తరిమికొడతాం
- బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షల కోట్లు వెచ్చించినా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తిచేయలే
- రైతులు ఒక్క ఎకరా భూమి కోల్పోకుండా రూ.700 కోట్లతో గందమల్ల ప్రాజెక్టును పూర్తిచేస్తాం
- యాదాద్రి భువనగిరి జిల్లా తిరుమలాపూర్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతిబాట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- రూ.1500 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





ప్రజాపక్షం/భువనగిరి

గత పదేళ్లలో పరిపాలించింది తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) కాదని, దెయ్యాల రాష్ట్ర సమితి (డిఆర్ఎస్) ఆధ్వర్యంలో పాలన కొనసాగిందని, కొరివిదెయ్యాలను రాష్ట్ర పొలిమేరలదాక తరిమికొట్టే బాధ్యతను తానే తీసుకుంటానని, అందుకు పార్టీ కార్యకర్తల సహకారం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని తిర్మాలపూర్ గ్రామంలో శుక్రవారం 'ప్రజాపాలన ప్రగతి బాట' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. రూ.1500 కోట్లతో చేపట్టనున్న 9 అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ రాష్టగీతం ఆలపించి, జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం తన పదేళ్లపాలనలో రూ. 20 లక్షల కోట్లు వచ్చినా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆలేరు ప్రజల తరువాయి 2లో

# ఆగస్టు 3న నీట్ పిజి

### పరీక్ష నిర్వహణకు 'సుప్రీం' గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ :** ఒకే షిఫ్ట్‌లో ఆగస్టు 3న నీట్ పజి–2025 పరీక్షను నిర్వహించడానికి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బిఇ)కి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. పరీక్షను నిర్వహించడానికి రెండు నెలల కంటే ఎక్కువ సమయం కోరడాన్ని మొదట ప్రశ్నించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం, ఆ తర్వాత కారణాలు నిజాయతీగా ఉన్నాయని పేర్కొంది. అయితే పరీక్షను నిర్వహించడానికి ఎన్‌బిఇకి ఇక సమయం ఇవ్వబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మే 30న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, పరీక్షను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాల్సి ఉందని ఎన్‌బిఇ కోర్టుకు తెలిపింది. అందువల్ల దాదాపు 1,000 పరీక్షా కేంద్రాలు అవసరమని చెప్పింది. జూన్ 15న జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య నిర్వహిస్తామని ఎన్‌బిఇ పేర్కొంది.

**మే 30న సుప్రీం ఏం చెప్పిందంటే?**

వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే నీట్‌కు సంబంధించి సుప్రీంకోర్టు మే 30న కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్15న తరువాయి 2లో

### కాళేశ్వరం వ్యయం పెంపుగురించి

# నాకేమీ తెలియదు

- బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి ప్రతి అంశాన్నీ మంత్రివర్గమే ఆమోదించింది
- సాంకేతిక నిపుణుల కమిటీ నివేదికపై నాటి సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు
- మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు
- పిసి ఘోష్ విచారణ కమిషన్ ముందు మాజీమంత్రి ఈటల



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ మంత్రివర్గమే ఆమోదించిందని టిఆర్ఎస్/బిఆర్ఎస్ హాయంలో నాటి ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన, ప్రస్తుత బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సాంకేతిక నిపుణుల కమిటీ నివేదికపై అప్పటి సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకుని, మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. సాంకేతిక నిపుణుల కమిటీ నివేదికపైన, మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులపైన ఒక సభ్యునిగా తాను కూడా సంతకం పెట్టానని చెప్పారు. బ్యారేజీల నిర్మాణ అంశం సాంకేతిక నిపుణులు చూసుకుంటారని, తమలాంటి వారికి సంబంధం లేదని ఈటల రాజేందర్ తరువాయి 2లో



# లొంగిపోవడం పరిపాటిగా మారింది

- ప్రధానిపై రాహుల్‌గాంధీ విమర్శలు
- మోదీని లొంగిపోవాలని తాను బలవంతం చేసినట్లు ట్రంప్ 11 సార్లు చెప్పినా నోరువిప్పలే
- బిహార్ భారత్‌కు నేర రాజధానిగా మారిందని మండిపాటు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి ఉద్ఘాటించారు. ఇటీవల కూడా ఆయన ఈ వ్యాఖ్యలే చేశారు. తాజాగా శుక్రవారం బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన 'సంవిధాన్ సురక్ష సమ్మేళన్' (రాజ్యాంగాన్ని రక్షించడానికి సింపోజియం)లో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మళ్లీ అదే విమర్శలు చేశారు. 'మోడీని లొంగిపోవాలని తాను బలవంతం చేశానని ట్రంప్ కనీసం 11 సార్లు చెప్పారు. అయితే మన ప్రధాని ఏ మాత్రం నిరసన తెలపలేకపోతున్నారు. కారణం, ట్రంప్ చెప్పినది వాస్తవమే' అని రాహుల్‌గాంధీ అన్నారు. ముఖ్యంగా, పాకిస్థాన్‌తో సైనిక వివాదం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు, మోదీకి ట్రంప్ 'నరేందర్.. సరెండర్ (లొంగిపోండి)' అని చెప్పారని రాహుల్ గాంధీ ఈ వారం ప్రారంభంలో భోపాల్‌లో పేర్కొన్నారు. అయితే రాహుల్ వ్యాఖ్యలపై బిజెపి మండిపడింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా దీనిని 'రాజద్రోహం' అని అభివర్ణించారు. ఉగ్రవాదులు భారతదేశం గురించి చెప్పగలిగే దానికంటే ఈ ప్రకటన చాలా అభ్యంతరకరంగా ఉందని బిజెపి అధికార ప్రతినిధి సుధాంషు త్రివేది హాఫీజ్ సయీద్ ఆరోపించారు. అయితే, రాజ్‌గిర్‌లో తన ప్రసంగంలో మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ 'నేను ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నాను, వారు చాలా సులభంగా లొంగిపోతారు. వారికి క్షమాభిక్ష పిటిషన్లు రాయడానికి ఎక్కువ తరువాయి 12లో

# త్వరలో మెట్టప్రాంతం సస్యశ్యామలం చేస్తాం

- మంత్రులు తుమ్మల, పొన్నం స్పష్టీకరణ
- హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతు మహోత్సవం ప్రారంభం
- కంపోస్టు ఎరువులు వాడాలని రైతులకు సూచించిన మంత్రులు



ప్రజాపక్షం/హుస్నాబాద్

త్వరలోనే మెట్టప్రాంతం సస్యశ్యామలం చేసేలా కృషి చేస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభమైన రైతు మహోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ రైతు మహోత్సవం రాష్ట్ర వ్యవసాయ శాఖ , జిల్లా పాలనాధికారి మనుచౌదరి నేతృత్వంలో నిర్వహించగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనుబంధ రంగాల నిపుణులు, స్టార్టప్ కంపెనీల వ్యవసాయ యంత్రాలతో స్టాళ్ల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 5 వేల మంది రైతులు హన్మకొండ, జనగామ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నుంచి తరలివచ్చారు. మంత్రులకు ఎడ్ల బండ్లతో, ఒగ్గు కళాకారులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల, అధికారుల సమన్వయంతో వ్యవసాయం సాగే చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని అన్నారు. మన తాతలు ఎక్కువ శాతం పేడ కంపోస్టు ఎరువుల వాడం చేసే వారు. నేడు అత్యధికంగా క్రిమిసంహారక మందులను వాడి భూముల సారం నష్టం చేస్తున్నామని తరువాయి 2లో

# పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు

### జి+3 పద్ధతిలో నిర్మాణం

- తొలివిడతలో హైదరాబాద్ నగరంలో 16 మురికివాడలు గుర్తింపు
- వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్ పట్టణంలోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను గ్రామీణ ప్రాంతాలలో ఒక కొలిక్కి తీసుకొచ్చిన నేపథ్యంలో, ఇక పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా,పేదలు ఉన్న పట్టణ ప్రాంతాల్లోనే జి+3 పద్ధతిలో ఇండ్లను నిర్మిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మఇండ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తరువాయి 2లో

### యాంత్రికంగా

# ముందస్తు బెయిల్ వద్దు

- 'సుప్రీంకోర్టు' త్రిసభ్య ధర్మాసనం హితవు
- పాట్నా హైకోర్ట్ నలుగురు నిందితులకు ఇచ్చిన యాంటిసిపేటరీ బెయిల్‌ను పక్కకుపెట్టిన 'సుప్రీమ్'

**న్యూఢిల్లీ :** తీవ్రమైన నేరాలలో పాల్గొన్నవారికి ముందస్తు బెయిల్‌ను యాంత్రిక ధోరణిలో ఇవ్వడం తగదని సుప్రీంకోర్టు సూచించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహ్‌తాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఒక హత్యకేసులో ఇచ్చిన యాంటిసిపేటరీ బెయిల్‌ను పక్కన పెడుతూ ఈ హితవు పలికింది. ఐపిసి 302, 307 సెక్షన్ల కింద తీవ్రమైన నేరాలలో పాల్గొన్న వారికి సంబంధించిన విషయమై ముందస్తు బియిల్‌ను మంజూరు చేయడానికి గల కారణాన్ని హైకోర్టు (పాట్నా) ఉత్తర్వు వెల్లడించలేదని తన మే 1 ఉత్తర్వుల్లో ధర్మాసనం తెలిపింది. ఇది తరువాయి 12లో


# ఈనెలలోనే మంత్రివర్గ విస్తరణ



- టిపిసిసి కార్యవర్గాన్ని కూడా విస్తరిస్తాం
- కొంతమంది ఎమ్మెల్యేలు తమ పనితీరును సమీక్షించుకోవాలి
- టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఈ నెలలోనే టిపిసిసి కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. కొంత మంది ఎంఎల్‌ఎలు తమ పనితీరును సమీక్షించుకోవాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఎంఎల్‌ఎలు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారంలో ఉన్నపుడు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తే పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని పార్టీ శ్రేణులు, నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ సమీక్ష సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగింది. సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి సలహా కమిటీ సభ్యులు తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ నిర్ణయానికి బ్రేక్
### హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థులపై నిషేధాన్ని నిలిపివేసిన కోర్టు


**వాషింగ్టన్:** హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల చేరికపై నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ఉత్తర్వులను అమలు పరచడానికి వీల్లేదంటూ బోస్టన్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి అలిసన్ బరోగ్స్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇజ్రాయెల్‌కు, యూదులకు వ్యతిరేకంగా కొంత మంది ప్రచారం చేస్తున్నారని, ఇది అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసే విధానంగా మారిందని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడంపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హార్వర్డ్ వర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్ట్రిక్ట్ కోర్టు విచారణకు స్వీకరించింది. ప్రాథమికంగా కేసును పరిశీలించి, ట్రంప్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ, హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడంపై ఎలాంటి నిషేధం వర్తించదని స్పష్టం చేసింది.

## ఎలాన్ మస్క్ కొత్త పార్టీ!



**వాషింగ్టన్:** టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు అలాన్ మస్క్ కొత్త పార్టీ పెట్టబోతున్నట్టు వస్తున్న వార్తలపై ఇప్పుడు అమెరికాలోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతున్నది. 'కొత్త పార్టీ పెట్టడానికి సమయం ఆసన్నమైందా?' అంటూ 'ఎక్స్' వేదికగా మస్క్ పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. నెటిజిన్లు భారీ సంఖ్యలో స్పందించడం గమనార్హం. సుమారు 81 శాతం మంది మస్క్ కొత్త పార్టీ పెట్టాలని సూచించారు. మస్క్ పెట్టిన పోస్టు పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మస్క్ బహిరంగానే యుద్ధం ప్రకటిస్తారని, ఆ క్రమంలోనే కొత్త పార్టీ పేరుతో భయపెట్టే అవకాశాలు కూడా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి నామినేషన్ వేసిన ట్రంప్‌కు మస్క్ సంపూర్ణ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్ చేతిలో ఓటమి ఖాయమనుకున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ అనూహ్యంగా గెలిచి, మస్క్‌కు 'డోజ్' శాఖను అప్పగించిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయని ఆరోపిస్తూ వచ్చిన మస్క్ చివరికి 'డోజ్' నుంచి వైదొలిగారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలపై విమర్శలు గుప్పిస్తునే ఉన్నారు. ట్రంప్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'పైన కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్త పార్టీ అంశాన్ని తెరపైకి తీసుకురావడం సంచలనం రేపుతున్నది. మస్క్ మస్తిష్కంలో ఏముందో అంచనా వేయడం కూడా కష్టంగా మారుతున్నది.

## ఎప్‌స్టెయిన్ ఫైళ్లలో ట్రంప్‌పేరు..
### మస్క్ సంచలన ఆరోపణ



**వాషింగ్టన్:** నిన్నమొన్నటి వరకూ చెట్టపట్టాలేసుకొని తిరిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ హఠాత్తుగా బద్ధ శత్రువులుగా మారి పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఈ రేసులో ట్రంప్ కంటే మస్క్ ముందంజలో ఉండడం గమనార్హం. తన మద్దతు లేకుంటే 2024 అమెరికా ఎన్నికల్లో డొనాల్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ నేతలు ఓటమి పాలయ్యేవారని మస్క్ వ్యాఖ్యానించారు. 'నేను లేకుంటే డొనాల్డ్ ట్రంప్ ఓడిపోయేవారు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు ఆధిక్యం సాధించేవారు. సెనెట్‌లో రిపబ్లికన్లు 5149 మంది మాత్రమే ఉండేవారు' అని మస్క్ పేర్కొన్నారు. అయితే, మస్క్ వ్యాఖ్యలను ట్రంప్ తోసిపుచ్చారు. తాను అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించడానికి మస్క్ అవసరం లేదని స్పష్టం చేశారు. అతను లేకున్నా పెన్సిల్వేనియాలో తాను గెలిచేవాడినని తెలిపారు. అమెరికాను అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించే 'ది బిగ్ బ్యూటిఫుల్ బిల్'పై మస్క్ వైఖరితో తాను విసిగిపోయినట్టు ట్రంప్ పేర్కొన్నారు. ఎవరు అడ్డుకున్నా, బిల్లును ముందుకు తీసుకెళతానని స్పష్టం చేశారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే 'ఎప్‌స్టెయిన్' కేసు ఫైళ్లలో ట్రంప్ పేరు ఉందంటూ మస్క్ బాంబు పేల్చారు. సంపన్నులకు యువతులు, బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు కేసులో జెఫ్రీ ఎప్‌స్టెయిన్ ప్రధాన నిందితుడు. అతను ఈ విధంగా మహిళలు, బాలికలను సప్లయి చేసిన సన్నిహితులు, క్లయింట్లకు సంబంధించిన డేటాను 'ఎప్‌స్టెయిన్ ఫైల్స్'గా పేర్కొంటారు. ఆ ఫైళ్లలో ట్రంప్ పేరు కూడా ఉందని మస్క్ ఆరోపించడం అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఎప్‌స్టెయిన్ క్లయింట్లలో ట్రంప్ కూడా ఉన్నారనే అభిప్రాయం కలిగించే ఈ వ్యాఖ్యలపై జోరుగా చర్చ కొనసాగుతున్నది. మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులు, రాయితీలకు కోత వేస్తానని ట్రంప్ హెచ్చరించిన తర్వాత, ఇలాంటి ఆరోపణలు జోరందుకోవడం గమనార్హం.



## టెస్లా షేర్లు ధమాల్..

**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదిస్తున్న టెస్లా అధినేత అలాన్ మస్క్‌కు భారీ షాక్ తగిలింది. అతనికి సంబంధించిన వ్యాపారాలకు సంబంధించి ప్రభుత్వపరంగా ఉన్న రాయితీలపై కోత విధిస్తానని, ప్రభుత్వ కాంట్రాక్టుల విషయాన్ని పునరాలోచిస్తానని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే టెస్లా షేర్లు దారుణంగా పతనమయ్యాయి. 14 శాతం మేర షేర్ల పతనంతో మస్క్ సామ్రాజ్యానికి 153 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో 13లక్షల కోట్లు)కుపైగా నష్టం వాటిల్లింది. వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్స్‌లో నాలుగు సెషన్స్‌లో టెస్లా షేర్ల అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దీనితో మార్కెట్‌లో షేర్ విలువ పతనమైంది. టెస్లా కంపెనీ మార్కెట్ విలువ ఒక ట్రిలియన్ డాలర్ల మార్క్ కంటే దిగువకు పడిపోయి, 916 బిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. టెస్లా సంపద ఒక్కరోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి. గత నెల టెస్లా షేర్లు 22శాతం పెరిగాయి. కానీ, ట్రంప్‌తో విభేదాల అనంతరం డిమాండ్ క్రమంగా పతనమవుతున్నది. రాయితీలపై పునరాలోచన ఉందంటూ ట్రంప్ ప్రకటించడంతో, మస్క్‌తో అతని విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్టు స్పష్టమవుతున్నది. భవిష్యత్తుపదై ఆందోళన వ్యక్తం చేస్తున్న మదుపరులు, తమతమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి ఆతృత ప్రదర్శించడంతో షేర్ మార్కెట్‌లో టెస్లా భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ ఒరవడి మరికొంతకాలం కొనసాగే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు అంటున్నారు.

## బీరూట్‌పై ఇజ్రాయెల్ తాజా దాడులు



**బీరూట్ :** లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ తాజాగా మరోసారి వైమానిక దాడులు నిర్వహించింది. ఈద్‌-అల్‌-అదా సెలవుల కారణంగా, బీరూట్ అప్రమత్తంగా లేనప్పుడు ఈ దాడులు జరగడం గమనార్హం. బీరూట్ దక్షిణ సరిహద్దులో దాడులు జరిగాయని లెబనాన్ ప్రకటించగా, ఇజ్రాయెల్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెజ్బొల్లా స్థావరాలను గుర్తించామనని, అందుకే, దాడి చేయాల్సి వచ్చింది ఇజ్రాయెర్ వివరణ ఇచ్చింది. అయితే, ఈ వాదనను లెబనీస్ ఆర్మీ తోసిపుచ్చింది. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగానే బీరూట్ జనవాసాలపై దాడులుకు పాల్పడుతున్నదని ఆరోపించింది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే, హెజ్బొల్లాతో ఇజ్రాయెల్ శాంతి చర్చలకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేమని స్పష్టం చేసింది. సుమారు 14 నెలలు కొనసాగిన హెజ్బొలా- ఇజ్రాయెల్ యుద్ధానికి గత ఏడాది నవంబర్ మాసంలో తాత్కాలికంగా తెరపడింది. కాల్పుల విరమణ, చర్చలకు ఇరు వర్గాలు అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న ఇజ్రాయెల్ పలు సందర్భాల్లో దాడులకు పాల్పడుతునే ఉంది. తాజా దాడులపై లెబనీస్ ఆర్మీ తీవ్రంగా స్పందిస్తూ, కాల్పుల విరమణ పర్యవేక్షణ బాధ్యత నుంచి వైదొలగుతామని హెచ్చరించింది. దీనిపై ఇజ్రాయెల్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## ఇందిరమ్మ ఇళ్లు
(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండేందుకు ఇష్టపడుతున్నారని, ముఖ్యంగా హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే ,తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో పేదలు ఇండ్లు తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని వివరించారు. హైదరాబాద్ కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మిస్తే, సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారని, ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్టు తేలిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్న ప్రాంతాల్లోనే జి+3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగం గా తొలివిడతలో హైదరాబాద్లో 16 మురికివాడలను గుర్తించామని. అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండ్ల మంజూ రు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**గిరిజనులకు 22,016 ఇండ్ల మంజూరు**

భద్రాచలం, ఉట్నూరు, ఏటూరు నాగారం, మున్ననూరు నాలుగు ఐటిడిఎ పరిధిలోని చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 16 ఎస్‌టి నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేశామని, గిరిజనులకు ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ ఇండ్లకు తక్షణమే లబ్ధిదారులను గుర్తించి, ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవారి ఇంటి కోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

## ఆగస్టు 3న నీట్ పిజి
(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న నీట్ పిజి 2025ను ఒక షిఫ్ట్‌లోనే ముగించాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజ య్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడం కొన్ని సమస్యలకు కారణమవుతోందని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీ క్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెం డు ప్రశ్నాపత్రాలు ఎప్పటికీ ఒకే విధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కు ర్యాం కు నిర్ధారణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకునే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది. దేశమంతా ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడం కష్టంకాబోదని చెబుతూ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆ తర్వాత జూన్ 15న జరగాల్సిన నీట్ పిజి పరీక్ష వాయిదా వేస్తున్నట్లు ఎన్‌బిఇ ప్రకటించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది నీట్‌ను ఒకే షిఫ్టులో నిర్వహిస్తామని ఎన్‌బిఇ స్పష్టం చేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టు అనుమతులు ఇచ్చిన మేరకు, ఆగస్టు 3న పరీక్షను నిర్వహించనుంది.

## పాక్‌దాడి
(మొదటి పేజీ తరువాయి)

ఆధారపడిన గైడ్‌లు, పోనీ ఆపరేటర్లు, గెస్ట్ హౌస్ యజమానులు, దుకాణాల యజమానులు, రోడ్డు పక్కన ఉన్న ధాబా ఆపరేటర్ల జీవనోపాధిని పాక్ నాశనం చేయాలనుకుంటోందని ధ్వజమెత్తారు. ఉగ్రవాదులను సవాలు చేసిన ఆదిల్ కూడా తన జీవనోపాధి కోసం అక్కడే ఉన్నాడని, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన 26 మందిలో ఒకరైన పోనీవాలా గురించి ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లో దాక్కున్న ఉగ్రవాదులపై భారత దళాలు విధ్వంసం సృష్టించి ఒక నెల అయిందని ప్రధాని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి పాకిస్థా విన్నప్పుడల్లా, దాని అవమానకరమైన ఓటమిని గుర్తు చేసుకుంటుందన్నారు. ఉధంపూర్‌-శ్రీనగర్‌-బారాముల్లా రైలు లైన్ ప్రాజెక్ట్ సాధికారత కలిగిన జమ్ముకశ్మీర్‌కు సరికొత్త చిహ్నంమన్నారు. చినాబ్, అంజి వంతెనలు జమ్ముకశ్మీర్ శ్రేయస్సుకు ద్వారాలుగా పనిచేస్తాయని ఆయన అన్నారు. 272 కి.మీ. ఉధంపూర్‌-శ్రీనగర్‌-బారాముల్లా రైల్వే లింక్ (యుఎస్‌బిఆర్‌ఎల్) పూర్తయినందుకు గుర్తుగా వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించే ముందు ప్రధానమంత్రి రెండు అత్యాధునిక వంతెనలను ప్రారంభించారు. ఇది లోయకు ప్రత్యక్ష రైలు కనెక్టివిటీని అందిస్తుంది.

**ఎత్తయిన వంతెన ప్రారంభించిన మోదీ**

చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. రూ.1,486 కోట్లతో నిర్మించిన ఈ వంతెన ఎనిమిది సంవత్సరాల తరువాత పూర్తయింది. వంతెన ప్రారంభించిన తరువాత మోదీ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని దానిపై నడిచారు. చినాబ్ వంతెన తర్వాత, అంజి నదిపై భారతదేశంలో మొట్టమొదటి తీగలతో అనుసంధానించిన రైలు వంతెనను మోదీ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందు, మోదీ రైలు ఇంజిన్ కోచ్‌లో ప్రయాణించి ఆ ప్రదేశానికి చేరుకున్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రియాసి జిల్లాలోని త్రికుట కొండలపై ఉన్న వైష్ణో దేవి మందిరాన్ని సందర్శించే యాత్రికులకు బేస్ క్యాంప్ అయిన కాట్రా కోసం రూ.46,000 కోట్లకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. సుమారు రూ.43,780 కోట్ల వ్యయంతో నిర్మించిన 272 కి.మీ యుఎస్‌బిఆర్‌ఎల్ ప్రాజెక్ట్‌లో 119 కి.మీ.ల విస్తీర్ణంలో 36 సొరంగాలు, 943 వంతెనలు ఉన్నాయి.

**చినాబ్ వంతెన ప్రత్యేకతలివీ..**

రైలు మార్గం ద్వారా కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్‌-శ్రీనగర్‌-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో ఈ వంతెన భాగం. చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మించారు. దీని పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకు చైనాలోని బెయిపాన్ నదిపై ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్లు ఎత్తు) పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. అతివేగం, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని నిర్మించారు. దీని ప్రారంభంతో జమ్ము నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. ఈ వంతెన జీవితకాలం దాదాపు 120 ఏళ్లు అని ఇంజినీర్లు చెప్తున్నారు. దీనిపై గరిష్ఠంగా 100కి.మీ. వేగంతో రైలు వెళ్లే అవకాశం ఉంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన దీని నిర్మాణానికి కేంద్రం సుమారు రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. అలాగే 28వేల టన్నుల ఉక్కును వినియోగించినట్లు తెలుస్తోంది. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. అంటే 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది.

## నాకేమీ తెలియదు
(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పి.సి. చంద్రఘోష్ విచారణ కమిషన్ హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పి.సి చంద్రఘోష్ కమిషన్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు జరిగిన విచారణలో బ్యారేజీల నిర్మాణ ఆవశ్యకత, బ్యారేజీ మార్పు, ఆర్థిక, సాంకేతిక, డిపిఆర్‌కు సంబంధించిన పలు అంశాలపైన జస్టిస్ పి.సి.చంద్రఘోష్ అడిగిన పలు ప్రశ్నలకు ఈటల రాజేందర్ సమాధానమివ్వగా కొన్ని ప్రశ్నలకు 'ఐ డొంట్ నో' అని సమాధానమిచ్చారు. తమ్మిడిహట్టి ప్రాజెక్ట్ కు నీటి లభ్యత లేదని సెంట్రల్ వాటర్ కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసిందని, మహారాష్ట్ర ప్రభుత్వం కూడా 152 మీటర్ల ఎత్తుకు ఒప్పుకోలేదని, కేవలం 148 మీటర్లకే అంగీకరించిందని వివరించారు. సాంకేతిక నిపుణుల కమిటీ అధ్యయనం చేసి, బ్యారేజీల నిర్మాణంపైన నివేదికను అందజేసిందని వివరించారు. ఈనివేదికపైన అప్పటి సిఎం(కెసిఆర్) నిర్ణయం తీసుకున్నారని, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఛైర్మన్‌గా సభ్యులుగా తుమ్మల నాగేశ్వర్ రావు, ఈటల రాజేందర్‌తో (తాను) సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఈటల రాజేందర్ కమిషన్‌కు సమాధానం ఇచ్చారు. సాంకేతిక నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయించామని, మంత్రివర్గ ఉప సం ఘం సిఫార్సులపై తనతో పాటు సభ్యులంతా సంతకం చేశారని ఈటల సమాధానమిచ్చారు. ఆ నివేదికను మం త్రివర్గానికి సమర్పించామని వివరించారు. దీనిపైన మం త్రి వర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని, బ్యారేజీలకు సంబంధించి అన్ని విషయాల పైన కూడా పూర్తి మం త్రివర్గమే ఆమోదించిందని ఈటల రాజేందర్ చెప్పారు.

**'కాళేశ్వరం' వ్యయం ఎంత పెరిగిందో తెలువదు**

బ్యారేజీల నిర్మాణానికి తొలుత రూ.63,000 కోట్లను ప్రతిపాదించారని, ఆ తర్వాత రైతుల నుంచి వచ్చిన డిమాండ్లు, తదితర అంశాలకు అనుగుణంగా రూ. 85,000 కోట్లకు పెరిగిందని, ఆ తర్వాత ప్రాజెక్ట్ వ్యయం ఎంత పెరిగిందో తనకు తెలువదని సమాధానం ఇచ్చారు. తెలంగాణ కొత్త రాష్ట్రంలో ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి తగినంత నిధులు లేవని, నిధుల సేకరణ నిమ్మిత్తమే 'కాళేశ్వరం కార్పొరేషన్'ను ఏర్పాటు చేశారని ఈటల రాజేందర్ తెలిపారు. కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆర్థిక శాఖతో ఎటువంటి సంబంధం లేదని, నిధుల విషయం మొత్తం కార్పొరేషన్ చూసుకున్నదని తెలిపింది.

**ఏ ఉద్దేశంతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు..?**

కాళేశ్వరం కార్పొరేషన్ ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేశారన్న కమిషన్ ప్రశ్నకు ఈటల రాజేందర్ సమాధానమిస్తూ కొత్త రాష్ట్రం, ప్రాజెక్ట్ నిర్మాణానికి సరిపడ నిధులు లేవని, నిధుల సమీకరణ నిమ్మితం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్టు వివరిం చారు. కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందారని, ఆ రుణాలకు ప్రభు త్వం గ్యారంటీ ఇచ్చిందని, ప్రతి కార్పొరేషన్ తీసుకునే రుణాలకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుందని ఈటల తెలిపారు. రుణాలను తిరిగి ఎలా చెల్లించాలన్న కమిషన్ ప్రశ్నకు ఈటల సమాధానమిస్తూ పరిశ్రమలు, తాగు నీటి ద్వారా డబ్బులు వసూలు చేస్తామని డిపిఆర్ లో పొందుపర్చిన విషయాన్ని తెలిపారు.

**ఆర్థిక క్రమశిక్షణ 'ఇరేగిషన్'దే బాధ్యత...**
**ఆర్థిక శాఖకు సంబంధం లేదు..**

బ్యారేజీల నిర్మాణ సమయంలో ఆర్థిక క్రమ శిక్షణ లోపించిందా?, క్రమశిక్షణను పాటిం చారా? అని జస్టిస్ పిసి.ఘోష్ అడిగిన ప్రశ్నకు ఈటల రాజేందర్ సమాధానమిస్తూ, నీటిపారుదల శాఖలో ప్రత్యేకంగా అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఉంటుందని, ఆ విభాగామే నిధుల వ్యవహారం చూసుకుంటుందని చెప్పా రు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రాజెక్టలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను మాత్రమే ఆర్థిక శాఖ విడుదల చేస్తుందని, మిగతా అంశాలు ఆ శాఖలోని అకౌంట్ విభాగానిదే బాధ్యత అని అన్నారు. ఎంత నిధులు, ఎంత ఖర్చు అనేది మొత్తం నీటి పారుదల శాఖదే బాధ్యత అని ఈటల సమా ధానమిచ్చారు. నిధుల విషయం అకౌంట్, ఆడిట్ వారే పర్యవేక్షిస్తారని, తమకు తెలియదని ఈటల అన్నారు.

## సస్యశ్యామలం చేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

అలా కాకుండా కంపోస్టు ఎరువుల వాడకంతో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. హుస్నాబాద్‌లో పంటలు మంచి దిగుబడులు వస్తే గోదాములు ఏర్పటు చేస్తామని అన్నారు. రైతులు ముఖ్యంగా ఆయిల్‌ఫాం, పట్టుపరిశ్రమ పంటలు వేస్తే అందులో అంతర్ పంటలతో అధిక లాబాలను పొందవచ్చని అన్నారు. రైతులు పాడి పరిశ్రమ, గేదెలు, చేపలు వ్యవసాయ అనుబంధ రంగాల్లో దృష్టిపెట్టాలని కోరారు.

**హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేసి నియోజకవర్గంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : పొన్నం ప్రభాకర్‌గౌడ్**

హుస్నాబాద్ మెట్టప్రాంతం ఇక్కడ తొండలు గుడ్లుపెట్టే ప్రాంతంగా పేరు గాంచిన హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 2007లో వైఎస్ రాజాశేఖర్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని మంత్రి పొన్నం తెలిపారు. గత పదేళ్లుగా ఈ ప్రాంతంలోని ప్రాజెక్టును పూర్తి చేయకుండా రైతులు విస్మరించారని అరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 473 కోట్లు కేటాయించిందని, తొందరలోనే ప్రాజెక్టు పనులను, ఉపకాల్వలను పూర్తి చేసి నియోజకవర్గంలో రైతులకు సాగు నీరు అందిస్తామని అన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక యంత్రాలు కిసాన్ మేళా రైతులకు ఎంతగానో ఉపమోగపడుతుందని అన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నాలుగు జిల్లాల రైతులకు అనుసంధానంగా ఉందని ఇలాంటి మేళాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. మెట్టప్రాంత రైతులకు పంటలపై అవగాహన కల్పించేందకు కిసాన్‌మేళా నిర్వహించాలని కోరగానే మంత్రి తుమ్మ ల నాగేశ్వర్‌రావు సంబంధిత అధికారులను అదేశించి, ఇక్కడ రైతు మేళా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పట్టుపరిశ్రమ, పామాయిల్ పంటల రైతులను కూరగాయలు పండించి అత్యధిక లాభాలను పొందిన రైతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ నాగేశ్వరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, వివిధ శాఖల కమిషనర్లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, అదనపు కలెక్టర్ అబ్దుల్‌హామీద్, ఆర్డివో రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టు
(మొదటి పేజీ తరువాయి)

వస్తే అన్ని నిబంధనలను పరిశీలించి, చట్టంప్రకారమే తాము ముందుకెళ్తామని ఆయన(కేంద్రమంత్రి) మే 28న తనకు లేఖ రాశారని ఉత్తమ్ వివరించారు.

హైదరాబాద్, సచివాలయంలోని తన ఛాంబర్‌లో జర్నలిస్టులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఇష్టగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇది వరకే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు కూడా లేఖ రాశామని, అంతకుముందు శాఖ పరంగా లేఖలు పంపించారని ఉత్తమ్ వివరించారు. కేంద్ర మంత్రి పాటిల్‌కు రాసిన లేఖలో తాను ఎపి ప్రభుత్వ ఉల్లంఘనలతో అన్ని అంశాలను వివరించామన్నారు. చట్టవిరుద్ధంగా ఎపికి కేంద్రం సహకరిస్తుందని తాను అనుకోవడం లేదన్నారు. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

**'కృష్ణ'లో బిఆర్‌ఎస్ హయాంలోనే ఎక్కువ అన్యాయం...**

కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ఎపి ప్రభుత్వానికి సహకరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టిఎంసిలు ఆంధ్రకు వెళ్తే ,తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల బిఆర్‌ఎస్ హయాంలో 1254 టిఎంసిలు ఎపికి తరలించారని మండిపడ్డారు. తుమ్మిడిహట్టి వద్ద కాకుండా మేడిగడ్డ వద్ద బ్యారేజిని నిర్మిస్తే, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు రూ.68వేల కోట్లను అదనంగా ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవని ఉత్తమ్ వివరించారు. ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు చాలని సంతకం చేసిందే బిఆర్‌ఎస్ ప్రభుత్వమని, అప్పుడు కృష్ణా నీళ్లలో మోసం చేసి, ఇప్పుడు ఆ పార్టీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ నాయకులు తమ పేర్లను 'జోసఫ్ గోబెల్స్ రావు'గా మార్చుకోవాలని ఉత్తమ్ ఎద్దేవా చేశారు.

## దెయ్యాల రాష్ట్ర సమితి
(మొదటి పేజీ తరువాయి)



మూడు దశాబ్దాల కల గంధమల్ల ప్రాజెక్ట్, ఎస్‌ఎల్‌బిసి, బునాధిగాని కాల్వలను పూర్తిచేయడంలో పూర్తి నిర్లక్ష్యాన్ని కనబర్చి రైతులకు సాగునీరు అందించలేకపోయిందని విమర్శించారు. రైతులు ఒక్క ఎకరా భూమి కోల్పోకుండా రూ.700 కోట్లతో గంధమల్ల పనులను చేపట్టి అదనంగా 60వేల ఎకరాలకు నీళ్లందిస్తామని ఈ సందర్భంగా ప్రజలకు హామీనిచ్చారు. అదేవిధంగా డిండి ప్రాజెక్టు పూర్తిచేసేందుకు నీళ్లు, నిధుల వరద పారించి వ్యవసాయభూములను సస్యశ్యామలం చేస్తామన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటుచేసి బడుగు బలహీన మైనార్టీ వర్గాల ప్రజల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు దీటుగా నాణ్యమైన విద్యనందించి ఐఏయస్, ఐపియస్, డాక్టర్లు, ఇంజీనీర్లుగా తీర్చిదిద్దుతామన్నారు. అందులో భాగంగానే ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్ల రాష్ట్ర నిధులతో స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. తరతరాల నాటినుండి యాదగిరిగుట్టగా వెలుగొందుతున్న యాదగిరిలక్ష్మీ నరసింహ్మస్వామి దేవాలయం పేరును కెసిఆర్ తన కీర్తి ప్రతిష్ఠలకోసం 'యాదాద్రి'గా పేరు మార్చారని అందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నారని అన్నారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే యాదాద్రి పేరును 'యాదగిరిగుట్ట'గా మార్చామని, 60 కిలోల బంగారంతో స్వర్ణగోపురం ఏర్పాటు, వైటిడిఎ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజితోపాటు విద్యాసంస్థల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. గత ప్రభుత్వం నిషేధించిన గుట్టపై నిద్రచేస్తామని మొక్కుకున్న భక్తుల కోరికలను నెరవేర్చుకునేలా అదేవిధంగా ఆటోలను గుట్టపైకి అనుమతించి ఆటోలే జీవనోపాధిగా ఉన్న కుటుంబాలను ఆదుకున్నామని అన్నారు. ఇప్పటికే 60వేల విద్యావంతులైన నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించామని, దేశంలోనె ఆదర్శంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టి బలహీన వర్గాల ప్రజలకు 56.36 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. గోదావరి నీళ్లతో మూసి నదిని నింపి మూసి ప్రక్షాళన చేపడదామంటే బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గుజరాత్‌లో సబర్మతీ నదిని, యుపిలో గంగానదిని, డిల్లీలో యమునానదిని ప్రక్షాళన చేస్తే తప్పులేదు కానీ మూసీనదిని ప్రక్షాళన చేస్తే తప్పేంటని బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పేదలకు ఉచిత సన్నబియ్యం పథకం, గృహవసరాలకు ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున లింకేజి రుణాలు, నిరుపేదలకు ఇండ్ల పట్టాలు, పథకాలను ప్రజలకు వివరించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి దెయ్యాల రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... గతంలో పాలన చేపట్టిన ప్రభుత్వం ఇరిగేషన్ అంటే కమీషన్‌కే పరిమితమైందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 120 చెరువులను నింపిన ఘనత దక్కిందన్నారు. రూ.1800కోట్లతో డిండి ప్రాజెక్టు పూర్తికి శ్రీకారం చుట్టామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రానున్న రోజులలో ఎల్లంపల్లి ఎత్తుపెంచి, గోదావరి జలాలతో గంధమల్ల ప్రాజెక్టు నింపి, రైతులు ఎకరం భూమినీ కోల్పోకుండా 60వేల ఎకరాలకు సాగు నీరందించి తీరుతామన్నారు.ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ... గత బిఆర్‌ఎస్ పాలనలో ఆలేరు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టు ఆలేరుకు తలాపున్నే ఉన్నా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తన నియోజకవర్గానికే నీళ్లందించారని, ఆలేరు నియోజకవర్గంలోని ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని ధ్వజమెత్తారు. ఆలేరు ప్రజలకు అండగా ఉండి రూ.1500 కోట్ల నిధులను కేటాయించి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ చింతపండు నవీన్, శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామ్యేల్, వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ కె.హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మహిళా విభా గం జిల్లా అధ్యక్షురాలు పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పలువురు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ముస్లిం సోదరులకు సిఎం బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్) పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటున్నారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ప్రవక్తల అచంచలమైన దైవభక్తి, త్యాగనిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని, బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ చాటిచెపుతోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# చిరస్మరణీయుడు చంద్ర

ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడలలో నడవాలి


సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా చంద్ర రాజేశ్వర్‌రావు 111వ జయంతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు జయంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్య వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ నివాళులర్పించారు. అనంతరం అజీజ్‌పాషా మాట్లాడుతూ సిపిఐకి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలపారు. ఈ కార్య క్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, రమావత్ అంజయ్య నాయక్, సిపిఐ కార్యాలయ కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, ఎఐవైఎఫ్ నాయకులు మాజిద్ అలీ ఖాన్, సందీప్, సత్తిబాబు, విజయ్ పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** ప్రతి ఒక్కరూ చంద్ర రాజేశ్వర్ రావు అడుగుజాడలలో నడుస్తూ సిపిఐ బలోపేతా నికి కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా తెలిపారు. శుక్రవారం కొండాపూర్ లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లో ఆయన 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు, సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అజీజ్ పాషా, సిఆర్ ఫౌండేషన్ కార్యద ర్శులు చెన్నమనేని వెంకటే శ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రావులు విచ్చేసి, చంద్ర రాజేశ్వర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



సిఆర్ జీవితం దేశం గర్వ పడేవిధంగా కృషి చేశారని, ఆయన బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎన్నో త్యాగాలను చేశారని, ఒకసారి నార్త్ ఇండియా లోని ఒక జిల్లాలో సంక్షోభం ఏర్పడితే వారం రోజులు అక్కడే ఉండి ప్రజల బాగోగులను చూసు కుంటూ 500 మందిని రక్షించారని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుతూ పెరుగుతున్న కాలు ష్యాన్ని అరికట్టాలంటే తప్పకుండా చెట్లను నాటి వాటిని రక్షించాలని తెలి పారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కోశా ధికారి చెన్నకేశవరావు, ఆరోగ్యశ్రీ కేంద్రం డైరె క్టర్ రజని, ఎఐటియుసి మాజీ కార్యదర్శి బివి.విజయలక్ష్మి, మాహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మండవ గోపిచంద్, తమ్మారెడ్డి తాన్య, రాజేంద్రరావు, డాక్టర్ సరస్వతి, లలిత, మేరీ, సిఆర్ ఫౌండేషన్ హోమ్ మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు, మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థినులు, సిపిఐ నాయకులు తదితరులు విచ్చేసి సిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

# ‘టాస్క్’ ద్వారా 4,100 మందికి ఉద్యోగాలు

మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈ విద్యా సంవత్స రంలో కనీసం 6వేల మంది నిరుద్యోగులకు అధునాతన సాంకేతిక శిక్షణ అందించి ప్లేస్ మెంట్స్ కల్పించేలా భారీ లక్ష్యం నిర్దేశించుకోవా లని తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి (టాస్క్) అధికారులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ‘టాస్క్’ చేపడు తున్న కార్యక్రమాలపై మంత్రి శ్రీధర్‌బాబు శుక్ర వారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గడచిన ఏడాది కాలంలో 4100 మంది ఉద్యో గాలు పొందడంలో టాస్క్ క్రియాశీలకంగా వ్యవ హరించడం పట్ల శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేసారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు నైపుణ్యా లను అందించడంలో టాస్క్ గణనీయమైన పురో గతి సాధించిందని ఆయన తెలిపారు. ఇండస్ట్రీ అవసరాలకు తగిన విధంగా ఆయా స్కిల్స్‌లో శిక్షణ అందించి ఉద్యోగాలు పొందడంలో సాయం చేస్తోందని చెప్పారు. గడచిన ఏడాది కాలంలో టాస్క్ సంస్థ రికార్డు స్థాయిలో 1,37,677 మంది విద్యార్థులు, 2791 మంది ఫ్యాకల్టీ సభ్యులకు వివిధ సాంకేతిక, నైపుణ్య అంశాల్లో శిక్షణ అందించిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. 21 జిల్లాల్లోని 148 కళాశాలు, పలు కంపెనీల ప్రాంగాణాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో 4100 మంది ప్రతిభావంతులు ఉద్యోగాలు పొందడంలో టాస్క్ కీలక పాత్ర పోషించింది. వెరిస్క్ ఎనలైటిక్స్ అనే అమెరికన్ కంపెనీ హైదరాబాద్ క్యాంపస్ కోసం ఏడాదికి రూ.11లక్షల ప్యాకేజితో సాంకే తిక నిపుణులను ఎంపిక చేసుకుంది. ఉద్యోగాలు సాధించిన మొత్తం 4100 మందిలో, కనీస వార్షిక ప్యాకేజి రూ.2.4 లక్షలు. హ్యుండాయ్ మోబిస్ సంస్థ టాస్క్ ద్వారా 42 మందికి శిక్షణ అందించి ఉద్యోగాల్లో నియమిం చుకుంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (యుబిఎస్) రూ.6 లక్షల వార్షిక ప్యాకేజితో 63 మందిని రిక్రూట్ చేసుకుంది. వన్‌ఎంవన్‌బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ఫౌండేషన్ తెలంగా ణాలో ఏర్పాటు చేసిన గ్రీన్ స్కిల్స్ అకాడమీ ద్వారా మేడ్చల్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల నుంచి 7,000 మంది విద్యార్థులు శిక్షణ పొందారు.

## అనధికార నిర్మాణాలను ఆపండి

హెచ్‌ఎండిఎకు హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట్ మండలం బౌరంపేట్ గ్రామ పరిధిలోని సర్వే 345/పి, 347/పి నెంబర్ల పరిధిలోని రక్షణ సంస్థకు సమీపంలో అనధికారిక నిర్మాణాలను చేపట్టడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. జాతీయ భద్రత కారణాల రీత్యా వెంటనే ఆ నిర్మాణాలను నిలిపివేయాలని హెచ్‌ఎండిఎకు ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలతో అంతర్గత భద్రతకు ముప్పు ఏర్పడే ఆస్కారాలు ఉన్నం దున వెంటనే నిలిపివేత చర్యలు తీసుకోవాలంది. రక్షణ సంస్థలను ఆనుకుని ఉన్న భూమిలో తమ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారంటూ రక్షణ మంత్రిత్వ శాఖ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలేదన్న పిటిషనర్ వాదనలను పరిగణనలోకి తీసుకు న్నారు. తొలుత పిటిషనర్ తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్ వాదిస్తూ 2012, ఏప్రిల్ 7న మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన జీవో నంబర్ 168 ప్రకారం సంబం ధిత రక్షణ శాఖ అధికారుల నుంచి ఎన్‌వోసి తీసుకోవాలన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనను తొలగిస్తూ 2016లో జీవో నంబర్ 7ను జారీ చేసిందన్నారు. ఈ జీవో2011, మే 18న రక్షణ శాఖ జారీ చేసిన మార్గదర్శ కాలకు వ్యతిరేకమన్నారు. రక్షణ పనుల చట్టం–1903 నిబంధనలకు విరుద్ధ మన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్లు, అనధికారిక ప్రతివాదులు రక్షణ సంస్థ ప్రాంతాలు, వాటి వివరాలను తమకు సమర్పించనందున వారికి విజ్ఞప్తి మేరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. వౌడా సెక్షన్ 3 కింద నోటిఫికేషన్ లేదా డిక్లరేషన్ ప్రచురించడానికి పిటిషనర్లకు 2025, డిసెంబర్ 31 వరకు గడువు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఒకవేళ అది ఇప్పటికే జారీ చేసి అమలు కాకుంటే, నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. 2016 తర్వాత భవన నిర్మాణ అనుమతులపై కేంద్రం 2011 మార్గదర్శకాల ఆధారంగా ఎటువంటి చర్య తీసుకోకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది.


తెలంగాణ ప్రభుత్వం
ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ)
ఆర్.ఎల్.ఐ.యస్.పి. యూనిట్-1 మఖ్తల్

గెజిట్ నెం: 31/2025 తేది: 02.06.2025
లేఖ సంఖ్య : B/48/2020 తేది: 08.05.2025
లేఖ సంఖ్య: జి/510/2025 తేది: 23.05.2025

FORM-VI (NOTIFICATION)
(SEE SUB - RULE(1) OF RULE - 19 AND SECTION - 11 (1) OF THE ACT-30/2013)
ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వానికి / రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం - ఎల్.ఎల్. ఎడమ ప్రధాన కాలువ సంగంబండ బ్యాలన్సింగ్ రిజర్వాయర్ పనుల నిమిత్తం నారాయణపేట జిల్లాలో నర్వ మండలం యొక్క లంకాల గ్రామం రూపొందించుట కొరకు నారాయణపేట జిల్లాలో నర్వ మండలం యొక్క లంకాల గ్రామం పరిమితిలో అవసర నిమిత్తం సేకరించనైనది.
భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి (రూల్ 6/12 చూడుము). పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం నారాయణపేట జిల్లాలో నర్వ మండలం యొక్క లంకాల గ్రామం ప్రామాణిక కొలత కంటే తక్కువ **ఎకరం.1.14.4 గుంటలు** గల భూమి కొలిచే డివిజన్ భూమి, దీని వివరాల వివరణ ఈ క్రింది సముపార్జన కోసం ప్రతిపాదించబడినట్లు తెలియజేయబడింది.

షెడ్యూల్

| గ్రామం: లంకాల | | | | | మండలం: నర్వ | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| క్ర. సం. | సర్వే నెం. | పట్టా వర్గీకరణం | భూ వర్గీకరణం | [illegible] | పట్టాదారు పేరు / అనుభవగారు పేరు | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 1 | 305 | ప్రభుత్వం | మెట్ట | 0.11 (గుంటలు) | నల్లా హన్మంతు S/o కూరుమన్న (0.10) వీరణ గౌడ్ S/O క్రిష్ణయ్య గౌడ్ (0.17) | - | - | - | - |
| 2 | 304 | ప్రభుత్వం | మెట్ట | 0.01 (గుంటలు) | పట్టేదారాలు ఇడిగి వీరణా గౌడ్ S/o క్రిష్ణయ్య గౌడ్ G పద్దమ్మా W/o క్రిష్ణయ్య గౌడ్ రాములు S/o క్రిష్ణయ్య గౌడ్ ఇడిగి క్రిష్టయ్య గౌడ్ S/o సాయన్న గౌడ్ ఇడిగి పావని Wo వీరణా గౌడ్ Occupants వెంకట రాములు S/o కిష్టాన్న (0.01) వెంకటేశ గౌడ్ S/O క్రిష్ణయ్య గౌడ్ | - | - | - | - |
| 3 | 302 | ప్రభుత్వం | మెట్ట | 0.07 (గుంటలు) | పట్టేదారాలు ఇడిగి క్రిష్ణయ్య గౌడ్ S/o సాయన్నగౌడ్ Occupants వెంకట రాములు S/o కిష్టాన్న (0.10) వెంకటేశ గౌడ్ S/o క్రిష్ణయ్య గౌడ్ (0.10) | - | - | - | - |
| 4 | 376 | ప్రభుత్వం | మెట్ట | 0.26 (గుంటలు) | J . చిన్న కిష్టాన్న S/o నారాయణ (0.24) J . భీరప్ప S/o చిన్న కిష్టాన్న (0.08) J. వెంకటేశ S/o చిన్న కిష్టాన్న | - | - | - | - |
| 5 | 377 | ప్రభుత్వం | మెట్ట | 0.09 (గుంటలు) | వేంకటేశ్వర రెడ్డి S/O సుధాకర రెడ్డి | - | - | - | - |
| | మొత్తం | | | 1.14.4 గుంటలు | | | | | |

| చెట్లు | | | నిర్మాణములు | | |
|---|---|---|---|---|---|
| సర్వే నెం. | చెట్ల వివరములు | చెట్ల సంఖ్య | సర్వే నెం. | వర్గము | విస్తీర్ణం |
| - | - | - | - | - | - |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ పునరావాసం మరియు పునరావాసం చట్టం 2013 చట్టం నెలలో సరసమైన 2013/30. ఏదైనా పని రోజునలోని నిబంధనల ప్రకారం తయారు చేయబడింది (1)11. పరిహారం మరియు పారదర్శకత యొక్క సెక్షన్ నారాయణపేట వద్ద జిల్లా కలెక్టర్ & భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.ఎల్.ఐ.యస్.పి యూనిట్-I మక్తల్ కార్యాలయంలో భూమి యొక్క ప్రణాళికను పరిశీలించవచ్చు.
తెలంగాణ ప్రభుత్వం తగిన ప్రభుత్వ ఆఫీసర్ కమ్ - కలెక్టర్/భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్. ఎల్.ఐ.యస్.పి యూనిట్ - I, మక్తల్ నారాయణపేట వద్ద మరియు అతని సిబ్బందికి భూమి పైకి ప్రవేశించడానికి మరియు భూమిని ప్రవేశపెట్టడానికి, ఏదైనా భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి సంతోషిస్తున్నాము మరియు చెప్పిన చట్టంలోని సెక్షన్ లో పేర్కొన్న మరియు పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అమలు చేయడా 12 నికి అవసరమైన అన్నీ ఇతర చర్యలను చేయండి.
చట్టం యొక్క సెక్షన్ 11(4) ప్రకారం, ఏ వ్యక్తి ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా భవమి యొక్క ఏదైనా లావాదేవీకి కారణం కాదు, అమ్మకం/ కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా ముందస్తు అనుమతి లేకుండా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి అటువంటి భూమి పై ఏదైనా ఆక్రమణలను సృష్టించకూడదు.
అధీకృత అధికారి చట్టం యొక్క ఏదైనా ఉంటే సముపార్జనకు అభ్యంతరాలు, మరియు వారి భూములు పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న / ప్రభావితమైన వ్యక్తుల నుండి వచ్చిన వాదనలు, ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై రోజులు ) లోపు భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తి భూసేకరణ చట్టం లోని సెక్షన్ 15 కింద భూసేకరణ అధికారికి తెలియజేయగలరు.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్.ఎల్.ఐ.యస్.పి. యూనిట్-1 మక్తల్
సం/- అదనపు కలెక్టర్ నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట
DIPR RO NO. 210/LA/PP/Advt/Pub/2025-26


# ఉద్యోగులకు బాసటగా ప్రభుత్వం




తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలు స్తుందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవా రీగా పరిష్కరిస్తుందని చెప్పారు. ఉద్యోగుల అంశంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణ యాల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సిసిఎల్‌ఎ కార్యాలయం ప్రాంగణంలోని డిప్యూటీ కలెక్టర్స్ అసోసి యేషన్ కార్యాలయం శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి నాయ కులతో కలిసి వి.లచ్చిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం కొనసాగుతుం దన్నారు. ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ (ఒపిఎస్) పునరుద్ధరించాలని, అవుట్‌సో ర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, 317 జిఒ ద్వారా మరి కొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించా లని ప్రభుత్వాన్ని కోరినట్లు లచ్చిరెడ్డి తెలి పారు. ప్రభుత్వ ఖజానాపై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి, ఆ తర్వాత ఆర్థిక భారం పడే మిగిలిన 14 అంశాలను దశల వారీగా పరిష్కరించాలని కోరినట్లు వివరించారు. మరికొన్ని ఉద్యోగుల అంశాలను కూడా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తారని లచ్చిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఉద్యోగుల అంశంలో మంత్రివర్గం సానుకూలంగా స్పందించినందుకు గాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు కె.రామకృష్ణ, ఎస్. రాములు, కె.హన్మంత్‌రావు, దేవేందర్, జి.కృపాకర్, కె.రాములు, బాణాల రాంరెడ్డి, జి.నిర్మల, కత్తి జనార్ధన్, హబీబ్ మస్తాన్, ఊదరి గోపాల్ పాల్గొన్నారు.



## దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలి

ఎమ్మెల్సీ కవిత

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా జైలులో దాశరథి కృష్ణమాచార్యులు శిక్ష అనుభవించిన బారెకులు పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం పోరాడి నిజాం పాలనలో జరిగిన ఆకృత్యాలను ఎండగడుతూ అనేకమైన పోరాట విధానాలు ఎంచుకుని పోరాడిన మహనీయుడు కలాన్ని చూపించి ప్రజలను చైతన్యవంతులను చేసినటువంటి మహోన్న తమైన వ్యక్తి దాశరథి కృష్ణమాచార్యులు అని కొనియాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణా అని రాసింది మన నిజామాబాద్ గడ్డ అని గుర్తుచేశారు. ఇంతటి మహోన్నతమైన వ్యక్తిని విస్మరించడం ప్రభు త్వానికి సిగ్గుచేటన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి దాశరథి జయంతి ఉత్సవాలు జరిపించాలని ఎన్నిసార్లు విన్నవించినా దున్న పోతు మీద వాన పడ్డట్లుగా కనీసం తెలంగాణ సోయి లేకుండా వివరిం చడం స్పష్టం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర యువ జన విభాగం అధ్యక్షులు సంపత్‌గౌడ్, జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి, తాజా మాజీ మేయర్ దండు నీతూకిరణ్, ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, సిర్ప లింగం పాల్గొన్నారు.



## నిరాశపరిచిన కేబినేట్

ఉద్యోగులపై సర్కార్ కేసులు పెడుతోంది

కేసీఆర్ కాలంలో అవార్డులు వస్తే, కాంగ్రెస్ కాలంలో ఒక్క అవార్డు దిక్కు లేదు

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ప్రజాపక్షం/దుబ్బాక : రాష్ట్ర ప్రభుత్వ కేబినేట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం దుబ్బాకలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయి గాలి పాలన చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశా రని...దీనికి కేబినేట్‌లో ఐదు గంటల చర్చ చేశారని ప్రశ్నించారు. ఉద్యోగు లను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే ఉద్యోగులకు మూడు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. భారత దేశంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణమన్నారు. ఉద్యోగు స్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగస్తులపై ఏసీబీ కేసులు పెట్టి ,రాచి రంపాన పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ 73శాతం పీఆర్సీ ఇచ్చారని, మీరెందుకు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మించిపో యారన్నారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్ధమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎం సీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ ఉంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేద న్నారు. గోదావరి బనకచర్ల కోసం బిఆర్‌ఎస్ పార్టీ సుప్రీం కోర్టు వెళ్తుంద న్నారు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిం చారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సెన్, దుబ్బాక మాజీ చైర్ పర్సన్ వనిత, వంశీ కృష్ణ, రామస్వామి, యాదగిరి, స్వామి, రాజమౌళి, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# నిష్క్రమిస్తున్న తొలి తరం

ఉద్యమ భవిష్యత్తుపై నీలి నీడలు



ప్రజాపక్షం/ఖమ్మం : అర్థ శతాబ్దపు సాయుధ ఉద్య మంలో తొలితరం వయో భారంతోనో, ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలోనో ప్రాణా లను కోల్పోయి ఉద్యమం నుంచి నిష్క్రమిస్తుంది. ఒక్కొ క్కరుగా ప్రాణాలను కోల్పోతుంటే ఉద్యమ భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. సమసమాజ నిర్మాణం సాయుధ పోరాటం ద్వారానే అని నమ్మి సాయుధ పంథాను ఎంచుకున్న మావోయిస్టు పార్టీ ముందెన్నడూ లేని సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. ప్రతి పోరాటంలోనూ ఆత్మరక్షణ, ఎదురుదాడి ఉంటాయి. ఇప్పుడు ఎదురు దాడి చేసే స్థితిలో లేని మావోయిస్టులు ఆత్మరక్షణకే మొగ్గు చూపుతున్నారు. శాంతి చర్చల పేరుతో ప్రకటనలు ఇందుకు సంకేత మన్న భావన వ్యక్తమవుతుంది. అర్థ శతాబ్ద పాటు సిపిఐ (ఎంఎల్) పీపుల్స్ వార్, సిపిఐ (మావోయిస్టు) ఇలా ఏ పేరుతో ఉన్న ఉద్యమాన్ని నడిపిన అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, మరి కొందరు మడమ తిప్పి ఉద్యమం నుంచి వెనుతిరగడం జరిగింది. దాదాపు 15 రాష్ట్రాల్లో ఉద్యమాన్ని నడుపుతూ దండకా రుణ్యంలో రెండు దశాబ్దాల పాటు సమాంతర ప్రభు త్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుంది. ఆపరేషన్ కగార్ పేరుతో వేలాది సాయుధ బలగాలను అడవుల్లో దింపి ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు ఆరోపించిన ట్లుగా ఎంచుకున్న నేతలను పట్టుకుని కాల్చి చంపుతు న్నారు. మావోయిస్టు సురక్షిత ప్రాంతాలుగా, కంచుకో టలుగా చెప్పుకుంటున్న అనేక ప్రాంతాలను సాయుధ పోలీస్ బలగాలు స్వాధీనం చేసుకుని బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. 15 రోజుల వ్యవధిలో నంబాల కేశవరావు, సుధాకర్ లాంటి అగ్ర నేతలు మృతిచెం దారు. ఎన్‌కౌంటర్లలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే వందల సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యారు. దశాబ్ద కాల పరిధిలో దళాల్లో చేరిన వారిలో పార్టీ పట్ల అంకిత భావం కొరవడింది. వరుస ఘటనలు తర్వాత కొందరు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. అన్నింటికి మించి ఉద్యమంపై పూర్తి అవగాహన శత్రువుల ఎత్తు లకు పై ఎత్తులు వేస్తూ ఉద్యమాన్ని నడిపిన తలపండిన నాయకులు విఘత జీవులుగా మారుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి పోలీస్ యంత్రాంగానికి దీటుగా ఆయుధ సామాగ్రి తయారు చేయడం, ఇతర ఆయు ధాలను సమకూర్చుకోవడం, అధునాతన మందు గుండు సామాగ్రి తయారు చేయడం, శాస్త్ర సాంకేతిక రంగాలపై పట్టు కలిగిన మావోయిస్టు నేతలు తగ్గిపో యారు లేదా లేకపోవచ్చు. ఒకప్పుడు సాయుధ పోలీ సుల కంటే అధునీక యుద్ధతంత్రం నడిపిన మావో యిస్టు పార్టీ ఇప్పుడు ఆ స్థితిని కోల్పోయింది. అదే సమయంలో మావోయిస్టు పార్టీకి దన్నుగా నిలిచి ఉద్యమ నేతలకు తమ ప్రాణాలను అడ్డుపెట్టి కాపాడు కున్న ప్రజల్లో సైతం అంత సానుకూలత లేదు. ఒక పక్క పోలీసుల ముమ్మర దాడులు, మరోపక్క పలచబ డుతున్న ఉద్యమంపై మావోయిస్టు సానుభూతి పరుల్లోనూ ఆందోళన మొదలై ఉద్యమానికి దన్నుగా నిలవలేని స్థితి ఏర్పడింది. రెండవది మావోయిస్టు పార్టీ క్యాడర్ రిక్రూట్‌మెంట్ జరగడం లేదు. సాయుధ పోరాటం వైపు చూసే యువత కనిపించడం లేదు. ఆ భావజాలం నుంచి యువతను మరల్చడంలో మావో యిస్టు సిద్ధాంత వ్యతిరేకులు సానుకూల ఫలితాన్ని సాధించారని చెప్పవచ్చు. ఆపరేషన్ కగార్ పై విద్యాధి కులు ఖండనలు చేస్తుండటం అభినందనీయమే అయిన ఖండనలు దాటి ముందుకు పోలేని స్థితి వారిది. బిజెపి లేదా దాని మిత్రపక్షాలు మినహా మిగి లిన రాజకీయ పక్షాలు దండకారుణ్య దారుణాన్ని ఖండిస్తున్నా మావోయిస్టు భావజాలంతో ఏకీభవించే పరిస్థితి లేదు. ఒకప్పుడు సాయుధ పోరాట కార్యకర్త లను తయారు చేసే కార్కానాలుగా పేరొందిన ఉస్మా నియా విశ్వ విద్యాలయం, వరంగల్ రీజనల్ ఇంజనీ రింగ్ కళాశాల లాంటి అనేక విద్యా సంస్థలు ఇప్పుడు ఆ స్థితిలో లేవు. ప్రపంచీకరణ పుణ్యమా అని ప్రజల ఆలోచనల్లో వచ్చిన మార్పు మావోయిస్టు పార్టీకి ప్రతి బంధకంగా మారింది. మరణాలే తప్ప క్యాడర్ ఉత్పత్తి లేని ఏ పార్టీ భవిష్యత్తు అయిన అంధకారమే. ఈ విష యంలో మావోయిస్టు పార్టీకి భిన్నాభిప్రాయం ఉండా ల్సిన అవసరం లేరు. పెరుగుతున్న మాతోన్మాదం, ఆర్థిక అంతరాలు, నవీన సంస్కృతి, కార్పొరేటీకరణ భవిష్యత్తులో పోరాడే అవసరాన్ని కోరుకోక తప్పని స్థితి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పటికే కమ్యూనిస్టుల అవ సరాన్ని గుర్తిస్తున్నారు. ఆ అవసరం మరింత పెరిగిన నాడు కొత్త ఉద్యమ స్వరూపం సంతరించుకుంటుంది. ఇప్పటికైతే మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. తొలితరం ఉద్యమ నేతల స్థానాలను భర్తీ చేయగలిగిన నేతలు తయారై భవిష్య త్తుపై ఆశలు కలిగిస్తే తప్ప ఆ పార్టీకి భవిష్యత్తే లేదన్న భావన కలుగుతుంది. కాకపోతే ఆపరేషన్ కగార్‌లు లేదా మరిన్ని పాలకుల హింసాత్మక ఎత్తుగడలు ఉద్యమ స్వరూపాన్ని మార్చవచ్చేమో కానీ సైద్ధాంతిక భావజాలాన్ని మాత్రం మార్చలేవు.



## నాన్ డ్యూటీ లిక్కర్ పట్టివేత

ప్రజాపక్షం/హైదరాబాద్ : నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పై ఎస్‌టిఎఫ్, డిటి ఎఫ్ టీమ్‌లు ప్రత్యేక దాడులు నిర్వహించాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఆదేశాల మేరకు షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో గోవా నుంచి వచ్చే రైళ్లలో ఈ దాడులు నిర్వహించారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 48 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్‌టిఎఫ్ బి, సి, డి, సి ఐ లు బిక్షరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజులతోపాటు సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐతో పాటు 35 మంది సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.


శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం. డి6/194/2017 (ఈ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన) తేది: 05.06.2025
ది.10.07.2025 నుండి ది.09.07.2026 వరకు ఒక సం॥ర కాలమునకు దేవస్థానమునకు నిత్యాన్నదాన సత్రము మరియు పడితరమునకు అవసరమైన పాలు, పెరుగు సరఫరా చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేదీ: 07.06.2025 ఉదయం గం. 11.00ల నుండి, టెండరు దాఖలుచేయు చివరి తేదీ: 23.06.2025 ఉదయం గం.11.00వరకు, టెక్నికల్ బిడ్ తెరచు తేదీ: 23.06.2025 ఉదయం గం.11.30లకు, ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేదీ: 23.06.2025 మధ్యాహ్నం గం.12.00లకు.
ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- ఎల్. రమాదేవి కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 3220-PP/CL/ADVT/1/2025-26, Date: 06-06-2025

ప్రజాపక్షం
శనివారం, 07 జూన్

# ట్రంప్ నిజ మోము

పాలస్తీనా– ఇజ్రాయిల్ (గాజా), ఉక్రేన్–రష్యా యుద్ధాలు ముగింప చేస్తానంటూ 'శాంతి దూత'గా రెండవ పదవీకాలం (నాలుగేళ్ల విరామంతో) ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిజరూపం 135 రోజుల తర్వాత బుధవారం నాడు భద్రతామండలిలో బహిర్గతమైంది. గాజా స్ట్రిప్‌లో మానవ నిర్మూలన యుద్ధాన్ని తక్షణం ఆపాలని ఇజ్రాయిల్‌ను కోరిన తీర్మానాన్ని 15 మంది సభ్యులతో కూడిన భద్రతా మండలిలో అమెరికా ఒక్కటి వీటో చేసి ప్రపంచం ముందు ఏకాకిగా నగ్నంగా నిలబడింది. అయినా 'నలుగురు నవ్వినా గాని నాకేటి సిగ్గు' అనుకునే అమెరికాకు ఇటువంటి అవమానం కొత్త కాదు–దాని ప్రయోజనాలు దానికి ముఖ్యం. అల్జీరియా రూపొందించగా 10 అశాశ్వత సభ్య దేశాలు బలపరిచిన ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా వీటో హక్కు కలిగిన ఐదులో నాలుగు దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా ఓటు చేశాయి. ముసాయిదా తీర్మానం గాజాలోని పరిస్థితిని విపత్కరంగా అభివర్ణిస్తూ, తక్షణం, శాశ్వత పోరాట విరమణకు పిలుపు ఇచ్చింది. గాజాలోకి మానవతా సహాయం ప్రవేశంపై ఇజ్రాయిల్ ఆంశాలన్నీ తక్షణం ఎత్తివేయాలని, ఆటంకాలు లేకుండా విస్తృత పంపిణీకి ఐక్యరాజ్యసమితి, ఇతర మానవతావాద ప్రతినిధులను అనుమతించాలని ముసాయిదా తీర్మానం కోరింది. ఈ అవసరం ఎందుకు వచ్చింది? ఇజ్రాయిల్ సైనికులు గత మూడు వారాలుగా ఆహారం సహాయం, మందుల పంపిణీని అడ్డుకుంటున్నారు. ఆకలితో అలమటిస్తూ సహాయ కేంద్రాల వద్దకు చేరుకున్న బాధితులపై బాంబుదాడులు చేస్తున్నారు. ఇజ్రాయిల్ నరరూప రాక్షస కృత్యాల వల్ల వేలాదిమంది ఆకలి మంటలతో మలమలలాడే దురవస్థలు దాపురించాయి. మానవ శరీరంలో ఏ మూలనన్నా ఇసుమంతైన మానవత్వం ఉన్నవాడు ఎవడైనా ఈ ఘోరకలిని అనుమతించడు. ట్రంప్ అధికారంలోకి వచ్చేముందే హమాస్–ఇజ్రాయిల్ మధ్య తొలి విడత కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. కొంత మేరకు బందీలు, యుద్ధ ఖైదీల మార్పిడి జరిగింది. శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు మొదలవుతాయని ప్రపంచం ఎదురు చూస్తుండగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బేషరతుగా తమ పౌరుల విడుదలను డిమాండ్ చేస్తూ రోజువారీ బాంబుదాడులు తిరిగి మొదలుపెట్టాడు. దీన్ని ట్రంప్ ఖండించలేదు. నెతన్యాహును అదుపులో పెట్టలేదు. ఎందుకంటే, మధ్య ఆసియాలో అమెరికా ప్రయోజనాల రక్షణకు ఇజ్రాయిల్ పోలీసుగా పని చేస్తున్నది. ఇజ్రాయిల్ 18సంవత్సరాలుగా గాజాను దిగ్బంధంలో ఉంచింది. ఆ స్ట్రిప్‌లోని 24 లక్షలమంది పాలస్తీనియన్‌లలో 15 లక్షలమంది ఇజ్రాయిల్ బాంబుదాడులు, బుల్‌డోజర్ కూల్చివేతల కారణంగా నిరాశ్రయులైనారు. ఇజ్రాయిల్ అంచనా ప్రకారం హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ పౌరులు 58 మందిలో 20 మంది ఇంకనూ సజీవంగా ఉన్నారు. వారి విడుదల కోసం ఇంత విధ్వంసక యుద్ధం చేయాలా ?

అమెరికా, ఇజ్రాయిల్ లక్ష్యాలు వేరుగా ఉన్నాయి. బందీల విడుదల డిమాండ్ ఒక ముసుగు మాత్రమే. గాజాలో మిగిలి ఉన్న పాలస్తీనియన్‌లు పొరుగు దేశాల్లో తలదాచుకోవాలి. గాజాను ఒక సుందరమైన నదితీర ప్రపంచ విహార కేంద్రంగా తయారుచేస్తామని అధ్యక్షుడు ట్రంప్ తమ నిజ ఉద్దేశాన్ని ప్రకటించారు. ఆ తర్వాత ఇజ్రాయిల్ మరిన్ని మడత పేచీలతో బాంబుదాడులు కొనసాగిస్తున్నది. ఆహారం, మందులు వగైరా సహాయాన్ని ప్రవేశించకుండా అమానుషంగా అడ్డుకుంటున్నది. భద్రతామండలిలో ఇజ్రాయిల్ వ్యతిరేక తీర్మానాన్ని వీటో చేయటమంటే అమెరికా –ఇజ్రాయిల్ బంధం యధాతథం అని ప్రపంచానికి చాటి చెప్పటమే. ఉక్రేన్ – రష్యా యుద్ధంలోనూ ట్రంప్ శాంతివచనాలు పలుకుతున్నా తమ స్వప్రయోజనాలు మరవలేదు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో వైట్‌హైస్‌లో తొలుత గొడవ పడినప్పుడు ట్రంప్ యుద్ధవిరమణకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు కనిపించాడు. ఉక్రేన్‌కు అమెరికా ఆయుధాల సరఫరాను నిలుపు చేస్తున్నట్లు ప్రకటించి జెలెన్స్కీని లొంగదీసుకొని, ఉక్రేన్‌లోని అరుదైన భూగర్భ ఖనిజాల తవ్వకంపై అమెరికాకు హక్కులు సాధించుకున్నాడు. రష్యా–ఉక్రేన్‌ల మధ్య రెండు దఫాలు శాంతి చర్చలు ఏర్పాటు చేయగలిగారు కానీ వాటి మధ్య యుద్ధాన్ని నిలుపుచేయలేకపోయారు. రష్యా వైమానిక దళ స్థావరాలపై ఉక్రేన్ డ్రోన్‌లతో దాడి చేసి నష్టపరచటంతో ఉద్రిక్తతలు తీవ్రమైనాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్ సంభాషణతో నిరాశ చెందిన ట్రంప్ మరికొన్ని రోజులు యుద్ధం సాగనీ అన్నారు. రష్యాను బలహీనపరచటంలో అమెరికాకున్న స్వార్థం విస్మరించరానిది.

# మోదీ వృద్ధిని అపహాస్యం చేస్తున్న గణాంకాలు


డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

భారతదేశం ప్రపంచ నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని ప్రపంచ, జాతీయ వేదికలపై ప్రచారం చేయబడుతోంది. 3.9 ట్రిలియన్ డాలర్ల సాధారణ జిడిపితో ప్రభుత్వం తమ ఆర్థిక అద్భుతం సాధించానని చెప్పుకుంటుంది. తన నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి గూర్చి ప్రధానమంత్రి ప్రతి వేదిక మీద గర్జిస్తున్నారు. మీడియా సంస్థలు ఈ కథనాన్ని ఊపిరి చలపక పతాక శీర్షికలతో ఇబ్బడు ముబ్బడుగా ప్రచారం చేస్తున్నాయి. ఈ వేడుక మోము వెనుక నిరాకరించలేని వాస్తవం ఉంది: ఈ వృద్ధి గాథ సంపన్నుల చేత సంపన్నుల కోసం రచించబడింది. కాగా మెజారిటీ భారతీయులు ఆకలి, నిరుద్యోగం, పెచ్చు పెరుగుతున్న దారిద్ర్యంతో బాధలను భవించడం కొనసాగుతున్నది. అధికారిక జిడిపి సంఖ్యలు వెల్లడి చేసే దాని కన్నా మరుగుపరిచేది ఎక్కువ. భారతీయుల వార్షిక తలసరి ఆదాయం నేడు సుమారు 2,800 డాలర్లు లేదా రూ.2.33 లక్షలు.

దీన్ని వియత్నాం (4,300 డాలర్లు), చైనా (12,500 డాలర్లు) లతో పోల్చండి. రూపాయల లెక్కలో వరుసగా రూ.3.57 లక్షలు, రూ.10.38 లక్షలు. భారతదేశం ప్రపంచ ఆర్థిక నాయకురాలు కాకపోగా, ఒకప్పుడు సమాన స్థా యిలో ఉన్న దేశాల కన్నా వెనుకబడింది.

ఇంకా దారుణమేమంటే, ఈ రూ.2.33 లక్షల సంఖ్య భ్రమపూరితం. భారతీయుల్లో ఉన్నత స్థాయిలో ఉన్న 1 శాతం మంది నియంత్రణలో దేశ సంపదలో 40శాతం పైగా ఉంది. అవి అదానీ, అంబానీ లాంటి వారు ఓనర్లుగా ఉన్న కార్పొరేట్ సంస్థలు, వ్యాపార సంస్థలు. ఈ 1 శాతం సంపాదన పక్క న పెడితే, మిగతా 1.4 బిలియన్ భారతీయులకు లభ్యమయ్యే జీడీపీ గణనీయంగా తగ్గుతుంది. మిగిలేది సుమారు రూ.115 లక్షల కోట్లు, దానితో వాస్తవ తలసరి ఆదాయం సంవత్సరానికి 82 వేలు లేదా సగటున నెలకు రూ.6,800/. మనం ఇంకా లోతుగా వెళ్లి, ఉన్నత స్థాయిలోని 5 శాతం నియంత్రణలోని 62% సంపదను పక్కన పెడితే మిగతా దేశానికి రూ.89 లక్షల కోట్లు మిగులుతుంది. దాంతో తలసరి ఆదాయం సాలీనా రూ.67 వేలకు–నెలకు రూ.5,600 కన్నా తక్కువ ఉంటుం ది. అత్యధిక భారతీయులు జీవిస్తున్నది దీనితోనే. ఇది ప్రజలకోసం ఆర్థిక వ్యవస్థ కాదు– ఇది లాభార్జన కోసం, విలాసాల కోసం, ప్రచారం కోసం ఆర్థికవ్యవస్థ.

80 కోట్ల మంది ప్రజలు తమ రోజువారీ మనుగడ కోసం ఉచితరేషన్‌పై ఆధారపడుతున్న దేశంలో ప్రపంచ జిడిపి ర్యాంకింగ్‌లను వేడుక చేసుకోవడం వికృతమైన చతులోక్తి. ఈ ఆర్థిక శక్తి గూర్చి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం అదే సమయంలో ఉచిత రేషన్‌ల పంపిణీని ఘనంగా తమ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు కాదా? దేశం వెలుగులు చిమ్ముతూ అయినా ఉండాలి లేదా ఆకలితో అలమటిస్తూ ఉండాలి. ఒకేసారి రెండు విధాల ఉండడం సాధ్యం కాదు. ఈ వైరుధ్యాలను ఎత్తి చూపినప్పుడు, ఈ ప్రశ్నలు అడుగుతున్న వారిపై దేశద్రోహి ముద్ర వేస్తున్నారు: సంపద మూలుగుతున్న చోటే ఆకలిని ప్రశ్నించడమా లేక ఆకలిని పూర్తిగా విస్మరించటమా? పౌష్టికాహారలోపంతో కూడిన బిహార్‌లోని బాలుడు, మధ్యప్రదేశ్‌లోని నిరుద్యోగ పట్టభద్రుడు జిడిపి సంఖ్యలు భుజిస్తారా? మహారాష్ట్రలో అధిక ఉపకరణల వ్యయంతో నాశనమైన రైతు సోషల్‌మీడియా ఉన్మాదంతో తన కుటుంబాన్ని పోషించగలడా?

ఆదాయం సంగతి అలావుంచితే, భారతదేశ సామాజిక, మానవాభివృద్ధి సూచీలు సంక్షోభాన్ని వెల్లడి చేస్తున్నాయి. మానవాభివృద్ధి సూచీలో మనదేశం 134వ ర్యాంక్‌తో శ్రీలంక, వియత్నాం వంటి వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకన్నా చాలా వెనుకబడి ఉంది. ప్రపంచ ఆకలి సూచీలో 125 దేశాల్లో మన దేశం ర్యాంక్ 111.






భారతదేశ బాలల్లో 25 శాతం వయసుకు తగ్గ ఎత్తులేరు. 27 కోట్లమంది బహుముఖ దారిద్ర్యంలో జీవిస్తున్నారు. శ్రమశక్తిలో మహిళల భాగస్వామ్యం ప్రపంచదేశాల్లోకెల్లా తక్కువ. ప్రపంచ లింగ వ్యత్యాస సూచీలో మనదేశం స్థానం 146 దేశాల్లో 127. వాస్తవ ప్రజల జీవితాన్ని తాకే దాదాపు ప్రతిఒక్క సూచీలో విద్య, పోషకాహారం, ఆరోగ్యం, ఆహారం, గృహవసతి, సమానత్వం ఇలా అన్నిట్లోనూ భారతదేశ పనితీరు తీసికట్టే. "ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ నిజమైన మోము ఇదే కదా!

మరీ దారుణమేమంటే, వేడుక చేసుకుంటున్న ఈ ర్యాంకింగ్‌ల అసలు ప్రాతిపదికే ప్రశ్నార్థకం. స్థూల జిడిపిని ప్రధానంగా డాలర్ ప్రస్తుత మారకపురేటు ప్రాతిపదికగా 3.9 ట్రిలియన్ డాలర్లు అని లెక్కగట్టారు. ప్రస్తుతం డాలరు సుమారు 83 రూపాయలు ఉంది. ఇది ఎన్నడూలేనంత తక్కువ. రూపాయి మరింత బలహీనపడితే పరిస్థితి ఏమిటి? డాలరు విలువ రూ.90కి పెరిగిందనుకుం దాం, భారత ఆర్థిక వ్యవస్థ పరిణామం డాలర్ లెక్కలో తగ్గుతుంది. ఇది అంత సరళం. ఇది ఆర్థిక బలమా లేదా గణాంక మాయాజాలమా? మన ప్రధానమంత్రి ఒకనాడు రూపాయి విలువ జాతీయ ఆత్మగౌరవం అన్నారు. అది ఏటికేడు దిగజారుతూ ఉంటే నోరు మెదపటంలేదు. నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అన్న భ్రమను సృష్టించటానికి ఉపయోగించిన జిడిపి సంఖ్య బలహీనమైనది, తగ్గుదలకు అవకాశమున్నది, ప్రాతినిధ్యరహితమైంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ సంపద పెంచుకోలేదు. దాని కరెన్సీ చౌక అయింది.

అయితే ఈ దగాకు ఒక ప్రయోజనం ఉంది. అది ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపెడుతుంది. బిజెపికి ప్రచారాస్త్రం ఇస్తుంది. సారం కొరవడినా కూడా విజయం సాధించామనే భ్రమ కలుగజేస్తుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ కకావికలుగా ఉండగా, నిరుద్యోగం విశృంఖలంగా ఉండగా, ద్రవ్యోల్బణం పేదలను గట్టిగా దెబ్బతీయటం కొనసాగుతుండగా ఈ జిడిపి వేడుక రావటం యాదృచ్ఛికం కాదు.

ఇది సమ్మిళిత వృద్ధి కాదన్నది వాస్తవం. ఇది సంపద కేంద్రీకరణ. దీనికి ప్రభుత్వ విధాన తోడ్పాటు, ప్రచారం ద్వారా రక్షణ, మీడియా అద్భుతమైన మెరుగు సహాయంగా ఉన్నాయి. మెజారిటీ భారతీయులం ఈ గాథ అంచుల్లోనే ఉన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. కార్మికులు కరోనా లాంటి మహమ్మారి కాలంలో పాదరక్షలు లేని కాళ్లతోనే ఇళ్లకు నడిచివెళ్లారు. బాలలు స్కూలు నుండి మధ్యలోనే మానేస్తున్నారు. మహిళలు శ్రామికశక్తి నుంచి అంతర్థానమవుతున్నారు. అయినా ఎంపిక చేసుకున్న కొద్దిమంది సంపద ప్రతి రెండు సంవత్సరాలకు రెట్టింపు అవుతోంది. ఇది అభివృద్ధి నమూనా కాదు. ఇది సంఘటిత నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వకంగా మినహాయింపు వ్యవస్థ.

భారతదేశం కేవలం పెద్ద దేశం కాదు, గొప్పదేశం కావాలని కోరుకుంటే అది తన గమనం మార్చుకోవాలి. దాని గమ్యం పరపతి ఏజెన్సీల మెప్పు పొందటం లేదా ప్రపంచ ర్యాంకింగ్‌లో పోటీపడటం కారాదు. ఏ బిడ్డ ఆకలితో నిద్రలోకి వెళ్లకుండా చూడటం, ప్రతి యువ వ్యక్తికి ఉపాధి చూపటం, ఔషధం–ఆహారం మధ్య ఎంచుకునే స్థితి ఏ భారతీయునికి రాకుండా ఉండటం దాని గమ్యంగా ఉండాలి. నిజమైన దేశభక్తి సమాధానాలు డిమాండ్ చేయటంలో ఉంటుంది కాని గుడ్డిగా చప్పట్లు కొట్టడంలో కాదు. నిజమైన దేశభక్తి ఆకలిగొన్న వారికి అన్నం సమకూర్చటంలో ఉంటుందిగాని వారితో సంఖ్యలు ఆరగింపచేయటంలో కాదు. నిజమైన వృద్ధి జిడిపి గణాంక పటాల్లో ఉండదు, గౌరవప్రదంగా జీవించే జీవితాల్లో ఉంటుంది అప్పటి వరకు ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుందంటే మూలంలో బోలుతనం, అగ్రభాగాన మాత్రమే మెరుస్తుంటుంది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకునే కోట్లాదిమందితో అది ప్రమాదకరంగా సంబంధ రహితంగా ఉంటుంది.

ముగింపు: ప్రధానమంత్రి మోదీ టముకులు మ్రోగిస్తున్న వికసిత భారత్@2047ను, మన సమాజంలో అతి పేద విభాగాలకు అది ఏమి చేకూర్చుతుందన్న కోణం నుంచి పరిశీలించాలి. గొప్పగా చెప్పమంటున్న భారత ఆర్థిక అధిరోహణను కొద్దిమందికి అపారమైన సౌభాగ్యం, మెజారిటీకి అష్టకష్టాలు కలుగజేస్తున్న దాని పనితీరు నుంచి చూడాలి. అసమానతను విస్తృత పరుస్తున్న, పర్యావరణ విధ్వంసాన్ని తీవ్రతరం చేస్తున్న, మెజారిటీని అలక్ష్యం చేస్తున్న వృద్ధిని వేడుక చేసుకోరాదు. కోట్లాది మంది ప్రజలు ఆహార రేషన్‌లపై ఆధారపడి వుండగా, కొద్దిమంది అసభ్యకరంగా సంపదను నిల్వ చేసుకుంటున్న దేశం పురోభివృద్ధి చెందుతున్నట్లు కాదు, రక్తస్రావంతో రోదిస్తున్నట్లు. భారతదేశం ఈ లోపభూయిష్టమైన నమూనాను అత్యవసరంగా విడనాడాలి, కొత్త బాట ఏర్పాటు చేసుకోవాలి– అందులో సమానత్వం, మన్నికగల పర్యావరణం, ఉపాధి కల్పన, న్యాయం, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యయుత ప్రణాళిక విధానం ఉండాలి. ఇది గ్రామీణాభివృద్ధికి భ్రమలు కాకుండా నిజంగా నడుం కట్టాల్సిన సమయం.

# ఆట మీద అభిమానం శవపేటిక అయ్యింది

బెంగళూరు జట్టు ఐపీఎల్ విజేత అయినందుకు కర్ణాటకలో సెలవు ప్రకటించిన ప్రభుత్వం సాయంత్రానికి వారిని ఘనంగా సత్కరించింది. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ టాప్ మల్టీ ఆక్సిల్ బస్సులో హెచ్ఏయల్ నుంచి విధానసభ వరకు ఊరేగించింది. విధానసభ దగ్గర సన్మానం జరుగుతున్న సమయంలో చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో పదుకొండు మంది చనిపోయారు వందలాది మంది గాయపడ్డారు. అక్కడ గెలిచింది ప్రపంచ కప్పు కాదు, కనీసం ఒక దేశంపై గెలిచిన సిరీస్ కాదు. నానాజాతి సమితి లాగా ఒక జట్టు మరొక జట్టు మీద గెలిచింది. జట్టు స్పాన్సర్లు కర్ణాటక వారు కాదు, అందులో ఆటగాళ్లు కర్ణాటక వారు కాదు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, ఆర్సీబీ జట్టులో కర్ణాటక చెందిన వారు అంతే ఉన్నారు. జట్టులో కెప్టెన్ మొదలుకొని ఉన్నవారందరూ ఇతర రాష్ట్రాలు ఇతర దేశాల ఆటగాళ్లే. ఆర్సీబీ గెలిచింది పంజాబ్ కింగ్స్ మీద. పంజాబ్ కింగ్స్‌లో కూడా ఇలాంటి నానాజాతి సమితి. ఒకప్పుడు గతంలో భారత జట్టు పాకిస్తాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్, సౌత్‌ఆఫ్రికా జట్టుపై గెలిచింది అంటే దానికొక అర్థం ఉండేది.

ఉదయం నుంచి బెంగళూరు వీధుల్లో ఆర్సీబీ జట్టు టీ షర్ట్ ధరించి విచిత్రమైన జెండా పట్టుకొని బండి సైలెన్సర్ తీసి ట్యాటోస్ ధరించి విన్యాసాలు చేసుకుంటూ పది రూపాయల పాప్ కార్న్ రెండువందలు, పది రూపాయల టీ వంద రూపాయలు పెట్టి కొని దారిన వచ్చిపోయే వారికి ఇబ్బంది కలుగజేస్తూ నిత్యం ట్రాఫిక్ జాం కల్గించే వారిది అభిమానమా లేక దేశభక్తా? ఎందుకింత అత్యుత్సాహం, పాకిస్తాన్‌లో శత్రు స్థావరాలను నేలమట్టం చేసిన సోఫియా ఖురేషి, వ్యోమిక సింగ్‌కు ఇంతటి ఆదరణ లేదు. వారిని ట్రోలింగ్ చేయడం దూషించడం, లేదా దూషించిన మౌనంగా ఉండటం వీరి దేశభక్తి. ఐపీఎల్ అనేది భారతదేశంలో ఒక ప్రొఫెషనల్ ట్వంటీ 20 క్రికెట్ లీగ్. ఇది 2008లో బిసిసిఐ నెలకొల్పబడింది. ప్రపంచంలోని అత్యంత ప్రజాదరణ పొందిన లాభదాయకమైన క్రికెట్ లీగ్‌లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ప్రతి సంవత్సరం ఉష్ణోగ్రత నలభై దాటినప్పుడు, విద్యార్థులకు టర్మ్ ఎండ్ పరీక్షలు ఉన్నప్పుడు, నీట్, ఎంసెట్, తదితర పోటీ పరీక్షలు ఉన్నప్పుడు టోర్నమెంట్ జరుగుతుంది. ప్రతి సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు జరుగుతుంది.

ఐపీఎల్ యొక్క ఉద్దేశ్యం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ క్రికెటర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదిక అందించడం, భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ క్రీడను ప్రోత్సహించడం. విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగేట్లు షెడ్యూల్ ఉంది. అలాగే ప్రతికూల వాతావరణంలో పోటీలు పెడుతున్నారు. నిరంతర విమర్శలు ఉన్నప్పటికీ, ఇది గరిష్ట సంఖ్యలో వీక్షకులను సంపాదించుకోగలిగింది. భారతదేశంలో స్పోర్ట్స్ బెట్టింగ్ అనేది గుర్రపు పందెం లాంటిది, బెట్టింగ్ చాలా వరకు చట్టవిరుద్ధం. క్రీడలు బెట్టింగ్ అనేది రాష్ట్రాల చట్టాలపై ఆధారపడి ఉంటుంది. భారతదేశం క్రికెట్‌తో మరే ఇతర దేశంతో పోల్చలేని ప్రేమను కలిగి ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌పై బెట్టింగ్ అన్నింటినీ మించిపోయింది. ఐపీఎల్ ఇప్పుడు ఎవరి నోట విన్నా ఇదే మాట. పది పదిహేనేళ్ల క్రితం మొదలైన ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యసనం, మొదట్లో కేవలం ఇండియా టీమ్ ఆడే మ్యాచ్‌లకు మాత్రమే ఉండేది. రాను రాను ఇది మరింత ముదిరి పాకాన పడింది. ముఖ్యంగా టి20 మ్యాచ్ లు ప్రారంభమైనప్పటి నుంచి బెట్టింగ్ జాఢ్యం ఊపందుకుంది. దీనికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు ఐపిఎల్ యువతను మరింత కట్టి పడేసింది. ఒకే సీజన్‌లో వరసగా సుమారు 80 కి పైగా మ్యాచ్‌లు జరుగుతుండటంతో బెట్టింగ్‌ల జోరుకు అడ్డుకట్ట అనేది లేకుండా పోయింది. బెట్టింగ్ లకు బానిసలుగా మారిన చాలా మంది అమాయకులు ఆర్థికంగా నష్టపోవడం కాకుండా, తమ కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో క్రికెట్‌లో గెలుపోటములపై వారు పందాలు కాస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో యువతకు అధునాతన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అందుబాటులో ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా యువత ఆన్‌లైన్ ద్వారా బెట్టింగులకు పాల్పడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ ఉన్నారు. అయినా కొంతమంది మాత్రం బెట్టింగ్‌లనే వృత్తిగా సాగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

దేశంలో పందెం వేయడానికి ఇతర ప్రసిద్ధ క్రీడలు బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ వంటి అంతర్జాతీయ క్రీడలు. ఫలితం యొక్క అనిశ్చితి క్రీడ యొక్క ఆకర్షణలో ముఖ్యమైన భాగం. ఫలితం ముందుగా నిర్ణయించబడితే, క్రీడల సమగ్రత పోతుంది, మ్యాచ్ ఫిక్సింగ్ అనేది క్రీడకు పెద్ద ముప్పుగా ఉంది. ఆన్‌లైన్ జూదం యొక్క ఆగమనం ఆర్థిక లాభం కోసం మ్యాచ్ ఫిక్సింగ్ ప్రమాదాన్ని పెంచింది. గుర్రపు పందాలపై బెట్టింగ్‌లు మినహా భారతదేశంలో క్రీడలు బెట్టింగ్‌లు ప్రధానంగా చట్టవిరుద్ధం. ఇతర క్రీడలు వ్యక్తిగత రాష్ట్రాల చట్టాలు లేదా భారతదేశం సాధారణ చట్టాలపై ఆధారపడి ఉంటాయి. భారతదేశంలో ఎక్కువ భాగం పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ 1867, టెక్నాలజీ యాక్ట్ 2000 కి లోబడి ఉంది. ఆ చట్టాల ప్రకారం స్పోర్ట్స్ బెట్టింగ్ అనుమతించబడదు కానీ ఒక్కో రాష్ట్రానికి వారి స్వంత చట్టాలు రూపొందించుకునే హక్కు ఉంటుంది. పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ (1867) ప్రకారం, భారతదేశంలో అన్ని రకాల జూదాలు చట్టవిరుద్ధం. ఇప్పుడు బెట్టింగ్ అనేది సర్వాంతర్యామిగా మారింది. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా దేశంలో క్రికెట్ బెట్టింగులు జోరుగా కొనసాగుతున్నాయి.

డా.యం.సురేష్ బాబు,
అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక

# సింగరేణిలో మందుల కొరత : కార్మికుల ఇక్కట్లు


మేరుగు రాజయ్య
9441440791

ఉదయం 8 గంటలకే సింగరేణి గోదావరిఖని ఏరియా హాస్పటల్ ఔట్ పేషేంట్స్‌తో సందడిగా ఉంది. క్లర్క్ చిట్టీలు రాసుడు మొదలు పెట్టకముందే కిటికీ దగ్గర 60 ఏండ్లు పైబడిన రిటైర్డ్ కార్మికులు లైన్‌లో నిలబడటం మామూలైంది. రిటైర్డ్ అయిన అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడిన కార్మిక కుటుంబాలు నెలకు ఒకసారి వారు రిటైర్డ్ అయిన ఏరియాలోని హాస్పటల్‌కు మందుల కొరకు వస్తారు. గోదావరిఖని, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, భూపాలపల్లి, రామకృష్ణపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా హాస్పటల్స్‌కు వచ్చి పేరు నమోదు, డాక్టర్ సంతకం, మందుల నమోదు, ఫార్మసిస్ట్ ఇలా నాలుగు చోట్ల లైన్‌గా నిలబడి మందులు తీసుకపోతున్నారు. బిపి, షుగర్, థైరాయిడ్ హార్ట్ బీట్, కీళ్ల నొప్పులు యితర దీర్ఘకాలిక వ్యాధుల మందుల గురించి 100 నుండి 200 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి సింగరేణి హాస్పటల్స్‌కు రావడం వలన ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందులు పడుచున్నామని అనేక మార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. కనీసం కరీంనగర్ వరంగల్, హైదరాబాద్‌లలోని సింగరేణి రెఫరల్ హాస్పటల్స్‌లో మందులు ఇచ్చే సౌకర్యం కల్పించాలని చిరకాలం నుండి డిమాండ్ చేస్తునే ఉన్నారు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఉపముఖ్యమంత్రి, రెవిన్యూ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కాని ఇప్పటి వరకు కనీస కార్యాచరణకు పూనుకోలేదు. పైగా రిటైర్డ్ కార్మికులకు నెల రోజులకు సరిపడే ఇచ్చే మందులను ఇప్పుడు వారం, పది రోజులకు సరిపడా ఇస్తున్నారు. ఇదేమిటంటే ? మందుల కొరత ఉందని జవాబు చెప్పుచున్నారు. అధికారుల అలసత్వం వలననే మందుల కొరత ఏర్పడింది. అధికారులకు భయం, భక్తి కల్పించే సంస్థాగత విధానాలు లేకపోవడం వలననే కార్మికుల హక్కుల అమల్లో అలసత్వం చూపుచున్నారు.

బొగ్గు ఉత్పత్తికి శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని, మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించే బాధ్యత ప్రభుత్వంపై కూడా ఉన్నది. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో, భూగర్భ బొగ్గు గనులలో పని చేసే కార్మికులు ఎక్కువగా అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉన్నవి. అందుగురించి సర్వీస్‌లో కొనసాగుతున్న, రిటైర్ అయిన కార్మికులకు, ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించాలని ఒప్పందాలు ఉన్నవి. రిటైర్డ్ ఉద్యోగులకు, కార్మికులకు "ప్రత్యేకమైన ఒప్పందాలు ఉన్నవి.

"కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మేడికేర్ స్కీం" (సీపీఆర్ఎంఎస్)ఉంది. ఇందులో రిటైర్మెంట్ కార్మికులు రూ.40,000 చెల్లించి సభ్యులైనారు. సింగరేణి యాజమాన్యం తన వాటాగా రూ.18,000 కలిపి కార్పస్ ఫండ్‌గా టర్మ్ డిపాజిట్ కింద పొదుపు చేశారు. 2025 మే 26న బాధ్యతలు చేపట్టిన జనరల్ మేనేజర్ పర్సనల్&వెల్ఫేర్ చెప్పిన లెక్కల ప్రకారం "సీపీఆర్ఎంఎస్‌లో "80,000 మంది సభ్యులున్నారని, కార్పస్ ఫండ్‌గా ఉన్న రూ.259 కోట్ల రూపాయలకు రూ.19.05 కోట్లు వడ్డీ రూపే ణా వచ్చాయని తెలిపారు. సీపీఆర్ఎంఎస్ రిటైర్డ్ కార్మికులకు, వారి జీవిత భాగస్వాములకు(భార్యలకు)సింగరేణి ఏరియా హాస్పటల్స్‌లలో ఔట్ పేషేంట్ మరియు ఇన్ పేషేంట్ వైద్య చికిత్సలతో పాటుగా రెఫరల్‌గా కార్పొరేట్ హాస్పటల్స్‌లో జీవిత కాలంలో ఇద్దరికి(స్పౌస్)కలిపి రూ.8,00,000 విలువ గల వైద్య చికిత్స కల్పించాలి. బొగ్గు పరిశ్రమ సీపీఆర్ఎంఎస్‌లోని వైద్య బీమాలో అధికారులకు,కార్మికులకు మధ్య వ్యత్యాసం ఉంది. జీవిత కాలంలో అధికారులకు(స్పౌస్‌తో) వైద్య చికిత్సకై రూ.25,00,000లను మరియు ఔట్ పేషేంట్ వైద్య చికిత్సకు ప్రతి 6 నెలలకు రూ.18,000 చొప్పున క్యాలండర్ ఇయర్‌లో రూ.36,000 నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. కాని కార్మికులకు మాత్రం నెలకు ఒకసారి బస్, రైలు ప్రయాణంతో సింగరేణి హాస్పిటల్స్‌కు పోయి ఔట్ పేషేంట్‌గా మందులు తెచ్చుకోవాలి.

సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) చెప్పిన వివరాల ప్రకారంగా కొత్తగూడెంలో "మెయిన్ హాస్పటల్" ఆరు ఏరియాల్లో గోదావరిఖని/రామగుండం, భూపాలపల్లి, రామకృష్ణపూర్, మందమర్రి, మణుగూరు, ఇల్లందుతో కలిపి 6 ఏరియా హాస్పిటల్స్, డిస్పెన్సరీలు 21, పడకలు 821, డాక్టర్లు 180 మంది, స్పెషలిస్ట్ డాక్టర్లు 57 మంది, మెడికల్ ఆఫీసర్లు 123 మంది వైద్య సేవలు చేస్తున్నారు. ఇంకా ఈఎన్‌టి సర్జన్, జనరల్ సర్జన్, రేడియాలజీ డాక్టర్లను,175 టెక్నికల్ స్టాఫ్,అప్తమాలజీ, ఎక్స్ రే పోస్ట్ లను భర్తీ చేసుకోవలసి ఉంటుందని చెప్పారు. ఏటా 140 కోట్ల రూపాయలను వైద్య చికిత్స అవసరాలకు, అందులో రూ.40 కోట్లు మందులకు ఖర్చు చేస్తున్నట్లుగా తెలిపారు. దాదాపు 42,000 మంది పర్మనెంట్/సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు, 25,000 మంది కాంట్రాక్టు కార్మికులు, 1,60,000 మంది రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు వైద్య సేవలను అందిస్తున్నట్లుగా చెప్పారు. కాని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ "(డబ్ల్యుహెచ్ఓ)లెక్కల ప్రకారముగా సగటుగా 1000 మంది ప్రజలకు ఒక డాక్టర్ ఉండాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన వైద్యుల లెక్క భూ ఉపరితలంపై నివసించుచున్న ప్రజలను ఉద్దేశించి చెప్పిన లెక్కలు. కాని సింగరేణిలో నిత్యమూ ప్రమాదాలతో సహవాసం చేస్తూ బొగ్గు ఉత్పత్తిని కొనసాగించాలి. వాతావరణ ప్రతికూల పరిస్థితులలో విధులను నిర్వహించాలి. కాబట్టి తప్పనిసరిగా మెరుగైన వైద్య చికిత్స హాస్పటల్స్ కావాలి. పర్మనెంట్, కాంట్రాక్టు ఉద్యోగులతో పాటుగా,వారి కుటుంబాలకు భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు కూడా వైద్య పరీక్షలు, చికిత్సలు చేయవలసి ఉంటుంది. ఆ లెక్కన సింగరేణిలో డాక్టర్లను, వైద్య సిబ్బందిని, స్పెషలిస్ట్ డాక్టర్లను తప్పనిసరిగా భర్తీ చేసుకుని వైద్య సౌకర్యాలను మెరుగుపరిచవలసిన ఆవశ్యకత ఉన్నది.

# దేశంలో చట్టసభల గౌరవం తగ్గుతోంది..

మన దేశంలో చట్టసభలు సమావేశం అయ్యే రోజులు నానాటికీ తగ్గిపోతున్నాయి. అంతేకాదు, ఉద్దేశపూర్వకంగా అంతరాయం కల్పించడం సంఖ్యాబలంతో చర్చలు జరపకుండానే ఏకపక్షంగా బిల్లులు ఆమోదించుకోవడం మూలంగా మన దేశ చట్టసభల గౌరవ మర్యాదలు అడుగంటిపోతున్నాయి. మనదేశంలో మొదటి లోకసభ వార్షిక సగటు పని దినాలు 135 రోజులు అయితే, 17వ లోకసభ (2019–24)కు వచ్చేసరికి అవి 55కు పడిపోయాయి. చట్టసభల భేటీ సంఖ్య తగ్గి పోవడంపై స్పీకర్ల సదస్సు (ఏఐపీఓసీ) గతంలోనే ఆందోళన చెంది, ఇవి సాలీనా ఎన్ని రోజులు సమావేశం కావాలో నిర్దేశిస్తూ రాజ్యాంగ నిబంధనలను రూపొందించాలని 1993 'ఏఐపీఓసీ' తీర్మానించింది. ఆ మేరకు 70 మంది కంటే తక్కువ సభ్యులు ఉన్న అసెంబ్లీ ఏడాదికి కనీసం 50 రోజులు కొలువుదీరాలని, మిగిలిన రాష్ట్రాల చట్టసభలు 90 రోజులు నడపాలని సంధాన సమీక్ష సంఘం (జస్టిస్ వెంకటాచలమయ్య) కమిషన్ సిఫారసు చేసింది. ఆ మేరకు రాజ్యసభ 100, లోక్‌సభ 120 రోజులపాటు భేటీ కావాలి. కానీ ఈ సూచనలేవి అమలు కాకపోవడంతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది. దీనితో ప్రభుత్వాలపై చట్టసభల పర్యవేక్షణతో పాటు పాలనలో పారదర్శకత అడుగంటి పోతుంది. చట్టసభల భేటీ తగ్గిపోవడంతో పాటు, అనవసర వాగ్వివాదాలతో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కాలాన్ని వృధా చేస్తున్నారు.

మనదేశంలోని శాసనసభల భేటీ కాలం.. పని వేళల సగటు 20 రోజులే.. 500 బిల్లులకు ఆమోదం అంటూ (పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ) అధ్యయనం ఈ విషయాన్ని తెలియజేసింది. వివరాల్లోకి వెళితే.. మన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాసనసభలు గత సంవత్సరం సగటున 20 రోజులు 100 గంటలు మాత్రమే పని చేశాయి. ఆ కాలంలో 17 బిల్లులను ఆమోదించాయి. వీటిలో 51శాతం బిల్లులు ప్రవేశపెట్టిన ఒక్కరోజు వ్యవధిలోనే ఆమోదం పొందాయి. ఒడిశా శాసనసభ 42 రోజులు, కేరళ శాసనసభ 37 రోజులు, పశ్చిమబెంగాల్ శాసనసభ 36 రోజులు పనిచేసి కొంత మెరుగనిపించాయి. కర్ణాటక శాసనసభ ఏడాదికి 60 రోజులు సమావేశం కావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, కేవలం 29 సిట్టింగ్స్ మాత్రమే జరిగాయి. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ఏడాదికి 90 సీటింగ్స్ జరపాలని అనుకుంటే, కేవలం 16 సమావేశాలతోనే సరిపెట్టింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ కూడా 16 రోజులే సమావేశమైంది. మణిపూర్‌లో 14, జమ్ము కాశ్మీర్ 5, నాగాలాండ్ 6, సిక్కింలో 8 రోజులపాటు శాసనసభ సమావేశాలు జరిగాయి. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర శాసనసభలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉంటుంది. కానీ ఒకటి రెండు రోజులు స్వల్పకాలిక సిట్టింగ్‌లతో కలిపి 11 రాష్ట్రాల్లో ఈ నియమాన్ని పాటించారు. 2017 నుంచి ఏడాదికి సగటున 30 రోజుల కంటే తక్కువగా సమావేశాలు జరిగాయి. ఆ సమయంలో 28 సిట్టింగ్స్ జరిగాయి. 2020లో కోవిడ్ కాలంలో ఆ సంఖ్య 16 కు పడిపోయింది. అప్పటినుంచి సగటున ఏడాదికి సుమారు 20 రోజుల పాటే సమావేశాలు జరిగాయి. 2018లో సగటున 26 సిట్టింగ్స్, 2019లో 24 సీటింగ్స్, 2021లో, 22లో 21 సిట్టింగ్స్ చొప్పున, 2023లో 22 సిట్టింగ్స్ జరగగా గత సంవత్సరం ఆ సంఖ్య 20కి తగ్గిపోయింది. కొన్ని రాష్ట్రాలు శాసనసభ ద్వారా లేదా నిబంధనలు రూపొందించుకోవడం ద్వారా కనీసం వార్షిక సిట్టింగ్స్‌ను నిర్దేశించుకున్నప్పటికీ 2017 నుంచి 2024 మధ్య వాటిలో ఏ రాష్ట్రము లక్ష్యాన్ని చేరలేదని నివేదిక వేలెత్తి చూపింది.

గత సంవత్సరం శాసనసభలు సగటున 100 గంటలు సమావేశం అయ్యాయి. కేరళ అత్యధికంగా 228 గంటల పాటు సమావేశం నిర్వహించగా, ఒడిస్సా 193 గంటలు, మహారాష్ట్ర, రాజస్థాన్ 187 చొప్పున, గోవా 172, ఛత్తీస్ గ్‌డ 155, తెలంగాణ 149, కర్ణాటక 145 (గంటలు) తర్వాత స్థానాల్లో నిలిచాయి. బిల్లులకు సంబంధించి సగటున ప్రతి శాసనసభ 17 బిల్లులను ఆమోదించింది. గత సంవత్సరం మొత్తం మీద 500 బిల్లులు ఆమోదం పొందాయి. 49 బిల్లులతో కర్ణాటక మొదటి స్థానంలో నిలువగా, తమిళనాడు 45, హిమాచల్ ప్రదేశ్ 32, మహారాష్ట్ర 32 తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ శాసనసభ కేవలం ఒకే బిల్లును ఆమోదించగా, రాజస్థాన్ అసెంబ్లీ రెండు బిల్లులకు ఆమోదం తెలిపింది. ఇలా భారతదేశ స్వాతంత్ర్య అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర, చట్టసభల నిర్వహణ భేటీ తగ్గిపోతుంటే! ప్రజా సమస్యలు ఎలా పరిష్కరించబడతాయి. కీలక సందర్భాల్లో సైతం ప్రజాభిప్రాయాలు వెల్లడి చేసుకునే అవకాశం లేకపోవడం, వ్యక్తి ఆరాధన, పార్టీల సొంత ఎజెండా కోసం ప్రజాకాలాన్ని వృధా చేస్తూ నిశిత చర్చలు లేకుండానే చట్టసభలు ముందుకెళ్లడం భావ్యమా!. ప్రజాసామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడంతో ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రజల నమ్మకం తగ్గుతుందని విశ్లేషకులు, నిపుణులు భావిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్దేశించుకున్న మేరకు చట్టసభలను నిర్వహించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

మేకిరి దామోదర్,
వరంగల్, ఫోన్: 9573666650

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జి 7 సమ్మిట్‌కు మోదీని ఆహ్వానించిన కెనడా ప్రధాని

**న్యూఢిల్లీ :** కెనడాలో జరుగనున్న జి 7 దేశాల శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందింది. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఈ మేరకు మోదీకి ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జి 7 శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాలని కోరారు. ప్రధాని మోదీ ఈ విషయాన్ని ధృవీకరించారు. తాను పాల్గొంటానని ఆయన తెలిపారు. 'కెనడా ప్రధానమంత్రి మార్క్ జె కార్నీ నుంచి ఫోన్ కాల్ రావడం ఆనందంగా ఉంది. ఇటీవలి ఎన్నికల విజయంపై ఆయనను అభినందించా. ఈ నెల చివర్లో కననాస్కిస్‌లో జరిగే జి 7 శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బలమైన సంబంధాలతో ముడిపడి ఉన్న శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలుగా భారత్, కెనడా పరస్పరం గౌరవం పొందాయి. నూతన శక్తితో కలిసి పనిచేస్తాం. శిఖరాగ్ర సమావేశంలో మన మీటింగ్ కోసం ఎదురు చూస్తున్నా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

### బిజెపి ఏతర ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో

## గవర్నర్ల అధికార దుర్వినియోగానికి తక్షణమే అడ్డుకట్ట

రాష్ట్రపతికి సిపిఐ రాజ్యసభ ఎంపి సందోష్‌కుమార్ లేఖ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో గవర్నర్ల అథారిటీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని సిపిఐ ఆరోపించింది. ఈ విషయమై సిపిఐ రాజ్యసభ ఎంపి పి.సందోష్ కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శుక్రవారం ఒక లేఖ రాశారు. ఈ చర్యలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని కోరారు. ఆయన ఇటీవల కేరళలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఒక సంఘటనను ఉదహరిస్తూ రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో భారతమాత చిత్రపటాన్ని ఉపయోగించారని, ఆ ఫంక్షన్‌ను రాష్ట్ర మంత్రి బాయ్‌కాట్ చేశారని సందోష్‌కుమార్ తీవ్ర ఆందోళనను వ్యక్తంచేశారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో గవర్నర్ల అథారిటీ ఈ అధికార దుర్వినియోగాన్ని నిరవధికంగా కొనసాగించడం బాధాకరమన్నారు. ఇటీవల కేరళ రాజ్‌భవన్‌లో జరిగిన పర్యావరణ దినోత్సవ వేడుకలలో చోటుచేసుకుందని, కేరళ గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఒక ప్రత్యేకమైన భారతమాత చిత్రపటాన్ని ప్రదర్శించారని సిపిఐ రాజ్యసభ ఎంపి సందోష్ ఆరోపించారు. ఎన్నికైన ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరుపకుండానే గవర్నర్ ఒక ప్రత్యేకమైన భారతమాత చిత్రపటాన్ని ప్రదర్శించడంతో వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ ఆ ఈవెంట్‌ను బాయ్‌కాట్ చేశారని తెలిపారు. కేవలం ఇదొక్క ఉదంతమే కాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో గవర్నర్లు రాజకీయ ఏజెంట్లు మాదిరిగా తరచూ ఇలాంటి చర్యలను పునరావృతం చేస్తున్నారని, గవర్నర్లు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో కూడిన ఔట్‌పోస్ట్‌లుగా రాజ్‌భవన్‌ను మారు



స్తున్నారని , ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారని సందోష్ కుమార్ ఆరోపించారు. 'చిహ్నాలు, పేర్లు (సరియైనరీతిలో ఉపయోగించకుండా నిరోధించే) చట్టం 1950ను, జాతీయ గౌరవ చట్టం అవమానాలను నిరోధించే చట్టం 1971ను జాతీయ చిహ్నాలను రాజకీయ ప్రయోజనాల కోసం సంభావ్యంగా ఒప్పించబడింది' అని సిపిఐ ఎంపి ఆరోపించారు.వలసవాద వ్యతిరేక ప్రతిఘటన సమయంలో భారతమాత చిత్రపటాన్ని స్వదేశీ ఉద్యమ కాలంలో అబనీంద్రనాథ్ ఠాగోర్ వాస్తవంగా ఊహించి ఉపయోగించిందని, ఇటీవల కాలంలో అపఖ్యాతిపాలైన ఒక సంస్థ విభజన రాజకీయాలకు దీనిని ఆయుధంగా మలుచుకుంటోందని సందోష్‌కుమార్ ఆరోపించారు. ఇలాంటి పునర్ ఊహాచిత్రాలు, వివాదాస్పద చిహ్నాలు అంగీకారయోగ్యంకావని, వీటిని అధికారిక, ప్రభుత్వ సంస్థలలో వాడటం ద్వారా మన సమాజాన్ని ముమ్మందు ఏకీకృతం చేయాలని చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.రాజ్యాంగఆదేశాలకు విరుద్ధంగా గవర్నర్లు వ్యవహరించే ధోరణికి తక్షణమే అడ్డుకట్ట వేయాలని సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ రాష్ట్రపతిని అభ్యర్థించారు.

## 5 వేలు దాటిన కొవిడ్ కేసులు

**న్యూఢిల్లీ :** దేశంలో కరోనా మహమ్మారి కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రోజురోజుకు కేసులు భారీగా నమోదు అవుతున్నాయి. ఇప్పుడు యాక్టివ్ కేసుల సంఖ్య 5,000 మార్కును దాటింది. కేరళలోనే అత్యధిక కేసులు ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్, బంగాల్, ఢిల్లీలో విపరీతంగా నమోదు అవుతున్నాయి. ఈమేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తాజా వివరాలను శుక్రవారం వెల్లడించింది. తాజా లెక్కల ప్రకారం, కొవిడ్ కేసుల సంఖ్య 3,364కు చేరింది. దేశంలో 5,364 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గత 24గంటల్లో నాలుగు మరణాలు నమోదయ్యాయి. 2025జనవరి నుంచి ఇప్పటి వరకు 55 మంది చనిపోయారు. మే 22నాటికి దేశంలో మొత్తం 257మంది యాక్టివ్ కేసులు ఉన్నాయి. అయితే క్రమంగా పెరుగుతున్న కేసులను దృష్టిలో పెట్టుకుని ఆక్సిజన్, ఐసోలేషన్ వార్డులు, వెంటిలేటర్లు, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రప్రభుత్వం అన్నిరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. కొవిడ్ 19 కేసులు పెరుగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తనిఖీలతో పాటుగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తుంది. డాక్టర్ సునీత శర్మ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్) అధ్యక్షతన ఈనెల 2,3 తేదీల్లో విపత్తు నిర్వహణ సెల్, అత్యవసర నిర్వహణ ప్రతిస్పందన (ఇఎంఆర్) సెల్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) సమీక్ష సమావేశం జరిగింది. ఆ సమయంలో పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చర్యలను తీసుకుంటున్నమని వారు తెలిపారు. ఐడిఎస్‌పి కింద రాష్ట్ర, జిల్లా నిఘా విభాగాలు ఇన్ఫ్లుఎంజా లైక్ ఇల్నెస్ (ఐఎల్ఐ) తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ ఇల్నెస్ (ఎస్ఎఆర్ఐ)లను నిశితంగా పరిశీలిస్తున్నాయని అధికారిక వర్గాలు తెలిపాయి. 'మార్గదర్శకాల ప్రకారం అన్ని ఎస్ఎఆర్ఐ కేసులకు, 5 శాతం ఐఎల్ఐ కేసులకు పరీక్ష సిఫార్సు చేయాలి. ఐసిఎంఆర్ విఆర్‌డిఎల్ నెట్‌వర్క్ ద్వారా హోల్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పాజిటివ్ ఎస్ఎఆర్ఐ నమూనాలను పంపుతారు' అని చెప్పాయి.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయము,
వికారాబాద్ జిల్లా

ఫారం - F
(రూల్-7 (c))

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్: జి/2487/2024 తేది : 06 .06. 2025
సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్ నెంబర్. బి/7450/2024 తేది : 06. 06. 2025
గజెట్ నంబర్: వికెబి-15/2025 తేది : 06. 06. 2025

ప్రకటన

తెలంగాణా ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా, బహుళార్థ సాధక పారిశ్రామికవాడ యేర్పాటు కొరకై వికారాబాద్ జిల్లా, దుద్యాల్ మండలం హకీంపేట్ గ్రామా శివారులోని సర్వే నెం. 252 భూమి విస్తీర్ణం **ఎ.351.10 గుం.** లకు ఫారం-సి ప్రకటన జిల్లా కలెక్టర్, వికారాబాద్ లేఖ సంఖ్య: జి/2487/2024, సబ్ కలెక్టర్, తాండూర్, లేఖ సంఖ్య: బి/7450/2024 తేది: 29.11.2024, ద్వారా ప్రకటించనైనది. ఇట్టి ప్రకటనను అనుసరించి **ఎ.96.21 గుం.** సంబంధించిన భూ యజమానులు సంప్రదింపుల ద్వారా నష్టపరిహారం తీసుకునుటకు అంగీకారము తెలిపినారు. ఈ వివరములు దిగువ చూపబడినవి.

గ్రామం: హకీంపేట్ మండలం: దుద్యాల్ జిల్లా: వికారాబాద్

| క్ర.సం. | పట్టాదారు పేరు / లబ్ధిదారు పేరు | సర్వే నెంబర్ | విస్తీర్ణం | హద్దులు |
|---|---|---|---|---|
| 1 | మంచ అంతమ్మ W/o వెంకటయ్య | 252/75 | 1.20 | |
| 2 | మంచ కిష్టమ్మ W/o బాలయ్య | 252/15 | 1.30 | |
| 3 | మామిళ్ల గోవింద్ S/o రాములు | 252/12/ 3 | 0.30 | |
| 4 | మఠం నాగ రత్నమ్మ W/o చంద్రశేఖర్ | 252/89 | 0.20 | |
| 5 | భూకలి మల్లయ్య S/o చిన్న బసప్ప | 252/36 | 1.30 | |
| 6 | కావలి సాయిలు S/o తిర్మలయ్య | 252/ఈ | 1.00 | |
| 7 | దొడ్డి విజయ లక్ష్మి W/o నర్సప్ప | 252/38 | 0.05 | |
| 8 | ఎర్ర చిన్న పద్మమ్మ W/o వెంకటయ్య | 252/ఉ | 1.30 | |
| 9 | జగదీశ్వర్ S/o నారాయణ | 252/35 | 3.00 | |
| 10 | సత్యమ్మ W/o మల్లప్ప | 252/25/1 | 3.00 | |
| 11 | బాలమ్మ W/o బసప్ప | 252/42 | 1.20 | |
| 12 | D. గోపాల్ S/o D. రాములు | 252/90 | 1.20 | |
| 13 | మొగులయ్య S/o బసప్ప | 252/72 | 1.20 | |
| 14 | మంగమ్మ W/o మల్లప్ప | 252/74/2 | 1.30 | |
| 15 | బుకలి హన్మయ్య S/o తిప్పన్న | 252/30 | 0.30 | |
| 16 | మామిళ్ల వెంకటయ్య S/o చంద్రయ్య | 252/12/1 | 0.30 | |
| 17 | కుమ్మరి వెంకటయ్య S/o బసయ్య | 252/58/1 | 1.06 | |
| 18 | శారదమ్మ W/o బాల్ రెడ్డి | 252/101 | 2.00 | |
| 19 | మామిళ్ల శ్రీనివాస్ S/o చంద్రయ్య | 252/12/2 | 0.30 | |
| 20 | శ్రీనివాస్ S/o చంద్రయ్య | 252/4 | 1.00 | |
| 21 | సుధారాణి W/o లక్ష్మీ నారాయణ | 252/73/1 | 1.30 | |
| 22 | విజయలక్ష్మి W/o నర్సప్ప | 252/69/1 | 1.20 | |
| 23 | నడిమింటి సుజాత W/o వెంకటయ్య | 252/88 | 1.10 | |
| 24 | మంచ అంతమ్మ W/o బాలప్ప | 252/93 | 2.00 | |
| 25 | మఠం చంద్ర శేఖర్ S/o మల్లయ్య | 252/95 | 2.00 | |
| 26 | మంచ మణెమ్మ W/o మల్లప్ప | 252/107 | 1.10 | |
| 27 | మొగిలిమోని రామకృష్ణ S/o గాండ్యప్ప | 252/108 | 0.30 | |
| 28 | మొగిలిమోని పద్మమ్మ W/o తమ్మప్ప | 252/108 | 0.30 | |
| 29 | మొగిలిమోని పద్మమ్మ W/o తమ్మప్ప | 252/109 | 1.20 | |
| 30 | కావలి నీలమ్మ W/o వెంకటయ్య | 252/110 | 2.00 | |
| 31 | మంచ అనురాధ W/o బాల్రాజ్ | 252/111 | 2.00 | |
| 32 | కావలి భారతమ్మ W/o రాములు | 252/112 | 1.20 | |
| 33 | కావలి శ్రీశైలం S/o రాములు | 252/112/1 | 1.20 | |
| 34 | దొరెమోని లక్ష్మి W/o అంజిలయ్య | 252/78 | 2.00 | |
| 35 | బాలమ్మ W/o రామయ్య | 252/10/3 | 1.30 | |
| 36 | గోవిందమ్మ W/o మల్లయ్య | 252/10/6 | 1.20 | |
| 37 | కావలి పకీరమ్మ W/o అనంతయ్య | 252/116/1 | 0.30 | |
| 38 | M. లక్ష్మి W/o భీమయ్య | 252/10/7 | 1.30 | |
| 39 | కావలి రాములమ్మ W/o చంద్రయ్య | 252/10/16 | 2.00 | |
| 40 | డి. సాయి కుమార్ S/o బాలకిష్టయ్య | 252/10/18 | 2.00 | |
| 41 | D. కృష్ణకాంత్ S/o అంజిలయ్య | 252/10/19 | 4.00 | |
| 42 | బోయిని నాగమణి W/o బాలకిష్టయ్య | 252/14 | 2.00 | |
| 43 | మహ్మద్ ఖాజా బేగం W/o యూసుఫ్ | 252/3/23 | 3.00 | |
| 44 | కావలి అంజమ్మ W/o రవీందర్ | 252/10/21 | 4.00 | |
| 45 | విజయ లక్ష్మి W/o గోవర్ధన్ | 252/10/26 | 1.20 | |
| 46 | ఎ. ఎల్లమ్మ W/o రాములు | 252/10/24 | 1.20 | |
| 47 | కె. కృష్ణ S/o వెంకటయ్య | 252/10/27 | 1.20 | |
| 48 | దానాల లక్ష్మి కాంతం S/o లక్ష్మయ్య | 252/10/23 | 2.00 | |
| 49 | సి. శ్రీశైలం S/o వెంకటయ్య | 252/10/28 | 0.25 | |
| 50 | సి.అంజిలయ్య S/o వెంటయ్య | 252/10/28 | 0.25 | |
| 51 | కె. రాములు S/o కిష్టయ్య | 252/10/29 | 1.20 | |
| 52 | మహమూద్ S/o హస్సర్ | 252/10/32 | 2.00 | |
| 53 | దొరెమోని మల్లేష్ S/o వెంకటయ్య | 252/118 | 2.00 | |
| 54 | దొరెమోని రమేష్ S/o వెంకటయ్య | 252/119 | 2.00 | |
| 55 | రాచూరి మణెమ్మ W/o శ్రీనివాస్ | 252/120 | 1.00 | |
| 56 | డి. కిష్టమ్మ W/o మల్లప్ప | 252/118/4 | 2.00 | |
| 57 | అఫ్జల్ S/o హకీమ్ | 252/10/30 | 2.00 | |
| 58 | మోముల వినోద్ S/o అనంతయ్య | 252/10/31 | 1.00 | |
| 59 | రాములు S/o ఎల్లప్ప | 252/33/1 | 1.20 | |
| 60 | అంజిలయ్య S/o ఎల్లప్ప | 252/33/2 | 1.20 | |
| | మొత్తం విస్తీర్ణం (ఎకరములు గుంటలు) | | 96.21 | |

ఇట్టి ప్రకటన యందు ఏమైనా అభ్యంతరములు కాని , ఆక్షేపణలు కాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 07 (ఏడు) దినములలోగా జిల్లా కలెక్టర్, వికారాబాద్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేయవలెను.

తేది: 06.06.2025

సం/- తహశీల్దార్ దుద్యాల మండలం
సం/- సబ్-కలెక్టర్ తాండూర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా

DIPR RO NO. 2013/LA/PP/Advt/Pub/2025-26



### ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి

## వడ్డీరేట్లు, నగదు నిల్వల నిష్పత్తి తగ్గింపు

ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ వెల్లడి

'రెపో'రేటు ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గింపు

ముచ్చటగా మూడోసారి ఆకస్మిక తగ్గింపు



**న్యూఢిల్లీ :** ఆర్థికవ్యవస్థ వృద్ధికి ఊతం ఇచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం ఊహించనిరీతిలో వడ్డీరేట్లను, నగదు నిల్వల నిష్పత్తి(సిఆర్‌ఆర్)ని అంచనావేసిన దానికంటే ఏకంగా 50 బేసిస్ పాయింట్లను తగ్గిస్తూ ఒక ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. ఈ ఆకస్మిక తగ్గింపు వరుసగా మూడవసారి. భౌగోళిక, రాజకీయ, టారిఫ్ ప్రతికూలతల మధ్య ఎకానమీకి మద్దతు ఇవ్వడం కోసం బ్యాంక్‌లకు నగదు నిల్వల నిష్పత్తి(సిఆర్‌ఆర్)ని ఊహించని విధంగా తగ్గించింది.గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆర్‌బిఐ ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీలో ముగ్గురు బహిర్గత సభ్యులు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బెంచ్‌మార్క్ పునర్ కొనుగోళ్లను తగ్గించడానికి ఐదుకు ఒకటి ఓటు వేశారు. రెపో రేట్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.5శాతానికి కుదించారు. ఇది నగదు నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్లపై కోత విధించి 3శాతానికి కుదించింది. తాజా తగ్గింపుతో ఆర్‌బిఐ ఇప్పుడు వడ్డీ రేట్లను 2025లో మొత్తం 100బేసిస్ పాయింట్లకు తగ్గించడం జరిగింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ తన తాజా నిర్ణయాలను శుక్రవారం వెల్లడించింది. ఇది ఫిబ్రవరిలో త్రైమాసిక పాయింట్ల తగ్గింపుతో మొదలవుతుంది. మే 2020లో మొదటి తగ్గింపు , ఆతర్వాత ఏప్రిల్‌లో అదే తరహాలో మరొక తగ్గింపు చేసింది. సెంట్రల్ బ్యాంక్ అదే సమయంలో తన ద్రవ్య వైఖరిని 'అనుకూలత' దిశ నుంచి 'తటస్థం' వైపునకు మార్చుకుంది. ఇన్‌కమింగ్ డేటాపై తదుపరి చర్య ఆధారపడి ఉంటుందని గవర్నర్ మల్హోత్రా చెప్పారు. ఆర్‌బిఐ గవర్నర్ మాట్లాడుతూ నిర్ణయానికి హేతుబద్ధతను తెలియజేశారు. ద్రవ్యోల్బణం లేదా నిరవధిక ధరల పెరుగుదల గత ఆరు నెలలుగా 2024 అక్టోబర్‌లో టోలరెన్స్ బాండ్ కంటే తక్కువగా ఉండి లక్ష్యానికి చాలా దిగువన ఉన్నదని, విస్తృత స్థాయిలో నియంత్రణ సంకేతాలు ఉన్నాయని చెప్పారు. 'మరొక వైపు అభివృద్ధి అనేది సవాల్‌గా ఉన్నటువంటి ప్రపంచ పర్యావరణ, పెరిగిపోతున్న అనిశ్చితి కంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో దేశీయ వినియోగం, పెట్టుబడిని పాలసీ లివర్ల ద్వారా ప్రోత్సహించడం, కొనసాగించడం అత్యవసరం' అని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.5శాతానికి క్షీణించడంతో రెపోరేటు తగ్గింపు పరిస్థితి నెలకొన్నది.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలు పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలతో ఎదురీదాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఆర్‌బిఐ ఏప్రిల్ 1వ తేదీ నుంచి మొదలయ్యే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అదే తరహా చర్యలను చేపట్టింది. సెంట్రల్ బ్యాంక్ తన ద్రవ్యోల్బణం అంచనాను ఇంతకు ముందున్న 4శాతం నుండి 202526 కోసం 3.7శాతానికి తగ్గించింది.నగదు నిల్వల నిష్పత్తిలో 100 బేసిస్ పాయింట్ల కోత నాలుగు సమాన స్థాయిలలో అంటే 25బేసిస్ పాయింట్లలో 2025 సంవత్సరం సెప్టెంబర్ 6, అక్టోబర్ 4, నవంబర్ 1, నవంబర్ 29 తేదీల నుంచి అమలులోకి రానుంది.

### ఎల్‌జి ప్రమోట్ అయ్యారు..

## నన్ను డిమోట్ చేశారు

జమ్మూకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** లెఫ్టినెంట్ గవర్నర్ ప్రమోట్ కాగా తాను డిమోట్ అయ్యానని జమ్మూకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రధాని మోదీతో వేదిక పంచుకున్న ఆయన జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా అంశాన్ని మరోసారి లేవనెత్తారు. శుక్రవారం చినాబ్ వంతెన, కాట్రా– శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. జమ్మకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సిఎం ఒమర్ అబ్దుల్లా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని అన్ని రైల్వే ప్రాజెక్టుల్లో ప్రధానితో అనుబంధం కలిగి ఉండటం తన అదృష్టమన్నారు.

కాగా, మొదటిది అనంతనాగ్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం, రెండవది బనిహాల్ రైల్వే టన్నెల్ ప్రారంభోత్సవంలో తాను పాల్గొన్నట్లు ఒమర్ అబ్దుల్లా గుర్తుచేశారు. '2014లో కాట్రా రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇదే నలుగురు వ్యక్తులు ఇక్కడ ఉన్నారు. అప్పటి రైల్వే శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా, జమ్మకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పదోన్నతి పొందారు. అయితే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి కేంద్రపాలిత ప్రాంతం సిఎంగా నన్ను తగ్గించారు. కానీ మన కు తెలియకముందే పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తారు' అని అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను మోదీ ముందు ఇలా ప్రస్తావించారు.

## ఆర్‌సిబి టీమ్ మార్కెటింగ్ హెడ్ అరెస్టు



**బెంగళూరు :** పద్దేనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత ఐపిఎల్ కప్ అందుకున్న తర్వాత ఆర్‌సిబికి సంబంధించిన విజయోత్సవంలో జరిగిన తొక్కిసలాటపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఆర్‌సిబి టీమ్ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసాలేను శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. ముంబయి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఆయనను బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణకు తరలించారు. మరోవైపు, విజయోత్సవ కార్యక్రమ నిర్వాహకులను కూడా అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈవెంట్ నిర్వాహక సంస్థ డిఎన్‌ఎ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది కిరణ్, సుమంత్, సునీల్ మాథ్యూను విచారణకు తరలించారు. అయితే విజయోత్సవ ఈవెంట్‌ను డిఎన్‌ఎ సంస్థతో నిఖిల్ సమన్వయం చేసుకుని నిర్వహించినట్లు తెలుస్తోంది.

### పలువురు సస్పెన్షన్

అయితే చిన్నస్వామి మైదాన్ సమీపంలో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న బి. దయానంద్‌ను, అదనపు పోలీసు కమిషనర్ వికాస్ కుమార్ వికాస్,సెంట్రల్ డివిజన్ డిసిపి శేఖర్ టెక్కన్నవర్ తదితరులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం సస్పెండ చేసింది. ఆ తర్వాత కొత్త పోలీస్ కమిషనర్‌గా సీమంత్ కుమార్ సింగ్‌ను నియమించింది. దీంతో ఆయన గురువారం అర్ధరాత్రి కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

### సిట్ ఏర్పాటు చేసిన హైకోర్టు

మరోవైపు, కర్ణాటక హైకోర్టు కూడా తొక్కిసలాట ఘటనను సుమోటోగా పరిగణించి విచారణ జరిపింది. ముడిపడిన కార్యక్రమాన్ని నిర్వహించటంలో వైఫల్యం ఎవరిదో తేల్చిచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దర్యాప్తునకు సీఐడీ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఘటనకు కర్ణాటక క్రికెట్ సమాఖ్య, ఆర్‌సిబి ప్రతినిధులను బాధ్యులుగా పేర్కొంటూ తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించింది.

### సిఎం రాజకీయ కార్యదర్శిపై వేటు

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె.గోవిందరాజ్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన నియమకాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చినట్టు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఆర్‌సిబి ఐపిఎల్ టీమ్ విజయోత్సవం సందర్భంగా బెంగళూరులోని స్టేడియంలో ఈనెల 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది దుర్మరణ పాలయ్యాయి. ఈ నేపథ్యంలో గోవిందరాజ్‌కు ఉద్వాసన చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఆయనను తొలగించడానికి కారణం ఏమిటనేది అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు. ఆర్‌సిబి ఐపిఎల్ టీమ్ విజయోత్సవాన్ని విభేదిస్తూ తాను సిఎంకు సలహా ఇచ్చానని గోవిందరాజ్ పేర్కొన్నట్టు ఒక కథనం వచ్చింది. అయితే తన మాటలను వక్రీకరించారని, ఈ అంశంపై తాను ఎప్పుడూ ముఖ్యమంత్రికి సలహా ఇవ్వలేదని గోవిందరాజ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రికి సలహా ఇవ్వడానికి నేనెవర్ని? అని ఆయన ప్రశ్నించారు. విషాదంతంగా మారిని ఫెలిసిటేషన్ ఈవెంట్ ప్లానింగ్, నిర్ణయం విషయంలో తనకెలాంటి ప్రమేయం లేదన్నారు. క్రికెట్‌కు సంబంధించిన విషయంలో తాను ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదని, నిజానికి తాను కర్ణాటక ఒలంపిక్ అసోసియేషన్‌కు హెడ్‌గా ఉన్నానని చెప్పారు. ఆ కారణంగా క్రికెట్ సెలబ్రేషన్‌పై తాను సలహాలివ్వడం సరి కాదన్నారు.

## రాజ్యసభకు కమల్ హాసన్ నామినేషన్



**చెన్నై :** మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ శుక్రవారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. చెన్నై సెక్రటేరియట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సహా పలువురు నేతలు హాజరయ్యారు. ఆయనతో పాటు ప్రస్తుతం రాజ్యసభ ఎంపిగా ఉన్న న్యాయవాది విల్సన్, ఎస్ఆర్ శివలింగం, రుక్యయ్య మాలిక్ అలియాస్ కవిగ్నార్ సల్మా సైతం డిఎంకె తరఫున నామినేషన్ దాఖలు చేశారు. మరో ఇద్దరు అన్నా డిఎంకె నేతలు రాజ్యసభకు నామినేషన్ వేశారు. ఇటీవల తన తాజా చిత్రం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కన్నడ భాషపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో బుధవారం వేయాల్సిన రాజ్యసభ నామినేషన్‌ను కమల్ హాసన్ వాయిదా వేసుకున్నారు. ఈ సినిమా వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. థగ్ లైఫ్ చిత్రం గురువారం విడుదలవడంతో శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడులో త్వరలో ఖాళీ కానున్న ఆరు రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం 2025 జులై 25న ముగియనుండడంతో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే జూన్ 2న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ జూన్ 9న ముగియనుంది. ఆరు సీట్లకు గానూ 4 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఇప్పటికే డిఎంకె వెల్లడించింది. అందులోనే ఒక స్థానానికి మిత్రపక్షమైన ఎంఎన్‌ఎంకు కేటాయించింది. 2018లో కమల్ హాసన్ స్థాపించిన ఎంఎన్ఎం పార్టీ విపక్ష ఇండియా కూటమిలో భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డిఎంకె, కాంగ్రెస్ కూటమికి ఇది మద్దతు ప్రకటించింది. ఇందుకుగాను జరిగిన ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. దీంతో 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డిఎంకె నేతృత్వంలోని కూటమి అప్పట్లో అంగీకరించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

కీలక నేత భాస్కర్ మృతి

సొంత జిల్లా ఆదిలాబాద్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎదురు కాల్పుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆదిలాబాద్ జిల్లా వాసి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇంద్రావతి జాతీయ ఉద్యాన వనం సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనా స్థలంలో పేలుడు పదార్థాలతో పాటు ఏకే 47 తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కాగా గురువారం నాడు ఇదే ప్రాంతంలో కేంద్ర కమిటి సభ్యుడు సుధాకర్ మృతి చెందిన మరుసటి రోజు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. మావోయిస్టులు అక్కడ మకాం వేశారనే పక్కా సమాచారం మేరకు భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని బుధవారం నుండి తమ ఆదీనంలోకి తీసుకున్నాయి. అప్పటి నుండి శుక్రవారం రాత్రి వరకు ఇరు వర్గాల మధ్య అడపాదడపా ఎదురు కాల్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. బస్తర్ ప్రాంతంలో సిపిఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, అలియాస్ బసవరాజును ఎన్‌కౌంటర్ చేసిన పక్షం రోజుల్లోనే కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యుడు భాస్కర్ మృతి చెందడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్ అడువుల్లో గట్టిపట్టు సాధించిన బలగాలు అనువనువునా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. సమాచారాన్ని వేగవంతంగా తెప్పించుకో గలగుతున్న వారు దళాల ఆచూకీ ఇట్టే పట్టేస్తున్నారు. వారికి కనీసం అనుమానం రాకుండా నలువైపులా చుట్టుమట్టి కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. దీంతో మావోయిస్టు పార్టీలో అంతర్మధనంలో పడింది. ఇప్పటికైనా మావోయిస్టు పార్టీ చర్చలకు కేంద్రం రావాలని మేధావులు, కవులు, కళాఖారులు, విప్లవోధ్యమ విశ్లేషకులు, సానుభూతిపరులు కోరుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వేర్వేరు ఘటనల్లో 204 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 187 మంది బస్తర్ డివిజన్‌లోని హతమయ్యారు. ఇందులో బీజాపూర్, బస్తర్, కాంకేర్, కొండగావ్, నారాయణ్పూర్, సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. గత ఏడాది జనవరి నుండి ప్రభుత్వ లెక్కల ప్రకారం బస్తర్ డివిడన్‌లో ఇప్పటి వరకు 404 మంది కంటే ఎక్కువమంది వివిధ క్యాడర్లకు చెందిన మావోయిస్టులు వేర్వేరు ఎన్కౌంటర్లలో మృతి చెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.


**TO WHOME SOEVER IT MAY CONCERN**

I, Waseema Saher W/o. Ather Ahmed Age: 44 years Occ: Housewife R/o.H.No.1-1-47/11/1, Stdreet Gansh Nagar, Adilabad Town, I lost my chequs books containing Cheque Numbers (1) 30166 to 30190 (2) 12946 to 12965 (3) 91881-91900 of Indian Bank Branch Adilabad vide A/c.No. 956343145 and (1) (1) 000011 to 000025 (2) 000026 to 000040 of Bank of Baroda Branch Adilabad vide A/c. No.52050100008602.

That, the above said cheques books lost by me while I was proceeding from my house i.e., Ganesh Nagar to Bank of Baroda on my vehicle for withdrawing of amount and I lost the same in between Ganesh Nagar to Bank of Baroda branch Adilabad on 03.-06-2025.

That anybody if found the above mentioned cheques books, please inform me to my cell number I will be thankful to you.

Waseema Saher W/o Ather Ahmed
R/o. H.No.1-1-47/11/1, Street
Ganesh nagar Adilabad town
Cell: 9441517979

The same may be published in your news paper for informing the public in general



# జనరల్
STATE & REGIONAL NEWS

## చారిత్రక ఘటనకు కౌంట్‌డౌన్ మొదలు

**వాషింగ్టన్:** ప్రభుత్వ, ప్రైవేటు సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టిన యాక్సియం మిషన్ (ఎx4) మిషన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. భారత్‌కు చెందిన శుభాంశు శుక్లా ఈ మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లోకి అడుగుపెట్టనున్నాడు. రాకేష్ శర్మ తర్వాత ఒక భారత వ్యోమగామి అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే మొదటిసారి. అంతేకాదు, ఐఎస్‌ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడిగా కూడా శుభాంశు రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదిస్తారు. అమెరికాకు చెందిన యాక్సియం స్పేస్ కంపెనీ ఈనెల 10న ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ మిషన్‌లో శుభాంశు అత్యంత కీలకమైన పైలట్ పాత్రను పోషించనున్నారు. భారత వైమానిక దళానికి చెందిన ఆయనతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా – నాసా వ్యోమగామి/కమాండర్), మిషన్ స్పెషలిస్టులు సావోస్ ఉజ్నాన్స్కీ (పోలాండ్), టికార్ కాపు (హంగరీ) కూడా ఐఎస్‌ఎస్ చేరుకుంటారు. ఈ మిషన్‌ను కేవలం అంతరిక్ష యాత్రగానే చూడడానికి వీల్లేదు. మొత్తం 31 దేశాలు పాల్గొంటున్న ఈ మిషన్‌లో 60 శాస్త్రీయ ప్రయోగాలు జరుగుతాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' కూడా ఈ మిషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్నది. భారత్ తరఫున ఏడు మైక్రో గ్రావిటీ ప్రయోగాలు చేయనుంది.



## నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థులకు ఆహ్వానం

పోస్టర్ రిలీజ్ చేసిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, ఎండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఇందుకు సంబందించిన పూర్తి వివరాలతో కూడిన పోస్టర్ ను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎండి సోనిబాల దేవి లు శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. హకీంపేట్, కరీంనగర్, అదిలాబాదులో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుంది. 16 జూన్ నుండి 19 జూన్ వరకు మండల స్థాయి ఎంపిక, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయిలో 23 జూన్ నుండి 26 జూన్ వరకు అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జులై 1 నుండి జులై 5వరకు ఎంపిక జరుగుతుందని వారు తెలిపారు. హకీంపేటలో బాలురులకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు, కరీంనగర్ లో బాలురులకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు,అదేవిధంగా అదిలాబాదులో బాలురకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు మొత్తం 120 సీట్లకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. మొత్తం తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 01092016 నుండి 308 2017 మధ్యన జన్మించి 8 నుండి 9 సంవత్సరాలు వయసు కలిగినవారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వారు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు తమ మొబైల్ నుండి కానీ, లేదా యుఆర్‌ఎల్ www.tgss.telangana.gov.in లో తమ వివరాలు నమోదు చేసుకోనవచ్చునన్నారు.

## ఘనంగా ఎస్‌ఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవ వేడుకలు

సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి డాక్టరేట్ ప్రదానం


**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మండలంలోని అనంతసాగర్‌లో వెలసిన ఎస్‌ఆర్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఆర్ యూనివర్సిటీ ఛాన్సల్ వరదారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ సతీష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఎయిరోస్పేస్ డిఫెన్స్ మ్యానుఫాక్చరింగ్ హబ్‌కి గౌరవ సలహాదారుగా ఉన్నారు. అలాగే ఎయిరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షునిగా ఉన్నారు. అంతకుముందు ఆయన రక్షణ పరిశోధన అభివృద్ధి విభాగం కార్యదర్శిగా, డీఆర్‌డీఓ చైర్మన్‌గా, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారులుగా సేవలందించారు. పద్మశ్రీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి తెలుగు సినీ పరిశ్రమలో ఆయన చేసిన విశేష సేవల్ని గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఆయన స్వరపర్చిన ఆర్‌ఆర్ ఆర్ చిత్ర నుంచి నాటు నాటు పాటకు గాను ఆస్కార్ పురస్కారం, గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడంతో ఆయన ప్రతిభ అంతర్జాతీయంగా ప్రశంసలు పొందింది. ఇది భారతదేశానికి గర్వకారణంగా మారింది. చిన్న సినిమాల నుంచి ప్రయాణం ప్రారంభించిన కీరవాణి మనసు మమత అనే చిత్రంతో సంగీత ప్రస్థానం మొదలుపెట్టి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారు. అలాగే తెలుగు సినిమాకు అందించిన గొప్ప కవిత సేవలకు గాను చంద్రబోస్‌కి గౌరవ డాక్టరేట్‌ను ఈ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా అందచేశారు. ప్రొఫెర్ ఛాన్సలర్ మధూకర్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మహేష్, వివిధ స్కూళ్ల డీన్లు, విభాగాధిపతులు, ముఖ్యఅతిథులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

# కూనంనేని కృషితో కొత్తగూడానికి మరో మణిహారం

■ ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ■ యూనివర్సిటికీ మాజీ ప్రధాని మన్మోన్ సింగ్ పేరు ■ ప్రపంచ స్థాయిలో మార్మోగనున్న భద్రాద్రి జిల్లా ఖ్యాతి ■ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కూనంనేని, తుమ్మల

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెంకు మరో మణిహారం రాబోతోంది. నియోజకవర్గంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు నాయకునిగా ప్రజలకు కావాల్సిన అవసరాలతో పాటు భావితరాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉన్న ఆయన శాసనసభ్యుడిగా గెలుపొందిన నాటి నుండి ఇప్పటికే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అంచలంచెలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇందు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున సహాయసహకారాలు ఉండటంతో పాటు ముగ్గురు మంత్రులైన మల్లుభట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఉమ్మడి జిల్లా వాసులు కావడం మరింతగా కలిసొస్తోంది. ఇదిలాగా ఉండగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉండటంతో మంత్రులకు కూనంనేనికి ఉన్న సత్సంబంధాలు అభివృద్ధికి బాటలేస్తున్నాయి. గురువారం జరిగిన క్యాబినేట్ సమావేశంలో కొత్తగూడెం కేంద్రంగా ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఉమ్మడి జిల్లా వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఏర్పాటు చేయబోయే ఎర్త్ యూనివర్సిటీకి మాజీ భారతప్రధాని డా.మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించారు.

అమెరికా తర్వాత ఇక్కడే/// ఎర్త్ సైన్స్ యూవివర్సిటీ అమెరికా దేశంలో మాత్రమే ఉంది. ఇప్పుడు తెలంగాణలోని కొత్తగూడెం నియోజవర్గంలో ఏర్పాటు చేయనుండటంతో దేశంలోనే రెండో విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందనుంది. సుమారు 300 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ యూనివర్సిటీతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభిస్తుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మంది విద్యా ఉపాధి అవకాశాలకు మార్గం సుగుమమైంది. పెద్దఎత్తున యువశాస్త్రవేత్తలు ఇక్కడి నుండే దేశభవిష్యత్‌కు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్రపోషించనున్నాయి.



### యూనివర్సిటీ అందించనున్న కోర్సులు ఇవే

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ఏర్పాటు చేయతలపెట్టిన ఎర్త్ యూనివర్సిటీలో పలు రకాల కోర్సులను ప్రవశపెట్టేందుకు కూడా క్యాబినెట్‌లో నిర్ణయం జరిగింది. యుజి బిఎస్‌ఇ ప్రోగ్రాంలో జియాలజీ, ఎన్విరానమెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రి,. పిజి ఎంఎస్‌సి ప్రోగ్రాంలో జియోలజీ, ఎన్విరానమెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, కెమిస్ట్రి,. పిహెచ్‌డి ప్రోగ్రాంలో యూజిసి నిబంధనల ప్రకారం కోర్సులను అందించడంతో పాటు ఇప్పటికే బిటెక్ ప్రోగ్రామ్‌లో ఉన్న మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని ప్రతీ కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లతో కోర్సులు అందిస్తారు.

### యువతకు ఉద్యోగ అవకాశాలు

మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మంజూరు చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అపాధి అవకాశాలు లభించనున్నాయి. వేలాదిమంది ఉన్నత చదువులకు కొత్తగూడెం కేంద్రం బిందువు కానుంది. అనేకమంది శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దబడబోతున్నారు. సింగరేణి గనులతో పాటు పలు సహజ వనరులున్న ఈ జిల్లాకు మరో మణిహారంతో కొత్తగూడెం ఖ్యాతి ప్రపంచ పటంలో మురయనుంది.

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కూనంనేని

కొత్తగూడెం నియోజకర్గంలో ఎర్త్‌యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డికి, మంత్రులకు, సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### పట్టువీడని విక్రమార్కుడు కూనంనేని

కొత్తగూడెం ఎంఎల్‌ఏగా గెలిచిన కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాభివృద్ధికి పట్టువిడువని విక్రమార్కునిగా మారారు. నియోజకర్గ ముఖ చిత్రంపై పూర్తి పట్టున్న ఆయన ఇక్కడి సహజ వనరులు, భౌగోళిక పరిస్థితులు, నైసర్గికస్వరూపం, పరిశ్రమలు, విభిన్న ప్రజలు, వారి జీవనశైలి,ఆహారపు అలవాట్లు, అభిరుచులు,కట్టుబాట్లపై పూర్తి పట్టున్న ఆయన నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి గెలిచిన మరుక్షణం నుండి ఆలోచించడం మొదలుపెట్టారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. పారిశ్రామికంగా ఎంతో ప్రగతి ఉన్న ఈప్రాంతం మరింత ముందుకు పోవాలంటే ఏం చేయాలో ఆలచన చేసి నివేదికలు తయారు చేయించి ప్రభుత్వ పెద్దలను కలిసి ఫైళ్లు కదిలించి ముఖ్యమంత్రి, మంత్రిమండల సహాకారంతో పెద్ద ఎత్తున నిధులు తెప్పిస్తున్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

# రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

10 ఏళ్ల పాలనలో మీరేం చేశారో చెప్పగలరా?

గత ప్రభుత్వంలో వేములవాడకి నిధులు ప్రకటించి- ఒక్క పైసా కూడా ఇవ్వలేదు?

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజన్న కోడెలపై రాజకీయమొద్దని, గడిచిన 10 ఏండ్లలో వేములవాడ టెంపుల్ కి సంబంధించి బిఆర్‌ఎస్ పాలనలో ఏం చేశారో చెప్పగలరా? అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూటిగా ప్రశ్నించారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కెసిఆర్, కెటిఆర్‌లది కాదా అని ఆమె ప్రశ్నించారు. ఆ పాపం బిఆర్‌ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని.. అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు. హామీ ఇచ్చిన నిధులు కేటాయించకపోవడం వల్లనే వేములవాడలో రాజన్న కోడెలకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహించారు. నేటి ఈ కోడెల దుస్థితికి పాపం కెసిఆర్ పాలనదేనని అన్నారు. అయితే, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందని అన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోని ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. అయినా, ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరికాదన్నారు. శుక్రవారం ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ హయాంలో సక్సెస్ ఫుల్ గా సరస్వతీ పుష్కరాలు నిర్వహించామన్నారు. పుష్కరాలకు 30 లక్షల మంది భక్తులు వచ్చినా ఎక్కడా చిన్న ఇబ్బంది జరగకుండా నిర్వహించామన్నారు. ఇక భద్రకాళి టెంపుల్ విస్తరణ పనులు కోట్లాది రూపాయలతో చేపట్టామన్నారు. యాదగిరిగుట్ట మీద కెసిఆర్ బొమ్మలను చెక్కించుకున్న వాళ్ళకి అసలు దేవుళ్ళ విషయంలో మాట్లాడే అర్హత ఉందా అని సురేఖ ప్రశ్నించారు. యాదగిరిగుట్టకి తాము రూ.63 కేజీల బంగారంతో గోపురం తాపడం చేయించామన్నారు. సామూహిక కోటి దిపోత్సవం, పలు నదీ హారతి కార్యక్రమాలు, కాళేశ్వరం, యాదగిరిగుట్టలకు మహా కుంభాభిషేకం చేశామన్నారు. అసలు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ఏనాడైనా చేశారా? దేవాదాయ శాఖలో డెవలప్మెంట్ యాక్టివిటీ జరిగిందా అంటూ నిలదీశారు. కాగా, ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై బిఆర్‌ఎస్ నాయకుల మాటలు, స్పందనలు చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తమ నాయకు రేవంత్ రెడ్డి అన్న సీఎం అయ్యాక వేములవాడకు మాస్టర్ ప్లాన్ ఆమోదించుకున్నామని, వేములవాడ అభివృద్ధికి నిధులు ఇచ్చామన్నారు. రాజన్న టెంపుల్ విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. ఒక్కో నెలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో కోడెలను సమర్పిస్తారని, ఇది అక్కడ అందరికీ తెలిసిందేనని, కొన్నిసార్లు అనారోగ్యంతో ఉన్న కోడెలను భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళుతారని, వాటిని కూడా సంరక్షించిన బాధ్యత ఆలయంపై ఉంటుందని అన్నారు. ఆ క్రమంలో జరిగిన పరిణామాలపై రాద్ధాంతం, రాజకీయం చేయడం శోచనీయమని మంత్రి పేర్కొన్నారు.



## మరో రెండు కోడెలు మృతి

**ప్రజాపక్షం/ వేములవాడ:** తిప్పాపూర్ లోనీ గోశాలలో అనారోగ్యం తో ఉన్న కోడెలలో శుక్రవారం మరో రెండు కోడెలు మృతి చెందినట్లు మిగిలిన వాటికి వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.గోశాలలో ఉన్న 1300 పశువు లలో ప్రస్తుతం మొత్తం 11 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు, వైద్యానికి కోడేలు స్పందిస్తు, అనారోగ్యం నుండి కోలుకుంటున్నట్లు, మరో 3 కోడేలు ఆరోగ్య పరిస్థితి క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నట్లు, కొత్తగా ఏవీ కూడా అనారోగ్యమునకు గురికాలేదని తెలిపారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి పేర్కొన్నారు.

# నాలా ఆక్రమణలపై హైడ్రా కొరడా

రసూల్‌పుర, బేగంపేట ప్యాట్నీ నాలా ఆక్రమణల తొలగింపు

కంటోన్మెంట్, జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, నీటిపారుదలశాఖల యంత్రాంగంతో కలిసి కూల్చివేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షా కాలానికి ముందు నగరంలోని నాలా పరివాహక ప్రాంతాలపై దృష్టి సారించిన హైడ్రా ఫిర్యాదులు రాగానే ఆక్రమణలను గుర్తించి తొలగిస్తుంది. అందులో భాగంగా సికింద్రాబాద్‌లోని బేగంపేట ప్యాట్నీ నాలా పరివాహక ప్రాంతంలోని అక్రమ నిర్మాణాలు, నాలా ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నాలాపై ఉన్న వాణిజ్య భవనాలను గుర్తించిన హైడ్రా అధికారులు శుక్రవారం తెల్లవారు జాము నుంచి కూల్చివేతలు చేపట్టారు. నాలాను ఆనుకొని ఉన్న భవనాలను కూల్చి వేశారు. ప్యాట్నీ నాలా విస్తీర్ణం కుచించుకుపోవడంతో వర్షం వస్తే భారీగా వరద నీరు కాలనీలోని ఇళ్లల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పైగా కాలనీ, ప్యాట్నీ కాంపౌండ్, ప్యాట్నీ కాలనీ, విమాన్ నగర్, బిహెచ్‌ఈఎల్ కాలనీ, ఇందిరమ్మనగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు బేగంపేట ప్యాట్నీ నాలాను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, కంటోన్మెంట్ సిఈఓ మధుకర్ నాయక్, జిహెచ్‌ఎంసి, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వాస్తవానికి 70 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలా ఆక్రమణల కారణంగా 15 నుంచి 18 అడుగుల వెడల్పుకు పరిమితం అయినట్లు అధికారులు గుర్తించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను బుల్డోజర్ల సహాయంతో నేలమట్టం చేశారు. కోర్టు కేసుల పేరుతో కాలయాపన లేకుండా హైడ్రా చర్యలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత 20 నుంచి 30 ఏళ్లుగా కాలనీ, బస్తీలు వరద ముంపునకు గురవుతున్నాయని స్థానిక కాలనీ, బస్తీల ప్రజలు తెలిపారు. నాలా అక్రమణల తొలగింపుతో దాదాపు 30 వేల కుటుంబాలకు ఊరటనిస్తుందన్నారు. హస్మత్‌పేట చెరువు మిగులు జలాలతో నాలా, మహేంద్ర హిల్స్‌పై భాగం నుంచి వరద నీటిని తెచ్చే పికెట్ నాలా 23 కిలోమీటర్ల మేర ప్రయాణించి, ప్యాట్నీ పరిసరాల్లో కలిసిన చోట 15 నుంచి 18 అడుగులకు పరిమితం అయిందని చెప్పారు. 150 మీటర్ల మేర కబ్జాకు గురైన ప్రాంతంలో ఉన్న 6 నిర్మాణాలను హైడ్రా తొలగించింది. నాలా విస్తరణ పనులతో పాటు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు కూడా వెంటనే చేపడుతామని హైడ్రా అధికారులు తెలిపారు. ఈ పనులను 15 పూర్తి చేస్తామని కంటోన్మెంట్ అధికారులు చెప్పారు.

## ఈటల రాజేందర్ స్టేట్‌మెంట్‌ను కిషన్‌రెడ్డి సమర్థిస్తున్నారా?

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణ జరుపుతున్న కమిషన్ ముందు రాష్ట్ర మాజీ మంత్రి, బిజెపి ఎంపి ఈటల రాజేందర్ మాజీ సిఎం కెసిఆర్‌కు క్లీన్ చిట్ ఇచ్చారని, కమిషన్ ముందు ఈటల రాజేందర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? సమాధానం చెప్పాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి) ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళుగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా కాళేశ్వరం ప్రాజెక్టు బిఆర్‌ఎస్‌కు ఎటిఎంగా మారిందని విమర్శించారని, దానికి కట్టుబడి ఉన్నారా? లేదా? ప్రధాని మోదీకి తెలిసే కెసిఆర్‌కు ఆటల క్లీన్ చిట్ ఇచ్చారా అనే విషయాలపై కిషన్‌రెడ్డి స్పష్టతనివ్వాలన్నారు. ఈటల రాజేందర్ ప్రస్తుతం బిజెపి ఎంపిగా ఉన్నారా, బిఆర్‌ఎస్ పార్టీ లీడరా? అని ప్రశ్నించారు.

గతంలో టిపిసిసి అధ్యక్షులుగా ఉన్న రేవంత్‌రెడ్డి సిఎం అయిన అనంతరం కూడా కాళేశ్వరంపై ఒకటే విధానంతో ఉన్నారని, అందుకే కమిషన్ విచారణ ఏర్పాటు చేశారని, దీనిపై కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని జగ్గారెడ్డి చెప్పారు. త్వరలోనే కాళేశ్వరం ప్రాజెక్టులోని అక్రమాల గుట్టు విప్పుతానని అన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో అవినీతి బయటపడితే అది మెడకు చుట్టుకుంటుందని కెసిఆర్‌తో, బిఆర్‌ఎస్ నేతలతో ఈటల రాజేందర్ సిండికేట్ అయ్యారా, ఈ విషయంలో కూడా కిషన్‌రెడ్డికి చెప్పి కమిట్ అయ్యారేమోనని, బిజెపి ఢిల్లీ డైరెక్షన్‌లోనే కెసిఆర్‌కు ఈటల రాజేందర్ క్లీన్ చిట్ ఇచ్చారా అనే అనుమానం కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏం చెప్పదలుచుకుందని, కాళేశ్వరం లో అవినీతి జరగలేదా? ఈటల రాజేందర్ మాటలు తప్పు అని అంటారా, లేదంటే అదేబిజెపి విధానం అంటారా అని ఆయన నిలదీశారు. కిషన్ రెడ్డి స్పందించకపోతే బిజెపి విధానం, కమిషన్ ముందు ఈటల రాజేందర్ స్టేట్‌మెంట్ ఒకటే అని ఫిక్స్ అనే కాంగ్రెస్ ప్రశ్నలు వారిని వెంటాడుతూనే ఉంటాయన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలు అరెస్టు

వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రెండు వేర్వేరు సంఘటనల్లో అమాయక వ్యవసాయదారులను లక్ష్యం గా చేసుకోని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఏడుగురిని ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, పరకాల, గీసుగొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు.ఈ రెండు ముఠాల నుండి పోలీసులు సుమారు 63లక్షల 62వేల రూపాయల విలువ గల నకిలీ, కాలం తీరిన పురుగు మందులు, 166 కిలోల నకిలీ విత్తనాలు, 8వందల లీటర్ల గడ్డి మందుతో పాటు, నకిలీ పురుగు మందుల తయారీకి అవసమయిన సామగ్రితో పాటు ఏడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మేడ్చ ల్ మల్కాజిగిరికి చెందిన జయదీప్ గౌతమ్, మోహిదీపట్నం హైదరాబాద్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, నాగారం గ్రామం పరకాల మండలానికి చెందిన మాచబోయిన తిరుపతి,పాపయ్యపల్లి చెల్పూర్ గ్రామం ము లుగు ఘన్‌పూర్‌కు చెందిన అన్నం కుమారస్వామి, ఎలు కుర్తి హవేలీ,గీసుగొండ మండలానికి చెందిన బెరి రెడ్డి మర్రి రెడ్డి, సంగారెడ్డి జిల్లాకు చెందిన తుమ్మగుండ్ల సందీప్ రెడ్డి, సంగారెడ్డి జిల్లాకు చెందిన తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్ ఉన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ..పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పరకాల పోలీసులు,వ్యవసాధికారులు సం యుక్తంగా కలిసి ప్రధాన నిందితుడు నా గారం చెందిన మాచబోయిన తిరుపతి ఇంటిపై పోలీసులు దాడి చేసి నకిలీ, కాలం తీరిన పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీసులు విచారించగా నిందితుడు ఇచ్చిన సమచారంతో పోలీసులు హైదరాబాద్‌లో మోహిదీపట్నం ప్రాంతంలో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గొదాంపై దాడి చేసి పోలీసులు సుమారు 57లక్షల 44వేల రూపాయల నకిలీ, కాలం తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకోవడంతో పాటు జయదీప్ గౌతం, ఆదిత్య,కుమారస్వామిలను పోలీసులు అరెస్టు చేసారు. ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్,వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# హైటెక్స్‌లో 'జాతీయ పేపర్ ఎక్స్‌పో' షురూ

**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి :** పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ పేపర్ ఎక్స్‌పో పేప్‌ఎక్స్‌పో2025ను హైటెక్స్‌లో శుక్రవారం ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి పరుచూరి నరేంద్ర ప్రారంభించారు. భారత్‌లో జాతీయ పేపర్ ఎక్స్‌పో నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ ఎక్స్‌పోకు ఎంఎస్‌ఎంఈ సహకారం ఉంది. ఈ ఎక్స్‌పో 8వ తేదీ వరకు ఉంటుంది. ఈ సందర్భంగా పాపిరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పి సిఇఒ నిర్మల్ కుహాద్ మాట్లాడుతూ.. తాము స్థాపించిన పేపర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గర్వంగా నిర్వహిస్తున్నామన్నారు. పేపర్ వినియోగం ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఫౌండేషన్ స్థాపించామని చెప్పారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటన్నారు. వ్యక్తిగత పేపర్ వినియోగం అతి తక్కువ స్థాయిలో ఉందన్నారు. పేపర్ వినియోగం వనరుల నాశనానికి (అటవీ నష్టం) దోహదం చేస్తుందన్న అపోహను తొలగించడమే ఈ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశాలలో ఒకటన్నారు. భారతదేశంలో తయారవుతున్న, వినియోగిస్తున్న పేపర్‌లో సుమారు 80 శాతం రీసైకిల్ చేయబడిన వనరుల నుంచే వస్తుందన్నారు. అందువల్ల ఇది దేశంలోనే అత్యంత పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచిందని చెప్పారు. ఈ వేదిక ద్వారా పర్యావరణ మార్పులను తెలియజేస్తూ అభివృద్ధిలో పేపర్ పాత్రను ప్రపంచానికి చూపించాలన్నదే మా ఆశయం అన్నారు. ఈ సందర్భంగా ఎమామి పేపర్ మిల్స్ సిఎంఒ సౌమ్యాజిత్ ముఖర్జీ మాట్లాడుతూ ఇది సాధారణంగా జరిగే ఎక్స్‌పో కాదన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి. వీరు పేపర్ ఉత్పత్తి, మార్పిడి, ముద్రణ, ప్యాకేజింగ్, రీసైక్లింగ్ రంగాల్లో తమ అత్యాధునిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు. ప్రస్తుతానికి భారతదేశంలో పేపర్ వ్యక్తిగత వినియోగం కేవలం 15 నుంచి 16 కిలోలే ఉంది. ఇది ప్రపంచ సగటు 57 కిలోల కంటే ఎంతో తక్కువ.




పేపర్ వినియోగం పర్యావరణానికి హానికరమని ఉన్న అపోహలను తొలగించడమే ఈ ఫౌండేషన్ లక్ష్యం.

## షాబాద్‌లో ఘనంగా బొడ్రాయి పండుగ వేడుకలు

**ప్రజాపక్షం/షాబాద్ :** గ్రామ ప్రజల సంతోషంగా ఉండాలని గ్రామ పెద్దలందరూ ఎంతో ఉత్సవంగా శుక్రవారం బొడ్రాయి పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో బొడ్రాయి దగ్గరకు వచ్చి నవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ భువనేశ్వరి రవీందర్ మాట్లాడుతూ.. బొడ్రాయి వేడుకలతో గ్రామస్తులలో ఐక్యత భావం పెరుగుతుందన్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు నేటి తరం తెలుసుకునేందుకు ఇలాంటి వేడుకలు దోహదం చేస్తాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, జడల రాజేందర్ గౌడ్, గౌరీశ్వర్, మాజీ ఎంపిటిసి అశోక్, రమేష్ యాదవ్, సత్యం, శ్రీను తదితరులు ఉన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



**ప్రజాపక్షం/యాచారం :** రైతుల సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దారు అయ్యప్ప అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతపట్ల, మల్కిజ్‌గూడ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూసమస్యలకు సంబదించి రైతుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. ఎలాంటి సమస్యలున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వాటిని పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. రైతులందరు సహకరించాలన్నారు. వివిధ పార్టీలకు చేందిన నాయకులు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు.

## త్యాగానికి చిహ్నం 'బక్రీద్'

నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన

మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈద్ అల్ అధా త్యాగం, నిస్వార్థ సేవ, సోదర భావాన్ని చాటిచెప్పే పండుగ బక్రీద్ అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. బక్రీద్ (ఈద్ అల్అధా) పండుగ సందర్భంగా మేయర్ నగర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలందరి మధ్య శాంతి, సామరస్యం, ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ మనకు త్యాగం యొక్క గొప్పతనంతో పాటు నిరుపేద ప్రజల పట్ల దయను గుర్తు చేస్తుందన్నారు. ఈ పండుగ సందర్భంగా, మనం ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, సమాజంలో ప్రేమను, ఆనందాన్ని పంచుకుందామని వారు తమ సందేశంలో పేర్కొన్నారు. నగరంలోని ముస్లిం సోదర సోదరీమణులు బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఈ పండుగ వారి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. అలాగే, పండుగ సందర్భంగా, సామరస్యపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

## పారిశ్రామికంగా ఒబిసిల అభివృద్ధికి బిఆర్ఎస్ అడ్డంకి

సౌత్ ఇండియా ఒబిసి సంక్షేమ సంఘం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పారిశ్రామికంగా ఒబిసిల అభివృద్ధిని అడ్డుకొనేందుకు బిఆర్ఎస్ యత్నిస్తున్నదని సౌతిండియా ఒబిసి సంక్షేమ సంఘం ఆరోపించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వమే ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చి, ఇప్పుడు రైతుల ముసుగులో ఆ కంపెనీ ఏర్పాటును ఆ పార్టీ నేతలు అడ్డుకొంటున్నారని పేర్కొన్నది. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సౌత్ ఇండియా ఒబిసి సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి చిరుతల విఠల్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ చర్యలు ఒబిసి వర్గ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నంగా తాము చూస్తున్నామని తెలిపారు. ఒబిసి వర్గాలు తమ కష్టంతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్న తరుణంలో వారి ఎదుగుదలను అడ్డుకునేలా రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేలాది మంది యువతకు ఉద్యోగాలు దక్కే అవకాశాలను నిర్దాక్షిణ్యంగా బిఆర్ఎస్ పార్టీ దెబ్బతీస్తుందని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఇథనాల్ ఫ్యాక్టరీని పూర్తికి సహకారం అందించడంతోపాటు ఒబిసి వర్గాల ఎదుగుదల అడ్డంకులను తొలగించేందుకు నిరంతరం పోరాడుతామని విఠల్ గౌడ్ తెలిపారు. సమావేశంలో సంఘం నేతలు కె.కొండమయ్య, వంశీ, లింగమూర్తి, జి.అనిల్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


## క్రీడలు సమగ్ర వికాసానికి దోహద పడుతాయి

ఖైరతాబాద్ జోనల్ వేసవి క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమంలో

జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ యాదగిరిరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో ఆద్యంతం ఉత్సాహంగా సాగిన వేసవి క్రిడల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఖైరతాబాద్ జోన్‌లో విక్టరీ ప్లే గ్రౌండ్‌లో కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ ముగింపు కార్యక్రమంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్(స్పోర్ట్స్) డాక్టర్ యాదగిరి రావు, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ హాజరయ్యారు. చిన్నారుల ప్రతిభను వారు ప్రశంసించారు. ఈ వేసవి శిబిరాలు పిల్లల సమగ్ర వికాసానికి ఎంతగానో దోహద పడతాయని, కేవలం విద్యాభ్యాసం మాత్రమే కాకుండా, ఇలాంటి శిబిరాల ద్వారా పిల్లలు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవచ్చు అని వారు అన్నారు. సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చు, సామాజికంగా ఇతరులతో స్నేహపూర్వకంగా మెలిసిఉండటంతో పిల్లల్లో క్రిడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు. ఈ శిబిరంలో పిల్లలు నేర్చుకున్న కొత్త విషయాలను, అలవర్చుకున్న నైపుణ్యాలను జీవితాంతం గుర్తుంచుకోవాలన్నారు. శిబిరంలో క్రిడలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. వారిలో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఈ శిబిరం ఒక చక్కటి వేదికగా నిలిచిందని యాదగిరి రావు, సురేఖ అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా, శిబిరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. నగరంలో 6 నుండి 16 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు 43 రోజుల పాటు 457 క్రిడా మైదానాలు పోటీలు నిర్వహించగా, 53 వేల మంది పాల్గొన్నారని తెలిపారు. వేసవి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కార్పొరేటర్ డాక్టర్ సురేఖఅభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ముగింపు కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ వాణిశ్రీ, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి, ఏ.డి స్పోర్ట్ రహేనా బేగం పాల్గొన్నారు.



# నేడు బక్రీద్ పండగ

## ప్రార్థనా మందిరాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించిన సిపి సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బలిదానానికి ప్రతీక, భక్తి భావానికి ప్రతిరూపం ముస్లిం సోదరుల అనుబంధాన్ని, మానవతా విలువలను ప్రతిబింబించే పవిత్ర పర్వదినం బక్రీద్. ఈ రోజు ప్రతి ముస్లింకీ మస్తిష్కంలో అల్లాహ్ భక్తి నిండిన రోజు, ప్రతి హృదయంలో ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు వెల్లివిరిచే పండుగ. శనివారం జరిగే బక్రీద్ పండగకు ప్రార్థనా మందిరాలు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రార్థనలు నిర్వహించే మందిరాలు, ఈద్గా మైదానాల వద్ద ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసింది. దీంతో పాటు పోలీసులు ప్రత్యేక బందోబస్తు, పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. ప్రార్థనలు జరిగే మైదానాల వద్ద మెటల్ డిటేక్టర్ ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేశారు. ప్రార్థనలు జరిగే అన్ని ప్రదేశాలలో ఇప్పటికే బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. పార్కింగ్ ప్రదేశాలలో కూడా వీరు బాంబు తనఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా బక్రీద్ బందోబస్తులో సుమారు 25 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రదేశాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు ర్యాపిడ్ యాక్షన్ టీంలను రంగంలోకి దించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, గౌలిపుర, చంద్రాయణగుట్ట, ఛాదర్‌ఘాట్, చంచల్‌గూడ, డబీర్ పురా, తలాబ్‌కట్ట, సైదాబాద్, సంతోష్‌నగర్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు చెక్‌పోస్టులు






ఏర్పాటు చేశారు. బందోబస్తుపై డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజిపి మహేష్ భగవత్‌లు సమీక్షించారు. జిల్లాల ఎస్‌పిలు, కమిషనరేట్ల కమిషనర్లతో వారు మాట్లాడారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**బక్రీద్ – భక్తి, బలిదానం, బంధుత్వానికి పండుగ..**

బక్రీద్ లేదా ఈద్ అల్ అజ్హా అనే ముస్లిం పర్వదినం ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే మహత్తరమైన పండుగ. ఇది 'బలిదాన పండుగ' అని కూడా పిలవబడుతుంది. ఖుర్‌ఆన్ లో పేర్కొన్న కథ ప్రకారం, ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన కుమారుడిని అల్లాహ్ కోసమే బలిగొట్టేందుకు సిద్ధమయ్యారు. అల్లాహ్ ఆయన భక్తిని పరీక్షించి, చివరికి ఓ మేకను బలి చేసేందుకు అవకాశం కల్పించాడు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ముస్లింలు బక్రీద్ రోజున గొర్రెలు, మేకలు, ఎద్దులు వంటి జంతువులను బలి ఇస్తారు. ఈ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒకభాగాన్ని కుటుంబం కోసం, రెండవ భాగాన్ని బంధుమిత్రులకు, మూడవ భాగాన్ని పేదలకు పంచడం సంప్రదాయం. బక్రీద్ పండుగ ద్వారా సామాజిక సమానత్వం, పరస్పర సహాయసహకారం, దయ, క్షమాశీలత వంటి మానవీయ విలువలను ముస్లింలు వ్యక్తీకరించుకుంటారు.

### ప్రశాంతంగా జరిగేలా చూడాలి

బక్రీద్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పాతబస్తీని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి సౌత్‌జోన్ డిసిపి స్నేహమేరా, సౌత్‌ఈస్ట్‌జోన్ డిసిపి ఎస్ చైతన్య కుమార్, సౌత్ వెస్ట్‌జోన్ డిసిపి చంద్రమోహన్, ట్రాఫిక్ డిసిపి ఆర్ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ్మా



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విధ్యను అందిస్తున్నామని యాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయులు కె.నర్సింహ్మా అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాటపై గ్రామ సభ జరిగింది. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తున్నామని తెలిపారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పేద విధ్యార్థుల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, మధ్యాహ్న బోజనం, విశాలమైన క్రీడా మైదానాలు, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో శుక్రవారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన మహావీరుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి, గండిపేట కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ యాదవ్, విజయ్‌బాబు, మాజీ కౌన్సిలర్లు శివారెడ్డి ,దుర్గేష్, ఉషారాణి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు

సిపిఐ ఖైరతాబాద్ కార్యదర్శి మామిడిచెట్ల వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సిపిఐ ఖైరతాబాద్ నియోజకవర్గం కార్యదర్శి మామిడి చెట్ల వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీ హిల్స్‌లోని గురు బ్రహ్మ నగర్ రోడ్ నెంబర్ 69లో బస్తీలో పేదలకు ఇందిరామ్మ పథకం ద్వారా ఇళ్లను నిర్మించాలని కోరుతూ శుక్రవారం షేక్‌పేట్ తహసిల్దార్‌కు మామిడి చెట్ల వెంకటస్వామని నేతృత్వంలోని ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. అనంతరం మామిడిచెట్ల వెంకటస్వామి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరామ్మ ఇళ్లను నిర్మించి, ఇస్తామని చెప్పుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గురు బ్రహ్మ నగర్ బస్తీ వాసులపై కణికరించి, జి ప్లస్ త్రి అంతస్తులలో డబుల్‌బెడ్‌రూమ్ నిర్మించాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు బస్తీలో నివాసం ఉంటున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. ఈ బస్తీ వాసులకు అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాత ఈ గుడిసెల స్థలంలో ఇళ్లను నిర్మించాలని కోరారు. ప్రత్యామ్నాయం చూపించకుండా, ఇళ్లను ఖాళీ చేయమంటే ఎలా ? అని ప్రశ్నించారు. స్థలాలు ఖాళీ చేయమంటే ఎక్కడికి పోవాలన్నారు. గత ప్రభుత్వాలు ఇదే మాటలు చెప్పుతూ కాలయాపన చేశాయన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇళ్లను నిర్మించలేని పరిస్థితిలో ఉంటే, బస్తీలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఒక్కొక్కరికి 20 గజాల చొప్పున అయినా, చిన్న రోడ్ సౌకర్యం, డ్రైనేజీలతో కూడిన ఇళ్లను నిర్మించుకునేందుకు బస్తీ వాసులకే అనుమతి ఇవ్వాలన్నారు. ఈ బస్తీలో కనీసం రేకులతోనైనా గుడిసెలు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గురు బ్రహ్మ నగర్ శాఖ కార్యదర్శి ఎన్. నరసింహ, నవీన్, చిన్న, భీమేష్, మిద్ద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీనివాసులగూడలో శ్రీఅంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, నవీన్, శేఖర్‌రెడ్డి, జంగయ్య, నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

## పాఠశాలలు ప్రారంభించే నాటికే

# అందుబాటులో పుస్తకాలు



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పాఠశాలలు పునర్ ప్రారంభించే నాటికి పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి,డిఆర్‌డిఎ పిడి,మెప్మా పిడి ఇతర సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు 12వ తేదీ నాటికి అన్ని సంక్షేమ హాస్టల్స్‌లో పాఠశాలలో, గురుకులాలలో పంపిణీ చేయాలని, లేని యెడల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్స్ వార్డెన్ లు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బంది ఉంటే ఆయా శాఖల సంక్షేమ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరాలుకు తగ్గట్టుగా ఈ రెండు రోజుల్లో తెప్పించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సకాలంలో పిల్లలందరికీ యూనిఫాంలు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయాలని సంబంధిత అధికారులను శాఖల వారీగా సమీక్షిస్తూ చెప్పారు. ఈ విషయంలో జిల్లా విద్యాధికారి ప్రత్యేక చొరవ చూపాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించాలని, ఆవరణలలో పరిశుభ్రత, పచ్చదనం ఉండాలని, తాగునీటి వసతి వంటి సదుపాయాలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు.

### భూసమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

**షాద్‌నగర్ :** భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తూర్ మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును పరిశీలించారు. అనంతరం రైతుల దగ్గర నుండి పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ జంగయ్య రైతులు ఉన్నారు.

# వృద్ధ దంపతుల హత్య

మసాజ్ కోసం వచ్చిన వారే హత్య చేసి ఉంటారు...!?

రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్



**ప్రజాపక్షం/గండిపేట :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జన చైతన్య ఫేస్ 2 వెంచర్‌లో నివాసం ఉండే వృద్ధ దంపతులను గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి అతి దారుణంగా కత్తులతో పొడిచి చంపిన ఘటన శుక్రవారం కలకలం సృష్టించింది. ఘటనకు సంబంధించి రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌గూడాలోని జనచైతన్య ఫేస్2లో భార్యాభర్తలు షేక్ అబ్దుల్లా (70) రిజ్వానా బేగం(65) నివాసముంటున్నారు. భర్త బ్యాంకు ఎంప్లాయ్‌గా చేసి పదవీ విరమణ పొందారు. భార్య సైతం ప్రైవేట్ కాలేజీలో హెచ్ఒడిగా రిటైర్డ్ అయ్యారు. భార్యాభర్తలు ఇద్దరు జన చైతన్య ఫేస్ 2 లోకి వచ్చి 40 రోజులు అవుతుంది. ఈ బిల్డింగ్‌ను వీరే సొంతంగా నిర్మించుకొని కొన్ని పోర్షన్‌లు అద్దెకు ఇచ్చి, డూప్లెక్స్‌గా నిర్మించుకున్న ఇంట్లో నివాసం ఉంటున్నట్లు తమ విచారణలో తెలిసినట్లు డిసిపి శ్రీనివాస్ తెలిపారు. గురువారం సాయంత్రం సమయంలో అపార్ట్‌మెంట్ దగ్గర ఉన్న వాచ్‌మెన్ వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అందులో ఒకరు బుర్కా వేసుకోగా.. మరొకరు టోపీ, మాస్క్ పెట్టుకుని ఉన్నట్టు వాచ్‌మన్ తెలిపారు. మమ్మల్ని మసాజ్ గురించి బుక్ చేసుకున్నారని చెప్పడంతో వాచ్‌మెన్ యజమానికి ఫోన్ చేయగా పంపించమని చెప్పడంతో వారిని పైకి అనుమతించినట్లు తెలిపారు. పైకి వెళ్లిన వారిలో ఒకరు వెంటనే రాగా, బుర్కా ధరించిన మరొక వ్యక్తి 40 నిమిషాల తర్వాత కిందికి వచ్చినట్లు వాచ్‌మెన్ చెప్పాడని డిసిపి శ్రీనివాసులు వివరించారు. దీంతో వారిని ఆ ఇద్దరే హత్య చేసినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. హత్యకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. మృతులకు నలుగురు పిల్లలు ఉండగా వారిలో ఇద్దరు అమెరికాలో, మరో ఇద్దరు లండన్‌లో ఉండడం వల్ల ఎలాంటి సమాచారం ఇంకా లభించలేదన్నారు. వారి ఫోన్ కాంటాక్ట్ చేస్తున్నామన్నారు. హత్య జరిగిన ఇంట్లో మొత్తం వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయని, ఈ హత్యకు ఏదైనా భూ వివాదానికి సంబంధించిన ఘటనలు ఉన్నాయా అనే కోణంలో సైతం విచారణ చేస్తుమన్నారు. మృతుల పిల్లలు చెబితే కానీ వివరాలు చెప్పలేమని డిసిపి శ్రీనివాస్ చెప్పారు. హత్యలు గురువారం సాయంత్రం జరిగి ఉంటాయని, రక్తం గడ్డ కట్టిన తీరును చూస్తుంటే హత్య జరిగి 12 గంటలు గడిచినట్లు విచారణలో రూడి అయిందన్నారు. కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆధారాలు ఉన్నాయని, పూర్తి వివరాలు పోలీసులు క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్‌తోపాటు సిసి పూటేజీ, పోస్టు మార్టం రిపోర్టు ఆధారంగా తేలనుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని డిసిపి శ్రీనివాస్ తెలిపారు.

## నిధులు కేటాయించాలని జెడ్‌సికి వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్ కేశవ్ పాటిల్‌ను ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం జెడ్‌సిని మర్యాదపూర్వకంగా కలసి చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు కేటాయించాలని,వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వివిధ కాలనీలలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.సానుకూలంగా స్పందించిన జెడ్‌సి త్వరలో నిధులు కేటాయించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి టర్మినల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చర్లపల్లి :** రైల్వే టర్మినల్ మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను బండారి లక్ష్మారెడ్డి సందర్శించి టర్మినల్ పరిసరా ప్రాంతాలు, రోడ్లు, పార్కింగ్, వ్యాపార సముదాయాలను పరిశీలించారు. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగిరిపోయిన పాల్‌సిలింగ్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపారస్థులు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

**ప్రజాపక్షం/కొడంగల్ :** కొడంగల్ పట్టణంలోని ప్రతి వ్యాపారస్థులు మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల యాజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరి షాప్స్, స్వీట్ షాపులు, ఫర్టీలైజర్ దుకాణాలు ఇలా ప్రతి ఒక్క షాపు యాజమానులు మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా షాపుల ముందు పరిశుభ్రత పాటించాలని తడిచెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాని వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని అందులో భాగంగానే కొడంగల్‌ను గ్రీన్ కొడంగల్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని అందుకు పట్టణ ప్రజలు కూడా సహాయం చేయాలని కోరారు. వీరితో పాటు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ భరత్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది :ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తాండూరు :** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో హిందూ సంఘటన ఆధ్వర్యాన రూపొందించిన మట్టి గణపతి... మహాగణపతి పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం కేవిఎం వెంటకట్ ఆధ్వర్యాన మొలక బాలల్ మాస పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఎంఎల్‌ఎ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించాలని సూచించారు. అనంతరం పెద్దేముల్ మండల మంసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి నిఖిత జాతీయ స్థాయిలో బాక్సింగ్ విభాగంలో రాణించడంతో ఆ విద్యార్థిని ఎంఎల్‌ఎ శాలువతో ఘనంగా సన్మానించి శుభాకంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ రవి గౌడ్,తాండూరు మార్కట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, పట్లోళ నర్సిములు, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, బిసి సంఘం జాతీయ నాయకులు రాజ్‌కుమార్ తదతరులు పాల్గోన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా భూభారతిపై రెవెన్యూ సదస్సులో భూభారతి చట్టం ద్వారా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని పుల్సుమామిడి ,రళ్ళచిటేంపల్లి , పిలారంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నయి. ఇందులో ముఖ్యంగా పిఓబి, మిస్సింగ్, సాదాబైనామా, భూవిస్తర్ణంలో మార్పులు ,చేర్పులు ,పాసు పుస్తకాల అందజేత తదితర అంశాలపై పిర్యాదుల స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి అర్జీని రిజిస్టర్‌లో నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టానికి లోబడి భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.మిగిలిన రెవెన్యూ గ్రామంలోని సమస్యలు ఉన్నా రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ అనిత, సీనియర్ అధికారి సురేష్, ఆర్‌ఐ సంజయ్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## కుల్కచర్లలో బడిబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/కుల్కచర్ల :** పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండలంలోని అన్ని పాఠశాలలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో కల్పించే సౌకర్యాలపై గ్రామంలో తల్లిదండ్రులకు , యువజన నాయకులకు వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తాకలు, యునిఫామ్ అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతం అని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకరం విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి అందరి సహకారం అవసరం అని వివరించారు. చెల్లపూర్ ప్రాథమిక పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అనంద్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు అమృతయ్యగౌడ్, నీలయ్య, రాములు ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులతో కలిసి అంబేద్కర్ ముందు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తు విద్యార్థుల సంఖ్యను పెంచుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాల్పుల విరమణ ప్రకటించాలి

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి:అఖిలపక్ష పార్టీల డిమాండ్

14న ఇందిరాపార్కులో మహా ధర్నా తీర్మానం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం మావోల ఏరివేత పేరిట కొనసాగిస్తున్న కాల్పుల విరమణ ప్రకటించి వారు కోరుతున్న మేరకు శాంతి చర్చలు జరపాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. శుక్రవారం ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్ అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసి రాష్ట్ర నాయకురాలు అనురాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యం, రవి, శంకర్,ఐఎఫ్‌టియు శివబాబు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్‌కుమార్, పిఓడబ్ల్యు(విముక్తి) పెర్క సునీత, ఇఫ్టూ షేక్ షావలి,బిఎల్‌ఎఫ్ విఎన్‌ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామెర్ల ఐలయ్య,తదితర సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి మావోలతో చర్చలు జరపాలని ముక్త కంఠంతోడిమాండ్ చేసారు. గత 17 మాసాలుగా జరిగిన కగార్ పేరిట జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో 550 మందిని పొట్టన పెట్టుకొన్నారని తెలిపారు. శత్రు దేశాలపై చేసిన దాడులు చేస్తున్న తరహాలో యుద్ధ మందుగుండు సామగ్రి, డ్రోన్లు, యుద్ధ ట్యాంకర్లు, హెలికాప్టర్లతో ప్రజా సమస్యలపై గళమెత్తి తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ పోరాడుతున్న మన దేశ వాసులపై వేల సంఖ్యలో భద్రతా దళాలు దాడులకు పాల్పడుతూ ఎన్‌కౌంటర్ల పేరిట నిర్దాక్షిణ్యంగా హతమారుస్తున్నారన్నారు. ఈ తరహా దాడులను తీవ్రంగా ఖండించారు. మావోలతో చర్చలు జరిపేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దీనిలోని భాగంగా ఈ నెల 14న ఇందిరా పార్కులో మహా ధర్నా చేపట్టాలని ఈ సమావేశంలో తీర్మానించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి, శంకర్రావు, తోటపల్లి శంకర్, గద్దర్ అభిమాన సంఘాల అధ్యక్షులు యాదగిరి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి,సిపిఎం జిల్లా కార్మిక సభ్యులు కోమటి రవి, శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## 69 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ గణేశుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్ బడా గణేశ్ ఈసారి విశ్వశాంతి మహాశక్తి గణపతిగా దర్శనం ఇవ్వనున్నారు. 69 అడుగుల ఎత్తులో గణేశ్ ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం భూమి భూమి, కర్రపూజ చేశారు. బడా గణేశ్ రూపాన్ని ఉత్సవ సమితి సభ్యులు విడుదల చేశారు. స్వామి వారికి కుడి వైపు జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మి సమేత హయగ్రీవుడు, ఎడమ వైపున లలితా త్రిపుర సుందరి, గజ్జలమ్మ దేవి విగ్ర హాలను ప్రతిష్టంచనున్నారు. భూమి, కర్రపూజకు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి , ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ 71 సంవత్సరాల నుంచి ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడి గణేశునికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు.

# భూభారతి చట్టాన్ని వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి చట్టాన్ని అవసరం ఉన్న వారందరూ రెవెన్యూ సదస్సుల్లో అర్జీల ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మూడుచింతలపల్లి మండలంలోని జగన్‌గూడ, నర్సంపల్లి గ్రామాల్లో జరుగుతున్న సదస్సు తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని తెల్సుకొని వారి సందేహాలకు జవాబులిస్తూ అవగాహన కల్పించారు. సదస్సుల్లో వచ్చిన అర్జీల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని అధికారులను హెచ్చరించారు.నిర్ణీత ఫారాలలో ధరఖాస్తులు వచ్చేలా ప్రజలకు సరైన విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహా, ఎంఆర్‌ఓ నర్సింహారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. మరో పక్క జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి దుండిగల్ మండలంలోని మల్లంపేట గ్రామ రెవెన్యూ సదస్సును ఇతర రెవెన్యూ అధికారులతో కల్సి పరిశీలించారు.



## కూల్చివేయడం కాదు.. కేసులు పెట్టి జైలుకు పంపండి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం లోని సర్వే నెంబర్ 326,307లలో గత కొంతకాలంగా ఆగిన కబ్జాలు నిర్మాణాలు నేడు మళ్ళీ వారం రోజుల నుండి ఎలాంటి భయం లేకుండా పగలు కుడా నిర్మాణాలు జరుగుతున్నాయని,రెవెన్యూ అధికారులు పదుల సంఖ్యలో నెలకొన్న అక్రమంగా నిర్మాణాలలో ఒకటి అర నిర్మాణాలు కూల్చి చేతులు దులుపుకోవడం సరికాదని, వెంటనే కూల్చివేత్తలను తెలివిగా అడ్డుకుంటున్న వారిని అరెస్టు చేసి శిక్షించాలని నేడు మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ ఐ కరీముల్లా గారికి సిపిఐ నాయకత్వం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయ్యకపోతే స్వయంగా ప్రజలను కుడతీసుకొని గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావ్, నాయకులు నర్సింహా రెడ్డి, రవి, సుంకిరెడ్డి, సామెల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దరఖాస్తుదారులకు విధిగా రసీదులు ఇవ్వండి : జిల్లా అదనపు కలెక్టర్ లింగా నాయక్



**ప్రజాపక్షం/తాండూరు :** రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికే భూభారతిని తీసుకచ్చి గ్రామాల వారిగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని జిల్లా అదనపు కలెక్టర్ లింగానాయక్ అన్నారు. తాండూరు మండల పరిధి అల్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను స్వయంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని అన్లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రతగా వ్యవహరించాలని అధికారుకు సూచించారు. దరఖాస్తుదారులకు విధిగా రసీదులు అందించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ హెల్ప్‌డెస్కలను, రిజిష్టర్‌లను అధనపు కలెక్టర్ లింగానాయక్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారిగా అర్థీను విభజిస్తూ పక్కగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జూన్ 20వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరైన దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని సానుకూలంగా ఉన్న సమస్యను సాధ్యమైనంత వరకు అక్కడిక్కడే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తారాసింగ్ స్బంబది రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో సంచుల కొరత



తెలంగాణ రాష్ట రైతు సంఘం కోశాధికారి నరేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు(బార్దన్) అందుబాటులో లేకపోవడంతో రైతులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజుల నుంచి సంచుల కొరకు టోకెన్‌లు తీసుకున్న రైతులు కేంద్రానికి వెళ్లగా సరిపోను సంచులు లేవని అధికారులు చెప్పడంతో ఆగ్రహంతో రైతులు గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. 226 మంది రైతులకు టోకెన్‌లను ఇచ్చిన అధికారులు వారికి సంచులు అందజేయడంలో విఫలమయ్యారు. సుమారుగా 8 వేల సంచులు రైతులకు అవసరం ఉండగా కేవలం 2400 సంచులు ఉండటంతో ఎవరికి ఇవ్వాలో తెలియక అధికారులు సందిగ్ధంలో ఉన్నారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి నరేంద్రప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలన్నగారి రాజిరెడ్డిలు రైతులకు మద్దతుగా నిలిచారు. తక్షణమే రైతులకు సరిపోను సంచులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అధికారులు సంచులను రైతులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట రైతు సంఘం సభ్యులు ప్రభాకర్, బాలమణి, సాయిలుయాదవ్, బుచ్చిరెడ్డి, మాధవరెడ్డి, ఇంద్రారెడ్డి, రఘుపతి, హన్మంతు, రైతులు పాల్గొన్నారు.

# నాణ్యత లేకుంటే చర్యలు

కొడంగల్‌లో అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలో సాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. బొంరాస్‌పేట మండలలో ప్రభుత్వం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులు కచ్చితంగా నాణ్యతగా ఉండాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. మండల పరిధిలోని బురాన్‌పూర్ గురకుల పాఠశాల, ఎంపీయూపీఎస్ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులు, రోడ్ల నిర్మాణ పనులను కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సమక్షంలో పరిశీలించి వాటి నాణ్యతపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అదేవిధంగా బుర్రి తాండ నుంచి మెట్లకుంట మీదుగా బొంరాస్‌పేట వరకు బీటీ డబుల్‌రోడ్డు పనులను పరిశీలించారు. ధరూర్ మండలంలోని గురుదోట్ల వరకు బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాలలో జరిగే రోడ్లు, సీసీ రోడ్లు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వీరితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ శేరిరాజేష్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు నర్సిములు గౌడ్, భీమయ్యగౌడ్‌లతో పాటు ఆయా శాఖల అధికారులున్నారు.

## ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో శారీరక దృఢత్వం: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**ప్రజాపక్షం/దుండిగల్ :** 132 జీడిమెట్ల డివిజన్ మహా నగర్ ఎస్టేట్స్‌లో సుమారు రూ.11 లక్షలతో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్, పార్కును బిఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ఆటవిడుపుగా, పెద్దలకు శారీరక, మానసిక ప్రశాంతత చేకూర్చడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రా రెడ్డి, మహానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నార్లకంటి కుమార్, ఉపాధ్యక్షులు బి.రవీందర్, పి.సురేష్, ప్రధాన కార్యదర్శి డి. వెంకట్ రెడ్డి, కోశాధికారి ఎస్.ధర్మయ్య, సంయుక్త కార్యదర్శి కె.కవి రాజ్, ఈశ్వర్, సలహాదారులు శ్రీనివాస్, నర్సింగ్ రావు, గణేష్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, వినోద్, శ్రీనివాస్, వెంకటేష్, రాజశేఖర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీ గౌడ్, బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, యేసు, ఆటో బలరాం, నదీమ్‌రాయ్, కుంట వేణు, నారాయణ, కాలే గణేష్, శ్రీకాంత్, విజయ్ హరీష్, బాల మల్లేష్, అరుణా రెడ్డి, ఇందిరా రెడ్డి పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ

ఎఎంసి చైర్మన్ నర్సింహాయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేస్తున్నామని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. శుక్రవారం లాల్‌గడిమలక్‌పేట, కొల్తూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు ముగ్గుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం తరపును ప్రొసిడింగ్స్ ఇవ్వడమే కాకుండా ఇండ్ల పనులు మొదలు పెట్టిన వారికి బ్యాంకుల్లో నగదును విడతల వారిగా జమచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల పార్టీ అధ్యక్షుడు వై ఎస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, మాజి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడివొ గీతారెడ్డి, ఎంపివొ మంగతయారు. మాజి సర్పంచ్ నల్ల శిల్పాయాదగిరి, మాజి ఎంపిటిసిలు అఖిలేష్‌రెడ్డి, బొగ్గుల వెంకటేష్, నాయకులు తిరుపతిరెడ్డి, వీరేష, జైపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన ఊరు... మన బడి




బడిబాటలో మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు, విద్యార్థుల చదువు కొరకు తనవంతుగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలను, ఉచిత యూనిఫామ్స్ పంపిణీ చేస్తుందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఉచితంగా అందిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం అందచేసే అన్ని రకాల వసతులను ప్రతీ ఒక్కరికీ తెలియచెప్పడమే ఈ బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి మరియు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫోకస్

## చైనా తియాన్వెన్-2 మిషన్



గ్రహాంతర శిలా నమూనా సేకరణ కోసం గత నెలాఖరులో విజయవంతంగా ప్రయాణం ప్రారంభించిన తియాన్వేన్2 (Tianwen2) మిషన్‌ను చైనా అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వీకరించింది. ఈ మిషన్ రెండు ముఖ్యమైన ఖగోళ వస్తువులను గుర్తించి, వాటి నుంచి నమూనాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 469219 కామోఓలేవా (Kamo oalewa) అనేది వీటిలో మొదటిది. ఇది భూమి సమీపంలోని ఒక చిన్న గ్రహశకలం. అందుకే దీనిని 'క్వాసీమూన్'గా పిలుస్తారు. ఈ గ్రహశకలం భూమి చుట్టూ ప్రత్యేకమైన కక్ష్యలో తిరుగుతున్నది. చైనా శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం తియాన్వేన్2 ఈ గ్రహశకలాన్ని 2026 జులై 4న చేరుకోనుంది. ఈ సమయంలో, ఇది దాని ఉపరితలాన్ని పరిశీలించి, సుమారు 100 గ్రాముల శిలా నమూనాలను సేకరించనుంది. ఈ నమూనాలు 2027 నవంబర్ 29న భూమికి తిరిగి రానున్నాయి. కాగా, మరో గ్రహశకలం 311పి/పిఎఎన్ఎస్‌టిఎఆర్ఆర్ఎస్. ఈ గ్రహశకలాన్ని పరిశీలించిన తర్వాత, తియాన్వేన్2 ప్రధాన అంతరిక్ష నౌక భూమి యొక్క గురుత్వాకర్షణ సహాయంతో దిశ మార్చుకుని, ప్రధాన గ్రహశకలపు పట్టీలో ఉన్న 311పి/పిఎఎన్ఎస్‌టిఎఆర్ఆర్ఎస్‌ను అన్వేషిస్తుంది. దానిని 2035 జనవరి 24న చేరుకుంటుందని అంచనా. ఈ సమయంలో, ధూమకేతువు లక్షణాలను తియాన్వేన్2 అధ్యయనం చేస్తుంది. అంతకు ముందు చైనా తియాన్వెన్1 మిషన్‌ను అంగారక గ్రహానికి చేరే రీతిలో మొదలుపెట్టింది. ఇందులో ఆర్బిటర్, ల్యాండర్‌తోపాటు అంగారక గ్రహ ఉపరితలాన్ని అన్వేషించడానికి ఒక రోవర్ కూడా ఉంది. ఇప్పుడు తియాన్వేన్2 ప్రాజెక్టును చేపట్టింది. 2016లో కనుగొన్న కామో ఓలెవా అసాధారణ కక్ష్య, సంభావ్య చంద్ర మూలాన్ని పరిశోధించడమే ఈ మిషన్ లక్ష్యం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం కామో ఓలెవా అనేది కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి ఢీకొన్నప్పుడు, చంద్రుడి నుంచి విడిపోయిన భాగం కావచ్చు. భూమి యొక్క ఏడు తెలిసిన పాక్షిక ఉపగ్రహాలలో కామో ఓలెవా ఒకటి. క్వాసి ఉపగ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతాయిగానీ గ్రహానికి దగ్గరగా ఉండటం వల్ల, అవి గ్రహం ద్వారా గురుత్వాకర్షణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఈ కామో ఓలెవా వంటి పాక్షికఉపగ్రహాలు 100 నుంచి 300 సంవత్సరాలలో తమ కక్ష్యలను మారుస్తాయని అంచనా. మొత్తం మీద భూశకలాలపై లోతైన అధ్యయనం కోసం చైనా చేపట్టిన ప్రయోగం విజవంతమైతే, విశ్వం ఆవిర్భావం, వ్యాప్తి తదితర అంశాలపై ఎంతోకాలంగా ఉన్న అనేకానేక ప్రశ్నలకు సమాధానం లభించే అవకాశం ఉంది.

## ఉపగ్రహాలకు ఎఐ ఊతం

అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అంతరిక్ష పరిశోధన, ప్రయోగాల్లోనూ కీలక భూమిక పోషిస్తున్నది. ఇటీవల కాలంలో ఎఐ శక్తితో నడిచే స్వయం ప్రతిపత్తి (అటానమస్) ఉపగ్రహాల పెరుగుదల ఈ రంగంలో వస్తున్న గణనీయమైన మార్పులను బహిర్గతం చేస్తున్నది. ఎఐ కారణంగా ఇప్పుడు ఉపగ్రహాలు స్వతంత్రంగా ఆలోచించే నైపుణ్యాన్ని, వ్యవహరించే సామర్థ్యాన్ని పొందుతున్నాయి. చట్టపరమైన బాధ్యత, నైతికత, ప్రపంచ రాజకీయాలపై ప్రభావం వంటి అంశాలు ఇప్పుడు ఉపగ్రహాల్లో ఎఐ వాడకం నేపథ్యంలో తెరపైకి వచ్చాయి. ఎఐ అటానమస్ ఉపగ్రహాలు మానవ జోక్యం లేకుండా లేదా అతి తక్కువ జోక్యంతో పని చేస్తాయి. ఈ ఉపగ్రహాలు సొంతంగానే డేటాను విశ్లేషిస్తాయి. నిర్ణయాలు తీసుకుంటాయి. నిజ సమయంలో స్వతంత్రంగా వివిధ పనులను అమలు చేస్తాయి. ఇందుకోసం మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ టెక్నిక్‌లపై ఆధారపడిన అధునాతన అల్గారిథమ్‌లను ఉపయోగిస్తాయి. డేటా ప్రాసెసింగ్ ఆన్‌బోర్డ్ ఎఐ ఉపగ్రహాలను అంతరిక్షంలో డేటాను విశ్లేషించడానికి, అసంబద్ధమైన వివరాలను ఫిల్టర్ చేయడానికి, భూమికి కీలకమైన వివరాలను పంపడానికి వీలు కల్పిస్తుంది, బ్యాండ్‌విడ్త్‌ను ఆదా చేస్తుంది. ఆలస్యాన్ని తగ్గిస్తుంది. అంతరిక్ష ఆధారిత డేటా సెంటర్లు సౌరశక్తిని ఉపయోగించుకుని , నేరుగా అంతరిక్షంలోకి వేడిని విడుదల చేసి, శక్తి వినియోగాన్ని తగ్గిస్తాయి. ఈ విధానం భూసంబంధమైన డేటా సెంటర్లతో పోలిస్తే కార్బన్ ఉద్గారాలను నాటకీయంగా తగ్గించగలదు. నక్షత్రరాశులు లేదా సమూహాలలో, ఉపగ్రహాలు డేటాను పంచుకోగలవు. సమష్టిగా వివిధ అంశాలను నేర్చుకునే శక్తి ఈ ఎఐ ఉపగ్రహాలకు ఉంది. దీనిని 'హైవ్ లెర్నింగ్' అని పిలుస్తారు. ఇది నెట్‌వర్క్ అంతటా సహకార ప్రవర్తన, మెరుగైన పనితీరుకు తోడ్పడుతుంది. ఈ ఉపగ్రహాల్లోని ఆటోమేటెడ్ ఆపరేటింగ్ వ్యవస్థ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తుంది. లోపాలను గుర్తించి, సొంతగానే మరమ్మతులు చేస్తుంది. తుదుపరితరం ఎఐ ఉపగ్రహ సముదాయమైన జియోస్టేషనరీ ఈక్వటోరియల్ ఆర్బిట్ (జిఇఒ), లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఇఒ) అంతటా బహుళ దశల నిఘా వ్యవస్థను సృష్టిస్తుంది. అంతర్గత లోపాలను గుర్తించి, కక్ష్యలో పరిష్కారాలను సూచిస్తుంది. అంతరిక్ష ట్రాఫిక్, శిథిలాల పెరుగుదలతో, స్వయంప్రతిపత్త ఉపగ్రహాలు ఢీకొనే అవకాశాలను అంచనా వేయడానికి, భూ నియంత్రణ నుండి సూచనల కోసం వేచి ఉండకుండా తప్పించుకునే ప్రయత్నాలకు కూడా ఎఐ ఉపయోగపడుతుంది. అంతరిక్ష అన్వేషణలో ఎఐ పురోగతి ఆశాజనకంగానే ఉందని అంటున్నారు.



### ఐదేళ్లలో 50 ఉపగ్రహాలు..


భారత దేశం రాబోయే ఐదు సంవత్సరాల్లో 50 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. ఈ ఉపగ్రహాలు అంతరిక్ష పరిశోధనను వేగవంతం చేస్తాయి. జాతీయ భద్రతను పెంచుతాయి, అంతరిక్ష సాంకేతికతలో ఎఐని అనుసంధానించడంలో ఒక ప్రధాన అడుగును సూచిస్తాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రయాన్3 సందర్భంగా ఎఐ సాంకేతికతను వినియోగించింది. ప్రజ్ఞాన్ రోవర్, విక్రమ్ ల్యాండర్‌తో కమ్యూనికేట్ చేయడానికి ఎఐని ఉపయోగించింది. సురక్షితమైన ల్యాండింగ్, నావిగేషన్, వనరుల గుర్తింపులో ఎఐ సాంకేతికత ఉపయోగపడింది. కాగా, ప్రపంచంలోనే మొట్టమొదటి అంతరిక్ష ఆధారిత సూపర్ కంప్యూటర్‌ను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్న చైనా, తన త్రీబాడీ కంప్యూటింగ్ కాన్స్టెలేషన్‌ను నిర్మించడంలో భాగంగా 12 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఎఐ అమర్చిన ఈ ఉపగ్రహాలు కక్ష్యలో డేటాను ప్రాసెస్ చేస్తాయి. అధునాతన సాంకేతికతలను పరీక్షిస్తాయి.



### సొంత ఎన్నో సమస్యలు..

ఎఐ అటానమస్ ఉపగ్రహాలు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నా, లెక్కలేనన్ని సమస్యలు వెన్నంటే ఉన్నాయి. పర్యవేక్షణ లోపం, చట్టపరమైన అస్పష్టత వాటిలో ప్రధానమైనవి. దానంతట అదే పనిచేసే ఒక ఉపగ్రహం తప్పు సమాచారం ఇచ్చినా లేదా తప్పుగా లెక్కించినా కలిగే నష్టం భారీగానే ఉంటుంది. ఎఐ వ్యవస్థను ఎవరు అభివృద్ధి చేశారు? ఎవరు చట్టబద్ధమైన బాధ్యత వహిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానం అస్పష్టంగా ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఏ ఒక్క సంస్థ లేదా వ్యవస్థ కూడా ఎఐ నిర్ణయాలకు జవాబుదారీ వహించదు. ఎఐ ఆధారిత ఉపగ్రహ వ్యవస్థలో ఒక్కోసారి హెచ్చరికలను తప్పుగా వర్గీకరించే ప్రమాదం ఉంది. ఉదాహరణకు వాణిజ్య ఉపగ్రహాన్ని శత్రు ఉపగ్రహంలో భావించడం లేదా హానిచేయని వస్తువును హానికారిణిగా భావించి ఢీకొనడం వంటి పొరపాట్లు జరగవచ్చు. రక్షణాత్మక చర్యల వల్ల దౌత్యపరమైన సమస్యలు, సైనిక ఘర్షణలు పెరుగుతాయి. ఎఐ ఆధారిత ఉపగ్రహాలను ద్వంద్వ ఉపయోగాలు.. ప్రమాదాలు ఉన్న సాంకేతిక వ్యవస్థగా చెప్పుకోవాలి. ఎందుకంటే పౌర ప్రయోజనాల కోసం రూపొందించిన స్వయంప్రతిపత్త ఉపగ్రహాలను అంతరిక్షంలో నిజసమయ నిఘా, లక్ష్యం లేదా దాడి కార్యకలాపాల కోసం తిరిగి ఉపయోగించుకోవచ్చు. అవి సైనిక కార్యకలాపాలకు సహాయపడతాయి. కక్ష్యలో ఆయుధ పోటీని పెంచుతాయి. 2030 నాటికి అంతరిక్షంలో ఇలాంటి స్వయంప్రతిపత్తి ఉపగ్రహాలు వేల సంఖ్యలో సంచరిస్తుంటాయని అంచనా. సమన్వయం లేకపోతే కష్టం. బహుళ ఉపగ్రహాల స్వయంప్రతిపత్తి నిర్ణయాలు అంతరిక్ష ట్రాఫిక్ రద్దీ , ప్రమాదాలు లేదా శిథిలాల రద్దీకి కారణం కావచ్చు. ప్రస్తుత ఒప్పందాలు దేశాల అంతరిక్ష కార్యకలాపాలకు 'అధికారం... నిరంతర పర్యవేక్షణ'ను కోరుతున్నాయి. అయితే, నిజమైన స్వయంప్రతిపత్తి అర్థవంతమైన మానవ నియంత్రణకు పరిధిని పరిమితం చేస్తుంది, జవాబుదారీతనం లేకుండా స్వయంచాలక నిర్ణయం తీసుకోవడం గురించి ఆందోళనలను లేవనెత్తుతుంది. విమానయాన లేదా సముద్ర రంగాల మాదిరిగా కాకుండా, ఉపగ్రహాలలో ఎఐ 014భద్రతను, విశ్వసనీయతను పరీక్షించడానికి, ధృవీకరించడానికి అంతరిక్షంలో ప్రపంచ ధృవీకరణ చట్టాలు, మార్గాలు, మార్గదర్శకాలు లేవు. ఎఐ ఉపగ్రహాలు ప్రాణాంతక స్వయంప్రతిపత్తి ఆయుధ వ్యవస్థలను పెంచే ప్రమాదం కూడా ఉంది. జీవన్మరణ నిర్ణయాలను యంత్రాలకు అప్పగించడంపై నైతిక ఆందోళనలకు కారణమవుతున్నది. ముఖ్యంగా అంతరిక్షంలో లేదా అంతరిక్షం నుండి మోహరించితే ఇది చట్టబద్ధంగా.. నైతికంగా వివాదాస్పదమవుతుంది. స్వయంప్రతిపత్తి కలిగిన ఎఐ యుద్ధ వ్యవస్థలకు నైతిక దిక్సూచి ఉండదు. దీర్ఘకాలిక దౌత్య పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటాయి. అంతర్జాతీయ చట్టాలు లేదా మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినప్పుడు, బాధ్యతను అప్పగించడం సంక్లిష్టంగా మారుతుంది.

## రంగుకు కొత్త అర్థం!



రకం ఏదైనా.. రంగు అంటే అందరికీ తెలుసు. కానీ, ఆధునిక సాంకేతిక శరవేగంగా విస్తరిస్తున్న ఈ రోజుల్లో, దీని అర్థం మారిపోతున్నది. ఇందుకు కారణంగా బోస్టన్ (అమెరికా)లోని ఎంఐటి, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా కనుకొన్న కొత్త రంగు. ప్రస్తుతం ఇది ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రంగు అనే పదానికి కొత్త అర్థాన్ని తెచ్చింది, ఎందుకంటే మనం ఇప్పటివరకు తెలిసిన రంగులన్నీ వర్ణక్రమంలో (visible spectrum) మాత్రమే ఉన్నాయి. కానీ, శాస్త్రవేత్తలు కనుగొన్న కొత్త రంగు అనేది ప్రత్యేకమైన నానోపార్టికల్ టెక్నాలజీ వల్ల కనిపించే రంగు. ఈ కొత్త రంగును శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన నానోపార్టికల్స్‌ను ఉపయోగించి, సాధారణంగా మన కంటికి కనిపించని విధంగా సృష్టించారు. ఈ రంగు సాధారణ రంగుల కంటే చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. అందుకే దీనిని 'సూపర్ వివిడ్ కలర్'గా పిలుస్తున్నారు. ఈ రంగు సాధారణ రసాయనిక రంగులతో కాకుండా, కాంతి పరావర్తనంద్వారా ఏర్పడుతుంది. దాంతో ఇది పర్యావరణానికి ఎలాంటి హానీ చేయదు. భవిష్యత్తులో ఈ రంగును సౌర ప్యానెల్స్, సురక్షిత డాక్యుమెంట్లు, ఆర్ట్, డిజైన్, డిస్‌ప్లే టెక్నాలజీల్లో వినియోగించేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ రంగు కనుగొనడం ద్వారా మనం రంగుల ప్రపంచాన్ని కొత్త కోణంలో చూడగలుగుతున్నామని, ఇది విజువల్ టెక్నాలజీ, ఆప్టిక్స్, మెటీరియల్ సైన్స్ రంగాల్లో కొత్త మార్గాలను తెరుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ కొత్త రంగు మన దృష్టిని విస్తరించడమే కాకుండా, భవిష్యత్తులో అనేక రంగాల్లో వినూత్న మార్పులకు దారితీయనుంది.

# పేదలకు భూములు పంచిన మహోన్నతుడు 'సిఆర్'

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

చంద్ర రాజేశ్వర్‌రావుకు సిపిఐ నివాళి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భూస్వామ్య కుటుంబంలో జన్మించి, నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేస్తూ కుటుంబంలో తన వాటాకు వచ్చిన భూములను పేదలకు పంచిన మహోన్నత నాయకుడు చంద్ర రాజేశ్వర్ రావు అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ కొనియాడారు. శుక్రవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు జయంతిని పురస్కరించుకుని రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రాజేశ్వర్‌రావు తన చిన్నతనం నుంచే పేద ప్రజలు పడుతున్న బాధలను గుర్తించి వారి శ్రేయస్సు కోసం పనిచేయాలని సంకల్పంతో ఆనాడు ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించారని, హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం నవాబు పరిపాలన అంతం కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మద్దతుగా నిలిచాడన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి దేశవ్యాప్తంగా పర్యటించి పార్టీ అభివృద్ధికి తన జీవితాన్ని ధారబోసి 28 సంవత్సరాలు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. విపత్కరమైన పరిస్థితుల్లో ప్రజలకు తోడ్పాటునందించేందుకు జనసేవాదళ్‌ను స్థాపించారన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడమే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బూడిద సదాశివ, నగర నాయకులు మామిడిపల్లి హేమంత్ కుమార్, సాంబయ్య, సంపత్, సందీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ :** సమ సమాజ స్థాపనకు నిరంతరం పరితపించిన చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ భారత రాజకీయాలలో, ఆనాటి స్వాతంత్ర పోరాటంలో, తెలంగాణలో నైజాం నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, సమ సమాజ స్థాపన కోసం, భూస్వాముల నుండి భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచిన చరిత్ర రాజేశ్వరరావుదన్నారు. సుదీర్ఘకాలం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌రావు కొనసాగి, కులమతాలకతీతంగా, మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజలకు చైతన్యం చేస్తూ శాంతి కోసం కృషి చేసిన మహనీయుడు రాజేశ్వరరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలను చైతన్యం చేసే దిశగా రాజేశ్వరరావు ఆశయ సాధన కోసం కృషి చేయాలని బిక్షపతి కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఏదునూరి వెంకటరాజం, నాయకులు యేశ బోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్ నాయక్, కొట్టే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



**ప్రజాపక్షం/చండూరు :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ, వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తేవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరు మండలం కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో నిర్వహించిన బికెఎంయు చండూరు మండల మహాసభకు కాంతయ్య ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధి హామీ కూలీకి పార గడ్డపార ఇవ్వాలని పని చేసే ప్రదేశంలో నీడ వసతి కల్పించాలన్నారు. సంవత్సర కాలంలో 200రోజుల పని దినాలు కల్పించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి కూలీ రూ.700లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా, మండల అధ్యక్షుడు భూతరాజు సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఎఎంసి డైరెక్టర్ నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్‌కుమార్, సంఘం నియోజకవర్గం అధ్యక్ష,కార్యదర్శులు ఎండి జానిమియా, సిహెచ్‌ఊషయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, తిప్పర్తి రాములు, ఇరిగి సంజీవ, కట్ట వెంకన్న, కొండ్రెడ్డి రమేష్, వట్టి యాదయ్య , కాశిమల్ల శ్రీను, దోటి బిక్షం, జక్కలి పరమేష్, శివర్ల లింగస్వామి పాల్గొన్నారు.

# యువవికాసంలో రాజకీయ జోక్యం వద్దు

సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పేదలకు వంద సంవత్సరాలుగా అండగా ఉంటూ, నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తున్న ఏకైకపార్టీ సిపిఐ పార్టీ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. శుక్రవారం సిపిఐ నాగర్‌కర్నూల్ మండల 18వ మహాసభ కుమ్మెర గ్రామంలో డి.సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అయిందని, నాటినుండి నేటివరకు ప్రజలపక్షాన ఎన్నో పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాల మెడలువంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు సాధించిన ఘనత సిపిఐపార్టీది అన్నారు. రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి భూమిలేని పేదలకు పదిలక్షల ఎకరాల భూమిని పంచిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. బిజెపి ప్రభుత్వ పాలనలో మత విద్వేషాలతో ప్రజలను మరో వంద సంవత్సరాలు వెనక్కినెట్టే ప్రయత్నం నరేంద్రమోదీ చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ తన మిత్రులు ఖనిజ సంపద దోచుకొనుటకు అవకాశం లేకుండా గిరిజనులను చైతన్యపరుస్తున్నారనే కోపంతో ఆపరేషన్ కగార్ పేరు తో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందరికి విడుదల చేయాలని, మిగిలిన రుణమాఫీని పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువవికాసం పేరుతో ఇస్తున్న రుణాలను రాజకీయ నాయకులతో లబ్దిదారుల ఎంపిక కాకుండా పూర్తిగా అధికారులతో చేయాలని, ఎంపికలో తప్పులు జరిగితే దానికి అధికారులను బాధ్యులను చేసి తప్పులు తేలితే ఉద్యోగాలనుంచి తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, వార్లవెంకటయ్య, జిల్లా సమితి సభ్యులు కృష్ణాజి, కొమ్ము భరత్, శివశంకర్, శివకృష్ణ, రామస్వామి, శేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కగార్ కాదు.. శాంతి చర్చలే పరిష్కారం

మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి

వామపక్ష ప్రజాసంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని, శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అమరవీరుల స్తూపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈదునూరి నరేష్, పౌర హక్కుల సంఘం నాయకులు మాదారపు కుమారస్వామి మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు వస్తామని నాలుగుసార్లు లేఖ రాసిన, బహిరంగ ప్రకటన చేసిన వాటిని పట్టించుకోకుండా, మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామనడం బిజెపి ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఈ దాడులను ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు కల్లేపల్లి అశోక్, జి,జ్యోతి,జె,ప్రశాంత్, కె,కనకరాజు, టి, మల్లయ్య, ఎం,సూర్య, బి,అశోక్, యం,చంద్రయ్య, కే,మల్లేష్, డి,లచ్చన్న, ఎల్,భీమన్న, కొమురయ్య, రాజయ్య, ఎం,శ్రావణ్, బి,లెనిన్, మానస్ కుమార్, నవీన్, రవికుమార్ పాల్గొన్నారు.


**జోగులాంబ గద్వాల :** ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని, శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని పాత బస్టాండ్ సమీపంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న ఎన్‌కౌంటర్లు ఆపి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నాగర్‌దొడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, వెంకటస్వామి, కుర్వపల్లయ్య, జి.గోపాల్, గోపాలరావు, సుభన్, ఫయాజ్, వాల్మీకి, ఆశన్న, రంగన్న, నరసింహులు, ప్రవీణ్, ధర్మాన, తిమ్మప్ప, మస్తాన్, చిన్న, రవి, తదితరులు పాల్గొన్నారు..





# ప్రజా సమస్యలపై పోరాటాలు

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలో ప్రజలు అనునిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్‌పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 22న సిపిఐ నగర మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నగర సమితి సమావేశం జరిగింది. సమావేశంలో సుధాకర్,ఓమయ్యలు మాట్లాడుతూ అన్ని డివిజన్లలో శాఖ మహాసభలను జరిపి 22 న నగరంలో నగర మహాసభ నిర్వహించుకుందామన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున మురికివాడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రోడ్లు, మురికి కాలువలను శుభ్రపర్చటంతో పాటు పాడైన చోట్ల నూతనంగా నిర్మించాలని కోరారు. మౌలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. సిపిఐ నాయకత్వం మున్సిపల్ అధికారుల వద్దకు సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశానికి ముందు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ మృతికి, పహల్గంలో ఉగ్రవాదుల కాల్పులలో చనిపోయిన వారికి, మావోయిస్టు పార్టీ నేతలకు, బెంగళూరులో క్రికెట్ గ్రౌండ్‌లో తొక్కిసలాటలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. సమావేశంలో సిపిఐ నగర నాయకులు రంజిత్, దేవేందర్, హన్మాండ్లు, రఘురాం, ఫిరోజ్ అలీ, భాను, గంగాధర్, శ్రీను, వెంకటేష్, భాగ్యలక్ష్మి , స్వరూప పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, గద్వాల

## సుద్దాల హనుమంతు 116వ జయంతి

ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : తెలంగాణ వైతాళికుడు బహుజన సాంస్కృతిక యోధుడు పలు ఉద్యమాలకు తన కలం గలంతో ఊపిరిలూదిన ప్రజా కళాకారుడు స్వర్గీయ సుద్దాల హనుమంతు 116వ జయంతి కార్యక్రమం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆ మహనీయునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తో పాటు తన బుర్రకథ ద్వారా వందలాది గ్రామాలలో ప్రజలను చైతన్యవంతం చేశారని అనేక సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతగా సుద్దాల హనుమంతు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, నాయకులు నాగపురి యాదగిరి, బండి బాల నరసింహ, ఏనుగు మల్లారెడ్డి పాల్గొన్నారు.





## భూ భారతితో మెరుగైన సేవలు

జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

ప్రజాపక్షం/నూతన్‌కల్: భూభారతితో రైతులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం నూతన్‌కల్ మండలం తాళ్లసింగారంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జూన్ 3నుండి 20వ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవిన్యూ సదస్సుల ద్వారా 233 మంది దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. రెవిన్యూ సదస్సులలో రైతులు తమ భూములకి సంబంధించి అన్ని సర్టిఫికెట్లు జత చేసి భూ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించాలని తదుపరి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. నూతన్ కల్ మండలం సోమ్లాతండా గ్రామంలో రేషన్ దుకాణంను అదనపు కలెక్టర్ సందర్శించి ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ అదేశాల ప్రకారం మూడునెలలకి సరిపడ బియ్యం ఒక్కసారే పంపిణీ చేయాలని రేషన్ డీలర్లను అదేశించారు. తదుపరి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంను సందర్శించి పండ్ల మొక్కలు ఎక్కువగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 8న సిపిఐ సూర్యాపేట జిల్లా మహాసభ

సిపిఐ నాయకుడు ధనుంజయనాయుడు విజ్ఞప్తి



ప్రజాపక్షం/నేరేడుచర్ల: ఈనెల 8వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఈనాడు కార్యాలయం ఎదురుగా ఉన్న రితిక ఇన్ బ్యాంకిట్ హాల్ నందు జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని బొడలదిన్నె గ్రామంలో జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. శ్రమజీవుల హక్కుల కోసం పుట్టిందే ఎర్రజెండా అని, పేద మధ్యతరగతి వర్గాల ప్రజల కోసం నిరంతరం శ్రమించేది ఎర్రజెండా అని అన్నారు. రోజుకు 8 గంటల పని విధానాన్ని తీసుకవచ్చి కార్మికులకు 44 చట్టాలను సాధించిన ఎర్రజెండా అని, రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ విధానానికి స్వస్తి పలకాలని అందరిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారి శ్రమకు తగ్గ జీతాలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలక రాజు శ్రీను, కత్తికుమార్‌రెడ్డి, శివ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.10 లక్షలు



ప్రజాపక్షం/సూర్యాపేట: తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అకాలంగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుటుంబానికి రూ.10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహా కుటుంబ సభ్యులకు అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసులకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సాదరణ మరణం సంభవిస్తే ఈ పోలీస్ సాలరీ ప్యాకేజీ అకౌంట్ ద్వారా పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ అందిస్తుందని, ఈ స్కీం ద్వారా పోలీసు కుటుంబాలకు ఎంతగానో ఆర్థిక బాసటగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డి, ఎవో మంజుభార్గవి, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, మహిళ ఎస్ఐ మౌనిక, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యాపేట రీజనల్ మేనేజర్ అనిల్‌కుమార్, ఛీఫ్ మేనేజర్ విద్యాసాగర్, చీఫ్ మేనేజర్ మోహన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## క్రైస్తవ జనసమితి ఉచిత అంబులెన్స్

ప్రజాపక్షం/దేవరకొండ: క్రైస్తవ జన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఆర్టిసి బస్టాండ్ వద్ద ఉచిత అంబులెన్స్‌ను కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు వైద్య అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను సిని నటుడు, మోహన్‌బాబు యూనివర్సిటి ఛాన్సలర్, మా అసోసియేషన్ అధ్యక్షులు మంచు విష్ణు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం నుండి ఉచిత అంబులెన్స్ సేవలు పేద ప్రజలందరికి ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. వివరాలకు చరవాణి నెంబర్ 7780699070కు కాల్ చేయాలని ఈ కార్యక్రమం క్రైస్తవ జన సమితి సిజెఎస్ అధ్యక్షులు మాసారం ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సిజెఎస్ కార్యదర్శి కృష్ణఫర్, సోలమాన్‌రాజ్, ప్రభుప్రసాద్, ప్రసన్న కుమార్, రవికుమార్, అలెగ్జాండర్, జాన్సన్, సర్వయ్య, ఆలంపల్లి నర్సింహా, శ్రీశైలం, వెంకన్న, ఇలియాస్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో ఆరు మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్య

ఇంటిస్థలం ఉన్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఇందిరమ్మ ఇల్లు

అధికారులకు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశం



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: ప్రాజెక్టుకి ఒక్క మోడల్ అంగన్‌వాడీ కేంద్రం తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ నందు జరిగిన సమావేశంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు ప్రాజెక్టులు ఉన్నాయని, ప్రాజెక్ట్‌కి ఒక్క అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రైవేట్ ప్లే పాఠశాలలకి ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు తీర్చిదిద్దేందుకు ఒక్కొక్క సెంటర్‌కి రెండు లక్షల చొప్పున మొత్తం 12 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని పంచాయితీరాజ్ ఇంజనీర్ల ద్వారా అంచనా విలువలు తయారు చేపించుకుని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటిల ద్వారా పనులు చేపట్టాలని సూచించారు. వీటితో పాటు అంగన్‌వాడీ సెంటర్లకి త్రాగునీరు, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటి లాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి సెలవులు అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలలో పరిసరాలలో టాయిలెట్స్ పరిశుభ్రం చేయించాలని, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్‌లకి ఏమైనా మరమ్మతులు ఉంటే అర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో చేపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో రేషన్ పరిశీలించుకోవాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థుల ప్రీ స్కూల్‌లో చేరేలా ప్రచారం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలని భయపెట్టకుండా క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, ఆటపాటలతో కూడిన విద్యను ప్రణాళికలో భాగంగా బోధించాలన్నారు. మంచి అక్టివిటిస్ చేసిన టీచర్లకి జిల్లాలో ముగ్గురికి ప్రశంసపత్రంతో పాటు బహుమతి ఇస్తామని తెలిపారు. నిర్మాణం పూరైన అంగన్‌వాడీ కేంద్రాలను పంచాయతీ రాజ్ ఇంజనీర్ అధికారుల నుండి స్వాధీనం చేసుకుని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. ఇంటిస్థలం ఉన్న ట్రాన్స్‌జెండర్స్‌లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని అంలాటి వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సూర్యాపేట పట్టణంలో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఆర్థిక లబ్ధిపొందుతున్నారని తెలిపారు. వృద్ధాశ్రమం, చిల్డర్స్‌హోమ్, సఖి సెంటర్‌లలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పదిమంది ఉద్యోగులు ఉంటే అంతర్గత విచారణ కమిటి ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించి అన్ని కార్యాలయాలకి సర్క్యులర్ జారీ చేయాలని అధికారులకు అదేశించారు. ఈ సమావేశంలో డిడబ్ల్యూఓ నర్సింహరావు, సిడిపివోలు రూప, శ్రావణి, శ్రీజ, పారిజాత, నిర్మల, కిరణ్మయి, సూపర్‌వైజర్లు చంద్రిక, అరుణ,సునిత, డిసిపివో రవి, మహిళ సాధికారిత కోఆర్డినేటర్ చైతన్య, సఖి ఇంఛార్జి హేమలత, ఎఫ్‌ఆర్‌వో వినోద, పోషణ్ అబియాన్ కోఆర్డినేటర్ కృష్ణ పాల్గొన్నారు.

# మునుగోడు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

బంగారిగడ్డ , చండూరులో అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజాపక్షం/చండూరు : మునుగోడు నియోకవర్గం అభివృద్ధి ,ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తునట్లు మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌లో ఆయన చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలాన్ని పరిశీలించారు.అన్ని వసతులకు అనువుగా ఉన్న బంగారిగడ్డలోని ఎంపల్లగండ స్థలంలో పిహెచ్‌సి ని నిర్మించాలని అన్నారు. బంగారిగడ్డ మాజీ ఎంపిటిసి పల్లె వెంకన్న గ్రామంలో ఉన్న సమస్యలను ఎంఎల్‌ఏ దృషికి తీసుకురాగ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చండూరు మున్సిపాలిటీలో నిర్మిస్తున్న 400మీటర్ల రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. రోడ్డు వెడల్పు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు , కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముదస్తూ ప్రణాళికతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలాభివృద్ధికి నిధులు కేటాయింపులో వివక్షకు తావులేకుండా అభివృద్ధి చేస్తానని అన్నారు.అధికారులు పనుల పర్యవేక్షణలో బాధ్యతాయుతంగా ఉండాలని ,నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడేది లేదన్నారు. చండూరు మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో రాజీపడేదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , బంగారిగడ్డ మాజీ ఎంపిటిసి పల్లె వెంకన్న, కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు , పన్నాల లింగయ్య , సైదులు , భూతరాజు ఆంజనేయులు , ఇరిగి రాజు, కావలి ఆంజనేయులు , మల్లేశం ,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజల అవగాహన సదస్సులో ఎఎస్‌పి మౌనిక

ప్రజాపక్షం/డిండి: ఇసుక అక్రమ రవాణా చేస్తూ కఠిన చర్యలు ఉంటాయని దేవరకొండ ఎఎస్‌పి పి. మౌనిక అన్నారు. శుక్రవారం డిండి మండలంలోని దాసరి నెమలిపూర్ గ్రామంలో ఇసుక అక్రమ రవాణా, నకిలీ విత్తనాలు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మౌనిక మాట్లాడుతూ ఇసుకను అనుమతి లేకుండా ట్రాక్టర్ల ద్వారా కానీ, ఎడ్ల బండ్ల ద్వారా కానీ తరలించడం నేరమని, తరలించిన వారిపై కేసులు నమోదు చేసి వారి బండ్లను సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే పాత నేరస్తులను బైండోవర్ చేస్తామని అన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు పొందిన కంపెనీల వద్ద విత్తనాలను, లైసెన్స్‌డ్ షాపుల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. బాల్యవివాహాలు ఎవరు చేయొద్దని అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే తల్లిదండ్రులు తమ పిల్లలకు వివాహం చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో డిండి సర్కిల్ సిఐ సురేష్, ఎస్ రాజు గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అరెస్టు అప్రజాస్వామికం

ఇథనాయిల్ పరిశ్రమ బాధిత గ్రామాల ప్రజలను ఓదార్చడానికి వెళ్తున్న అఖిలపక్ష నాయకుల నిర్బంధం



ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి: అక్రమ కేసుల్లో బంధింపడ్డ రైతుల కుటుంబాలను పరిమర్శించడానికి వారిని ఓదార్చడానికి గద్వాల నుండి పెద్ద ధన్వాడ గ్రామానికి వెళ్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులను శుక్రవారం ఐజలో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఇథనాయిల్ పరిశ్రమ ఏర్పాటును ఆపాలని శాంతియుతంగా పోరాడుతున్న రైతులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం అన్నారు. రైతుల పై దాడి చేసి వారిని గాయాలపాలు చేసిన పరిశ్రమ యాజమాన్య ప్రైవేటు వ్యక్తుల పై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి అనుకూలమైన సాగుభూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రశ్నించిన రైతుల పై నియంతత్వంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాల వ్యతిరేకంగా ప్రజల ఐక్యం కావాలని అన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడానికి వెళుతున్న అఖిల పక్ష సామాజిక ప్రజా సంఘాల నాయకులను మార్గ మధ్యలోనే అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే ఇథనాల్ పరిశ్రమ అనుమతిని రద్దు చేసి రైతుల పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని లేని పక్షంలో దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు సిపిఐ సిపిఎం జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటస్వామి, బిఆర్ఎస్‌వి జిల్లా కన్వీనర్ కుర్వ పల్లయ్య, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్, బహుజన రాజ్య సమితి నాయకులు వాల్మీకి వినోద్, ఉప్పేర్ నరసింహ, దానయ్య, సుబాన్ తదితరులు ఉన్నారు.

## వీరభద్రం జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకం



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: పీడిత ప్రజల పక్షపాతి మానవ హక్కుల పరిరక్షణ నాయకుడు డాక్టర్ నాతి వీరభద్రం జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని గోపా జిల్లా అధ్యక్షులు బూర రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం ఆయన 31వ వర్ధంతి సందర్భంగా ఆల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టారు. కుటుంబ సభ్యుల సహకారంతో లయన్స్ క్లబ్ స్పందన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వీరభద్రం పేద ప్రజల సేవ చేస్తూ పేద ప్రజల డాక్టర్‌గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం వీరభద్రం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాతి సవీందర్‌కుమార్, సంపత్‌కుమార్, సముద్రాల మనోహర్, తంగెల లక్ష్మి కాంతరెడ్డి, లింగమంతుల గుట్ట మాజీ చైర్మన్ కోడి సైదులు పాల్గొన్నారు.



## హామీలను అమలు చేయాలి

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

ప్రజాపక్షం/చింతపల్లి : భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 15వ మండల మహాసభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశంలో యాదగిరిరావు పాల్గొని మాట్లాడారు. మాల్ వెంకటేశ్వర నగర్‌లోని బిజె గార్డెన్‌లో ఈ నెల 9న నిర్వహించే సిపిఐ 15వ మండల మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికవ్యతిరేక చట్టాలను ప్రవేశపెట్టి, నిత్యవసర సరుకుల ధరలు అదుపు చేయకుండా పేదల జీవితాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీను నెరవేర్చాలని, మునుగోడు, దేవరకొండ రైతాంగానికి సాగునీరందించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని, 9వ తేదీన జరిగే మహాసభను వేదికగా చేసుకొని భవిష్యత్తు ఉద్యమాలపై కార్యాచరన తీసుకోవడం జరుగుతుందన్నారు. సిపిఐ నిర్వహించే పోరాటాలలో ప్రజలంతా కలిసిరావాలని ఆయన కోరారు. ఈ మహాసభకు పార్టీశ్రేణుల సకాలంలో హాజరయి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, ఇద్దిరాములు, వింజమూరి నర్సింహ్మా, వేముల బుచ్చయ్య, గ్యార పరుశరాములు, వెంకటయ్య, ఎల్లయ్య, యాదయ్య, లాలయ్య, పాప, లక్ష్మయ్య, నర్సింహ్మా, పెద్దయ్య, సైదులు, వెంకటయ్య, దశరథం, రాఘవేంద్ర పాల్గొన్నారు.

# అధికారులు కదిలారు.. అభాగ్యులను చేరదీశారు..

అభాగ్యులకు ఆస్తులైన చిత్తు కాగితాలు.. ప్లాస్టిక్ కవర్లను తగలబెట్టారు..17 మంది అనాథల ఆశ్రమానికి తరలింపు..



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : అభయం శుభం తెలియని అభాగ్యులు ఎందరో నిత్యం ఎక్కడో ఒకచోట కనిపిస్తూ వారికి ఆస్తులు పాస్తులు లేకున్నా చిత్తు కాగితాలు ప్లాస్టిక్ కవర్ల తమ ఆస్తులుగా భావించి జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తున్నారు. దీనిపై ప్రజాపక్షం దినపత్రిక గత మే 23న అభాగ్యులకు ఫుట్ పాత్ లే ఆవాసాలు అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్, సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నల్లగొండ పట్టణంలో బిక్షటన చేస్తున్న అనాధలను జిల్లా పరిరక్షణ విభాగం సిబ్బంది, పోలీస్ శాఖ, ఏహెచ్‌టియు సిబ్బంది సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాలైన బస్టాండు పరిసర ప్రాంతాల్లో క్లాక్ టవర్ సెంటర్, సినిమా థియేటర్లు, మసీద్, రైల్వే స్టేషన్, ఎన్ జీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో భిక్షాటన చేస్తున్న 17 మంది అనాధ వృద్ధులలో మహిళలు పురుషులను గుర్తించడం జరిగిందనీ ,అనాధలైనటువంటి 9 మంది మహిళలు 8 పురుషలను వృద్ధ ఆశ్రమం లో ఆశ్రయం కల్పించడం జరిగిందని వారు తెలిపారు. మిగతా 13 మందిని వారి సంబందిత బంధువులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బోర్డు సభ్యులు మోహన్ రావు, టూ టౌన్ ఎస్ఐ మానస , బీఆర్సీ కో ఆర్డినేటర్ హరిత , జిల్లా బాలల పరిరక్షణ విభాగ అధికారి కె. గణేష్ , ఎఫ్ ఆర్ ఓ నాగిరెడ్డి , బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది వెంకన్న, తేజస్విని, విద్య, రాము, రమణి, రేవతి, అంజలి, పోలీస్ సిబ్బంది ఏ హెచ్ టి యు సిబ్బంది ఎన్జీవో సభ్యులు, సఖి సిబ్బంది , సునీత, రాజేశ్వరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఆరు అంశాలు తప్పనిసరిగా పాటించాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనూల్ రైతు వేదికలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇందులో ప్రధానంగా మోతాదుకుమించి రసాయన ఎరువులను తగ్గించడం మొక్కలునాటడం, పంటమార్పిడి చేయడం, సేంద్రియ ఎరువుల నువాడటం పంటలకు సకాలంలో నీటితడులు ఇచ్చి నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం పొలంగట్లపై చెట్లు పెంచడంలాంటి ప్రధాన అంశాలను రైతన్నలు తప్పకుండా పాటించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎఈవో మాధవి నర్సింహ్మారెడ్డి, మాజీసర్పంచ్ శాంతయ్య, మాజీ ఎంపిటిసి వెంకట్‌రాములు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వంగూర్:** మండల పరిధిలోని ఉల్పర గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు గుణమోనిమల్లేష్ యాదవ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించి రూ.70వేల ఆర్థికసాయం అందజేశారు. మల్లేష్‌యాదవ్ కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ కాంగ్రెస్‌ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు అల్వాల్‌రెడ్డి, శంకర్‌యాదవ్, హరీష్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

## కారుకొండ పాఠశాలలో గ్రామసభ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రొఫెసర్ జయశంకర్‌సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రాథమికొన్నత పాఠశాల కారుకొండ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ప్రాథమికొన్నత పాఠశాల బడిబాట పోస్టర్‌ను విడుదల చేశారు. గ్రామంలోని బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండుజతల యూనిఫాం, ఉచిత మధ్యాహ్నబోజనం, వారానికి మూడుగుడ్లు, వారానికి మూడుసార్లు రాగిజావ, ప్రతినెల మూడోశనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్, ప్రతినెల నాల్గో శనివారం నోబ్యాక్‌డేవంటి కార్యక్రమాలను పాఠశాల విద్యార్థులకు అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ దివ్య, అమ్మ ఆదర్శపాఠశాల కమిటిచైర్‌పర్సన్ మిద్దెమాధవి, మాజీ ఎస్‌ఎంసిచైర్మన్ మిద్దెబాలయ్య, జిల్లాబిజెపి కార్యవర్గసభ్యులు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు ఖలీల్, మండలకాంగ్రెస్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, అంగన్‌వాడిటీచర్ శశికళ, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి , శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అభినందనీయం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ మహిళాసంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మంచి ప్రతిభకనబర్చిన పదిమంది పదోతరగతి, ఇంటర్మీడియట్, ద్వితీయ విద్యార్థులకు ప్రతిభపురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయచైర్మన్‌ఫౌండర్ ట్రస్టు జూలూరి రమేష్‌బాబు మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ మహిళాసంఘం, యువజన విభాగం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహాసభ పట్టణ అధ్యక్షుడు వాసశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరింతమందికి ఇచ్చేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం అధ్యక్షురా లు గోవిందుమౌనిక, యువజన విభాగం అధ్యక్షుడు తరుణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు కృష్ణయ్య, గార్లపాటి శ్రీనివాసులు, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మండల, పట్టణకోశాధికారిలు ఆకుతోటరవి, జూలూరివీరేష్, మహిళా ప్రధాన కార్యదర్శిరాణి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి రేవంత్,నితిన్, సంఘంనాయకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్తు



**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని డిఇఓ రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్‌లో నిర్వహిస్తున్న బడిబాటలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి , మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులను ఉన్నత లక్ష్యంతో తీర్చిదిద్దేబాధ్యతకూడా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉంటుందని తెలిపారు. ఈనెల 19వతేదివరకు బడిబాట కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూపదుస్తులు అందజేయాలని తెలిపారు. ఈవిద్యా సంవత్సరం ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డిజిటల్‌బోధనను క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి, ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమఫలితాలు సాధించినతీరును క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్ బరపటి వెంకటయ్య, టెస్టుబుక్‌మేనేజర్ మనపాడు నర్సింహ్మలు, ఎంఈవోలు శంకర్‌నాయక్, చంద్రుడునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## అటవీ అధికారులకు నెమలి అప్పగింత



**ప్రజాపక్షం/ నర్వ :** నర్వ మండల కేంద్రంలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో గురువారం రోజు సాయంత్రం అడవి నుండి నెమలిని కుక్కలు వెంబడించడంతో గ్రామంలోని వడ్ల బాలస్వామి ఇంటి ఆవరణలోకి వచ్చింది. దానిని చూసిన బాలస్వామి వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆ నెమలిని రాత్రి 7 గంటల సమయంలో పోలీస్ స్టేషన్ లో ఎస్సై కు అప్పగించడం జరిగింది. శుక్రవారం ఉదయం హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు సమక్షంలో ఫారెస్ట్ ఆఫీసర్ మల్లేష్ అప్పగించడం జరిగింది.

# ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** జిల్లాలో ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేకదృష్టితో భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాపరిధిలోని కొనసాగుతున్న మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరురంగారెడ్డి, మార్కండేయ ఇరిగేషన్, డిండిబ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటిపారుదల ప్రాజెక్టులపరిధిలోని పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తనచాంబర్‌లో నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులతో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై గతనెల 30న సమీక్షలో ప్రాజెక్టులవారిగా నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పురోగతి సాధించిన భూసేకరణ పనులపై అదనపు కలెక్టర్ అమరేందర్‌తోకలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై ఆయాస్థాయిలో ఉన్న చర్యలను తక్షణమే పూర్తిచేసి భూసేకరణ ప్రక్రియలను వేగవంతంచేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రాజెక్టులవారిగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్‌వారిగా రెవెన్యూ సర్వయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి సర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టులకు సేకరించిన భూమికి రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈసమీక్ష సమావేశంలో నీటిపారుదలశాఖ అధికారులు శ్రీధర్, పార్థసారథి, మురళి, జిల్లాసర్వేల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్‌డిఓలు శ్రీను, మాధవి, సురేష్, భూసేకరణవిభాగం కలెక్టరేట్ సూపరిండెంట్ నారాయణ, కార్తీక్ రావు, రెవెన్యూ నీటిపారుదలశాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇవిఎంగౌడన్‌ను పరిశీలించిన కలెక్టర్**

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని పట్టణంలోగల ఇవిఎం గౌడన్‌ను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శుక్రవారం పరిశీలించారు. గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గౌడన్ సీల్‌ను తెరిచారు. ఇవిఎంలు, బ్యాలెట్‌యూనిట్, కంట్రోల్‌యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిసికెమెరాల పనితీరును తనిఖీచేశారు. ఇవిఎంలభద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, గుర్తింపుపొందిన వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, బిఆర్‌ఎస్ వెంకటయ్య, బిఎస్పి రామకృష్ణ, వైఎస్సార్‌సిపి హుస్సేన్, టిడిపి బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**శాంతి, సౌభ్రాతృత్వం, త్యాగానికి ప్రతీక**

బక్రీద్ వేడుకను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తనచాంబర్‌లో మాట్లాడుతూ బక్రీద్ పండుగ ప్రవక్త ఇబ్రహీం ఆయన కుమారుడు ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తుందని, అల్లాహ్ ఆజ్ఞను పాటించడానికి, బలి ఇవ్వడానికి తండ్రి ఇబ్రహీం సిద్ధపడ్డారన్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తడిపొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని పురకమీషనర్ మహమూద్‌షేక్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల ప్రణాళికలోభాగంగా శుక్రవారం పట్టణంలో జరుగుతున్న కార్యక్రమాలను అసిస్టెంట్ డైరెక్టర్ సాయి , పురకమీషనర్ మహమూద్‌షేక్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా పలువార్డులలో తిరుగుతూ పట్టణప్రజలకు తడిపొడి చెత్తలను వేరుచేసి ప్రతిరోజు ఇంటింటికి వచ్చే పురపాలక సంఘం ఆటోకు అందజేయాలని అవగాహన కల్పించడంతోపాటు పాంప్లెట్స్ పంచడం ఆటో ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేయించారు. మహిళా సంఘాల గ్రూపులకు ప్రతిరోజు పట్టణంలో తిరుగుతూ ప్రతి ఒక్కరికి తడిపొడిచెత్తలను వేరుచేసి పురపాలక సంఘం ఆటోలకు ఇచ్చేవిధంగా అవగాహన కల్పించాలని పలు సూచనలు చేశారు.

## వన మహోత్సవాన్ని పగడ్బందీగా చేపట్టాలి

### స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని పగడ్బందీగా చేపట్టి విజయవంతం చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతేడాది పట్టణ, పల్లె ప్రగతి పేరిట మొక్కలు నాటడం జరిగిందని ఈ వర్షాకాల ఆరంభంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. అయితే జిల్లాకు ఇచ్చిన మొక్కలు నాటే టార్గెట్‌ను చేరుకునేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా అవెన్యూ ప్లానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్న చిన్న మొక్కలు నాటకుండా 5 ఫీట్ల పొడవు గల మొక్కలు నాటాలన్నారు. అవెన్యూ ప్లానిటేషన్ కోసం రోడ్లను గుర్తించాలని, ఎక్కువ పొడవు ఉన్న మొక్కలు ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డుపక్కన ఎన్ని మొక్కలు నాటాలో లెక్క వేసుకోవాలన్నారు. నర్సరీలలో ఎన్ని మొక్కలు ఉన్నాయి? వాటిలో ఏఏ రకాలు? పొడవైన మొ క్కలు ఎన్ని ఉన్నాయో చూసుకోవాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని లే అవుట్‌లలో గల పదిశాతం ఖాళీ స్థలాలలో మొక్కలు నాటేందుకు మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. వచ్చే ఏడాది కోసం ప్రస్తుతం ఇచ్చిన టార్గెట్ కంటే అదనంగా 20శాతం ఎక్కువ మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పిసీఈఓ శైలేష్ కుమార్, డిఆర్డి మొగులప్ప, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపివోలు పాల్గొన్నారు.

## నీటిని వదిలిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ నియోజకవర్గం చిన్నగోపులాపూర్ స్టేజ్1 నుండి నేడు ఓపెన్ కెనాల్ ద్వారా భుత్పూర్ రిజర్వాయర్, సంగంబండ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసిన మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు డా.వాకిటి శ్రీహరి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు గాను భీమా నది ఎక్కువగా మారడంతో జూరాల ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరగడంతో మన మక్తల్ నియోజకవర్గ లోని రాజీవ్ ఎత్తిపోతల పథకం స్టేజ్1 నుండి నేడు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు స్టేజ్1 మూడు పంపులు ఉండగా ఇప్పటివరకు కేవలం రెండు పంపులు మాత్రమే ఉపయోగంలో ఉండగా మూడవ పంపు 2018 ఉంది నిరూప యోగంగా ఉండగా అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడవ పంపు గాను గత సంవత్సరం డిసెంబర్లో ఒకో కోటి నాలుగు లక్షల రూపాయల నిధులను మూడో పంపు మరమ్మత్తుల నిమిత్తం నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం జూన్ 13న నీటిని విడుదల చేయగా ఈ సంవత్సరం ఒక వారానికి ముందే నీటిని విడుదల చేయడం జరిగిందని అందుకు స్టేజ్ వన్ లోని సాంకేతికపరమైన యంత్రాలను పూర్తిస్థాయిలో ఆధునీకరణ చేసే అన్ని యంత్రాలను పనిచేసే విధంగా ఏర్పాటు చేయడానికి నిధులు సమకూర్చినటువంటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి పెద్దలు ఉత్తంకుమార్ రెడ్డి కి, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు పెద్దలు ఎనుముల రేవంత్ రెడ్డి మక్తల్ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, చుట్టుపక్కల గ్రామాల రైతులు సంబంధిత ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

### జిల్లా ఎస్పీ యోగేష్ ఐపియస్



**ప్రజాపక్షం/నారాయణపేట్:** బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు ఎస్పీ బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఎస్పీ మాట్లాడుతూ. త్యాగానికి ప్రతికగా ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రత ఏర్పాట్లు చేశామని, బక్రీద్ పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. అని ఎస్పీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్న ఈద్గాల దగ్గర ప్రార్థన మందిరాల వద్ద ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పండగ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుం డా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్ ఏర్పాటు చేసి, అవసరం ఉన్న చోట పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలంతా మతసామరస్యాన్ని కాపాడుకుంటూ సా మరస్యంగా శాంతియుతంగా పరస్పరం ఇతర మతాలను గౌరవించుకుంటూ తమ పండగలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేవారు. సోషల్ మీడియాలో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా వివాదాస్పదంగా పోస్టులు చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు అత్యవసర సమయంలో 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్ నో 8712670399 కి, డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని ఎస్పీ కోరారు.

## సైబర్ హుడ్ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట్:** జిల్లాలోని కోస్గి పట్టణంలో డి ఆర్ డి ఏ సెర్ఫ్ సహాయంతో నిర్వహిస్తున్న సైబర్ హుడ్ కేంద్రాన్ని, అలాగే జిల్లా విద్య శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ సందర్శించారు. అయితే ఈ రెండు కేంద్రాలు కూడా దివ్యాంగుల కోసం పనిచేస్తుండగా, రెండింటిని ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నంలో భాగంగా కోస్గి మండలంలో గల బీసీ కాలనీలోని ఎంపీ పీ ఎస్ నాన్ ఐ ఈ ఆర్ సి కేంద్రాన్ని, సైబర్ హుడ్ సెంటర్ రెండింటిని క్లబ్ చేసి అక్కడే 5 నుంచి 55 ఏళ్ల వయసు గల దివ్యాంగులకు విద్యతోపాటు ప్రత్యేక సేవలు అందించుటకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయటం జరిగిందని జిల్లా విద్యశాఖ అధికారి గోవిందరాజులు తెలిపారు. ఆ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సేవలు వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యశాఖ అధికారి గోవిందరాజు, సీఎమ్‌ఓ రాజేంద్రకుమార్, మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త యాదయ్య శెట్టి, డిపిఎం ఆనందం, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండి పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటునివ్వాలి

### మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించి తమ పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటు ఇవ్వాలని మహిళా సాధికార శాఖ కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ శాఖ అధికారి సూచనల మేరకు మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ శుక్రవారం పెద్దమందడి మండలంలోని జగత్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు బాల్య వివాహాల నిర్మూలన, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైమ్ , బ ఆలల చట్టాలు, చైల్డ్ లేబర్ , బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. బాలల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించి బాల్య వివాహ రహిత సమాజానికి కృషి చేస్తామని ఉపాధి హామీ కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, ఉపాధి హామీ కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.


## పోలీస్ సిబ్బందిని అభినందించిన డిఎస్పి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో మొట్టమొదటి సారిగా కల్తీకల్లు తయారు చేయడానికి ఉపయోగించే ఆల్ప్రజోలంను గద్వాల జిల్లాకు చెందినటువంటి నర్సింహగౌడ్, భాస్కర్ గౌడ్ అనే ఇద్దరు వ్యక్తులు పెబ్బేరు మార్కెట్ యార్డులలో ఆల్ప్రజోలం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారం స్థానిక ఎస్ఐ యుగంధర్ రెడ్డి పకడ్బందీగా వల పన్ని పట్టుకోవడం జరిగింది. వారిని విచారించగా నర్సింహ గౌడ్ అనే వ్యక్తి కర్నూలు జిల్లాకు చెందినటువంటి హర్షవర్ధన్ గౌడ్, జగదీష్ గౌడ్ , గోపాల్ గౌడ్ అనే ముగ్గురు వ్యక్తుల నుండి ఆల్ఫాజాలంలో తీసుకువచ్చి భాస్కర్ గౌడ్ కి ఇవ్వగా భాస్కర్ గౌడ్ కల్లు దుకాణాలు నడుపుతున్నటువంటి అనంతరం జిల్లాకు చెందిన కుమార్ గౌడ్ కర్నూల్ జిల్లాకు చెందిన ఈడిల లక్ష్మన్న గౌడ్, పండ్ల రమేష్, ఈడిగ గజేంద్రగౌడ్, నాగర్‌కర్నూల్ చెందిన యుగంధర్ గౌడ్ లకు విక్రయించడం జరుగుతుంది. ముందస్తు సమాచారం వరకు ఈ నర్సింహగౌడ్‌ను భాస్కర్ గౌడ్ ను అదుపులోకి తీసుకొని వారి దగ్గర ఉన్నటువంటి 500 గ్రాముల ఆల్ప్రజోలం స్వాదీన పర్చుకొని కేసు నమోదు చేయడం జరిగింది. మత్తు పదార్థాన్ని అత్యంత చాకచకంగా పట్టుకొని నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన స్థానిక ఎస్ఐ యుగంధర్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబులను, పోలీస్ సిబ్బందిని డిఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో నిందితుల వివరాలు వెల్లడించి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాంబాబు, ఎస్ఐ యుగంధర్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, రైటర్ ఆంజనేయులు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## పత్రిక స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి

### జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టుల పై తప్పుడు కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని జడ్చర్ల విలేకరులు శనివారం తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల సీనియర్ రిపోర్టర్ కృష్ణ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా వార్తలు రాసి ప్రచురించిన జనం సాక్షి దినపత్రిక ఎడిటర్ ఎంఎం రెహమాన్ పై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు. పోలీసులు ఇప్పటికైనా పత్రికా యాజమాన్యాల పై, విలేకరుల పై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల విలేకరులు శ్రీధర్, సత్తార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

**ప్రజాపక్షం / కొత్తకోట:** కొత్తకోట మండలంలోని అప్పరాల రైతు వేదిక దగ్గర వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో కెవికె మదనాపురం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికె మదనాపురం శాస్త్రవేత్తలు, ఏఈఓ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ హిమబిందు, శంకర్, ఎ.రవికుమార్ రెడ్డి, పెద్ద మొగులన్న, దేశి గట్టన్న, రాములుగౌడ్, శేఖర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు రైతులు పాల్గొన్నారు.



## ‘మన ఊరు–మన బడి’ని మనమే కాపాడుకుందాం

**ప్రజాపక్షం / వీపనగండ్ల:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో భాగంగా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో ఇది కల్వరాల కాదు.. కొలువులరాల అనే నినాదంతో మన ఊరి బడిని మనమే కాపాడుకుందాం అనే లక్ష్యంతో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ, జడ్పిహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం అల్వారు శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజలు అందరూ కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులుగా తాము ఎంతో గర్వపడుతున్నామని, కల్వరాల ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు నేడు 250 మందికి పైగా వివిధ ఉన్నతమైన హోదాలలో పని చేస్తూ మన గ్రామానికి అండగా నిలుస్తున్నారని, అదే విధంగా గ్రామంలోని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రవేట్ పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

అన్ని వసతులతో కూడిన బోధన సౌకర్యం ఉందని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో గడిచిన ఎస్ఎస్‌సీ ఫలితాలలో మంచి ఫలితాలు సాధించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పాఠశఆలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడ

# మేం అనుకున్నట్టు జరగలేదు.. కానీ!

## ప్రీతి జింటా ఎమోషనల్ పోస్టు



ఎలాంటి అంచనాలు లేకుండా ఈ ఐపిఎల్ సీజన్‌లో అడుగుపెట్టిన పంజాబ్ కింగ్స్ అద్భుతంగా రాణించింది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ టాపర్‌గానూ నిలిచింది. కానీ ఫైనల్‌లో తృటిలో కప్‌ను చేజార్చుకుంది. అయితేనేం ఆ జట్టును తక్కువ చేయలేం. ఈ నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఎమోషనల్ పోస్టు పెట్టారు. తాజా ఐపీఎల్ సీజన్ మేం అనుకున్నట్లుగా ముగియలేదు కానీ.. ఈ ప్రయాణం మాత్రం సూపర్ అంటూ సుదీర్ఘంగా రాసుకొచ్చారు. "మా యువ జట్టు పోరాటం, ధైర్యం ఎంతో నచ్చింది. ఈ ప్రయాణం మేం అనుకున్నట్టు జరగనప్పటికీ.. అద్భుతంగా ఉంది. ఎంతో స్ఫూర్తిని చ్చింది. మా కెప్టెన్ జట్టును నడిపించిన తీరు.. ఈ ఐపీఎల్ అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల ప్రదర్శన గొప్పగా ఉంది. ఈ ఏడాది కూడా ఎంతో ప్రత్యేకం. గాయాలు, ఇతర కారణాలతో కీలక ఆటగాళ్లను కోల్పోయాం. టోర్నమెంట్‌లో విరామం.. స్వరాష్ట్రంలో జరగాల్సిన మ్యాచ్‌లు ఇతర రాష్ట్రాలకు మారడం వంటి పరిస్థితుల్లో కూడా రికార్డులు బద్దలుకొట్టాం. దశాబ్దం తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాం. ఎంతో ఉత్సుకతతో నిండిన ఫైనల్‌లో చివరివరకు పోరాడాం. మా వాళ్లు కప్పును ఇంటికి తీసుకెళ్లలేకపోవచ్చు కానీ.. వారు మా అందరి హృదయాలను గెల్చుకున్నారు. ఈ టోర్నమెంట్ అంతటా గొప్ప ప్రదర్శన చేసిన పంజాబ్ కింగ్స్‌లోని ప్రతి క్రీడాకారుడిని చూసి గర్విస్తున్నా. ఈ సందర్భంగా మా బృందంలోని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని ఇన్‌స్టా పోస్టులో పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు స్పందించారు. ఈ పోస్టు చూస్తుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయని, 2026 కోసం వేచి చూస్తున్నామంటూ కామెంట్లు పెడుతున్నారు. 18ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. ఐపీఎల్ తొలి టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ముద్దాడిన విషయం తెలిసిందే.

## మా నాన్నకు టెస్ట్ క్రికెట్ అంటేనే ఇష్టం

రోహిత్ శర్మ



రోహిత్ శర్మ ఇంగ్లాండ్ పర్యటనకు ముందు అకస్మాత్తుగా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. నిజానికి బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ముగిసిన తర్వాత రోహిత్ అత్యుత్తమ ఫామ్‌లో లేకపోయినా టెస్ట్ క్రికెట్ కొనసాగించాలనుకున్నాడు! అందుకే బిసిసిఐ ఆదేశాల మేరకు రంజీ ట్రోఫీలో కూడా పాల్గొన్నాడు. కానీ ఉన్నట్టుండి సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. హిట్ మ్యాన్ చేసిన ఈ ప్రకటన కేవలం అభిమానులనే కాకుండా, తన తండ్రిని కూడా బాధ పెట్టింది! ఛతేశ్వర్ పుజారా భార్య పూజ రాసిన 'ది డైరీ ఆఫ్ క్రికెటర్స్ వైఫ్' అనే పుస్తక ఆవిష్కరణ ముంబయి వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మాటామంతీలో రోహిత్.. తన తండ్రి టెస్ట్ క్రికెట్‌ను ఎంతగా ఆరాధిస్తాడో వెల్లడించాడు. తాను టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడాన్ని ఆయన పూర్తిగా అంగీకరించలేదని వివరించాడు. 'మా నాన్న.. ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేసేవారు. మా కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. ఆయనకు టెస్ట్ క్రికెట్ అంటేనే ఇష్టం. నేను వన్డేలో 264 పరుగులు చేసిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పుడు మా నాన్న నుంచి నాకు పెద్దగా ప్రశంసలు రాలేదు. కానీ నేను టెస్ట్ క్రికెట్‌లో 30, 40, 50, 60 పరుగులు చేసినప్పుడు కూడా ఆయన ఆ రన్స్ గురించి నాతో వివరంగా మాట్లాడేవారు. టెస్ట్ క్రికెట్‌పై ఆయనకున్న ప్రేమే ఇందుకు నిదర్శనం. అందుకే నేను సుదీర్ఘ ఫార్మాట్‌కు రైటైర్మెంట్ ప్రకటిస్తే మొదట ఆయనకు నచ్చలేదు. కానీ తర్వాత ఆయన కూడా నా నిర్ణయాన్ని అంగీకరించారు' అని రోహిత్ శర్మ వివరించాడు.

## రిటైర్మెంట్ ప్రకటించిన పీయూష్ చావ్లా



భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి శుక్రవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా తన వీడ్కోలు విషయాన్ని ప్రకటిస్తూ పోస్ట్ చేశాడు. తనకు సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, ఐపిఎల్ ఫ్రాంఛైజీలు, అభిమానులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాడు. 36ఏళ్ల పీయూష్ చావ్లా 2007 టీ20 వరల్ కప్, 2011 వన్డే వరల్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడు. అతడు భారత్ తరఫున మూడు టెస్ట్ మ్యాచ్‌లు, 25 వన్డేలు, 7 టీ20లు ఆడాడు. వన్డేల్లో 4/23 అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు దక్కనప్పటికీ దేశవాళీలు, ఫ్రాంఛైజీ క్రికెట్‌లో పీయూష్ చావ్లా తనదైన ముద్ర వేశాడు. ఇప్పటివరకు 446 ఫస్ట్ క్లాస్ వికెట్లు, 319 టీ20 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతడు దేశవాళీల్లో ఉత్తర ప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో పలు టీమ్‌ల తరఫున ఆడాడు. 2012, 2014లో ఐపీఎల్ టైటిల్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

## హరిహర వీరమల్లుపై త్వరలో కొత్త తేదీ ప్రకటిస్తాం: ఏఎం రత్నం



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరి హర వీరమల్లు సినిమా ప్రస్తుతం అనుకున్న 12వ తేదీకి విడుదల చేయలేకపోతున్నామని, కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆ సినిమా సమర్పకులు ఏ ఎం రత్నం శుక్రవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక కారణాల వల్ల విడుదల కాస్త ఆలస్యం అవుతోందని ఆయన పేర్కొన్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.ఎం. రత్నం చిత్ర సమర్పకులుగా, ఎ.దయాకర్ రావు నిర్మాతగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో 'హరి హర వీరమల్లు' ఒకటి. ఈ చిత్ర విడుదల గురించి జరుగుతున్న ప్రచారాలు, పెరుగుతున్న ఊహాగానాల నేపథ్యంలో నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు.'హరి హర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు సినీ ప్రేమికులందరికీ నిర్మాతలు కృతజ్ఞతలు తెలిపారు. 'హరి హర వీరమల్లు' చిత్రం కోసం వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి ఇరవై నాలుగు గంటలు తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ట్రైలర్‌తో పాటు, కొత్త విడుదల తేదీని కూడా తెలియజేస్తామని అన్నారు.

రీల

## 'మిత్ర మండలి' ఫస్ట్ లుక్



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా నటిస్తున్న 'మిత్ర మండలి' సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. తెలుగు తెరకు పరిచయమవుతున్న నిహారిక ఎన్.ఎం హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'మిత్ర మండలి' అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ తో పాటు, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా విడుదలైంది. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్ ను పరిచయం చేసింది. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అపరిమిత వినోదాన్ని అందించడానికి ఈ గ్యాంగ్ సిద్ధమవుతోంది.సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. 'మిత్ర మండలి' చిత్రంతో తెలుగులోకి అరంగేట్రం చేస్తుండటం విశేషం. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక.. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పని చేసి వార్తల్లో నిలిచారు. ఈ చిత్రానికి కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత.'మిత్ర మండలి' అనేది స్నేహం ప్రధానంగా నడిచే కథ. ఇది ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది.నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న 'మిత్ర మండలి' చిత్రానికి ఆర్.ఆర్. ధ్రువన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్‌గా పీకే, ఆర్ట్ డైరెక్టర్‌గా గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాజీవ్ కుమార్ రామా వ్యవహరిస్తున్నారు.



## కలివి వనం టీజర్ లాంచ్

వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో చిత్రీకరించిన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి , బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. హీరోయిన్ గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు.అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్ర టీజర్ ను గురువారం హైదరాబాద్ లోని ప్రసాద్సా ల్యాబ్‌లో విడుదల చేశారు.యఫ్.జె.ఏ. ప్రెసిడెంట్ వారనాసి లక్ష్మి నారాయణ, టి.యఫ్.జె.ఏ. వైస్ ప్రెసిడెంట్ వై. జె రాంబాబు , గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు జ్యూరీ మెంబెర్ మసాదే లక్ష్మి నారాయణ, సినీ జోష్ సీఈఓ రాంబాబు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాఘవ, దుప్పర్ల సత్యనారాయణల చేతుల మీదుగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

## 8 నుంచి 'డకాయిట్' షెడ్యూల్ ప్రారంభం



అడివి శేష్ నటిస్తున్న పాన్‌ఇండియన్ థ్రిల్లర్ 'డకాయిట్. అడవి శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అడివి శేష్ డబ్బింగ్ కూడా చెప్పేశాడు. దీనికి సంబంధించిన ఫోటోని షోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈనెల జూన్ 8 నుంచి షెడ్యూల్ ప్రారభించనున్నారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాతగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాకు సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న థియేట్రికల్ విడుదల కానుంది.

# సింగరేణిలో రూ.కోటి బీమా పథకం దేశానికే ఆదర్శం

### సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా అమలు జరుపుతున్న కోటి రూపాయల ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ఎన్.బలరామ్ చెప్పారు. ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన మణుగూరుకు చెందిన ఈపి ఆపరేటర్ మూల్‌చంద్ విశ్వకర్మ సతీమణి హరిదేవి విశ్వకర్మకు శుక్రవారం కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎండి తన సందేశం ఇచ్చారు. మణుగూరులో ప్రమాదంలో మృతి చెందిన మూల్‌చంద్ విశ్వకర్మకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కార్పోరేట్ వేతన ఖాతా ఉందని, ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి కోటి రూపాయల బీమా వర్తించిందన్నారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాలు, ప్రభుత్వ సంస్థల్లో లేని విధంగా సింగరేణి సంస్థ తొలిసారిగా బ్యాంకుల వారితో మాట్లాడి గరిష్టంగా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, దీనివల్ల ప్రమాద బాధిత మృతుల కుటుంబీకులకు ఆర్థికంగా గట్టి భరోసా లభిస్తోందన్నారు. సింగరేణిలో అమలు జరుగుతున్న ఈ ప్రమాద బీమా పథకాన్ని అసోం, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పాటు కోల్ ఇండియాలో కూడా అమలులోకి తీసుకువచ్చారన్నారు. బీమా రంగంలో విప్లవాత్మక పథకానికి తెలంగాణ ప్రభుత్వ చొరవ, సింగరేణి ముందడుగే కారణమన్నారు. ఉద్యోగులు సుఖసంతోషాలతో ఉండాలని సంస్థ ఎప్పుడూ ఆశిస్తుందని, అయితే అనుకోని ప్రమాదాల వల్ల ఉద్యోగి మృతి చెందితే ఒక్కసారిగా ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో, బ్యాంకులతో చర్చించి వేతన ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేస్తున్నామని, కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.40లక్షల వరకు ప్రమాద బీమా పథకాన్ని అమలు జరుపుతున్నామన్నారు. కొత్తగూడెంలో మృతుడి కుటుంబ సభ్యులకు డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌బిఐ డిజిఎం సత్యనారాయణ కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును హరిదేవి విశ్వకర్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎస్.డి.ఎం.సుభానీ, జిఎం కవితా నాయుడు, జిఎంలు కుమారి నికోలస్, జి.వి.కిరణ్ కుమార్, హెచ్‌ఓడి ఎ.జె.ఎం.మురళీధర్, గుర్తింపు, ప్రాతినిధ్య, అధికారుల సంఘం నాయకులు ఎస్‌వి.రమణమూర్తి, ఎస్.పీతాంబరరావు, సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



## 2026 ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు

**ఢాకా:** బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక నాయకుడు ముహమ్మద్ యూనస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఆయన శుక్రవారం ప్రకటించారు. గత సంవత్సరం ప్రజా తిరుగుబాటు కారణంగా ప్రభుత్వం కూలిపోయింది. అంతేకాదు, షేక్ హసీనా దేశం విడిచి పారిపోయింది. హసీనా లేకుండానే బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవే.
ముహమ్మద్ యూనస్ ఎన్నికల గురించి మాట్లాడుతూ.. 2026 ఏప్రిల్ మొదటి అర్ధభాగంలో ఏ రోజైనా ఎన్నికలు జరుగుతాయని.. నేను దేశ పౌరులకు తెలియజేస్తున్నాను అని అన్నారు. విస్తృత నిరసనలు, రాజకీయ తిరుగుబాటు ఆగస్టులో షేక్ హసీనా రాజీనామాకు దారితీసింది. ఇదిలావుంటే.. డిసెంబర్ 2025 నాటికి జాతీయ ఎన్నికలు నిర్వహించాలని, వివాదాస్పద సలహాదారులను తొలగించడం ద్వారా తన మంత్రివర్గాన్ని పునర్నిర్మించాలని గత నెలలో మాజీ ప్రధాన మంత్రి ఖలీదా జియా తెలిపింది.

## ఘనంగా అక్కినేని అఖిల్ వివాహం



అక్కినేని నాగార్జున, అమల దంపతుల కుమారుడు అఖిల్ పెళ్లి అట్టహాసంగా జూన్ 6 తెల్లవారు జామున 3 గంటలకి జరిగింది. నూతన వధూవరులు అఖిల్, జైనాబ్ లు వేద మంత్రాలు సాక్షిగా పెళ్లి బంధంతో ఒకటయ్యారు. అక్కినేని నాగార్జున స్వగృహంలోనే ఈ పెళ్లి గ్రాండ్‌గా జరగడం విశేషం. ఈ పెళ్లి వేడుకకు మెగాస్టార్ చిరంజీవి దంపతులు, రామ్ చరణ్ దంపతులు, రాజమౌళి ఫ్యామిలీ మెంబర్స్ అలాగే అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరై కొత్త జంటకి తమ ఆశీస్సులు అందించారు. ఈ ఆదివారం గ్రాండ్‌గా రిసెప్షన్ అన్నపూర్ణ స్టూడియోలో ప్లాన్ చేశారు. దీనికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు.



న్యూఢిల్లీలోని సిపిఐ ప్రధాన కార్యాలయం అజోయ్ భవన్‌ను భారత్‌లో పాలస్తీనా రాయబారి అబ్దుల్లా అబూ షావేష్ సందర్శించారు. ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పల్లబ్ సేన్‌గుప్తా, రామకృష్ణ పాండ తదితరులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పాలస్తీనా ప్రజలకు, వారి న్యాయపరమైన డిమాండ్లకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. భారత్ ఎంతోకాలంగా అనుసరిస్తున్న విదేశాంగ విధానం ప్రాతిపదికన, పాలస్తీనాకు అనుకూలంగా ప్రజల మద్దతును కూడగట్టే విషయం వీరి చర్చ ప్రధానంగా దృష్టి పెట్టింది.

## ముందస్తు బెయిల్ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించబడింది. 'ఈ అభ్యంతరకరమైన ఆర్డర్ నిగూఢమైనది. న్యాయ విశ్లేషణలో లోపం కలిగి ఉన్నది. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ఇంత యాంత్రికమైన పద్ధతుల్లో ముందస్తు బెయిల్ మంజూరును కొనసాగించలేం. అందుకే దానిని కొట్టివేయవచ్చు' అని బెంచ్ తెలిపింది. ఎఫ్ఐఆర్‌తో పాటు దానితో పాటు ఉన్న మెటీరియల్‌ను స్పష్టంగా చదివిన త్రిసభ్య ధర్మాసనం అప్పీల్‌దారు సమక్షంలోనే అప్పీల్‌దారు తండ్రి చంపబడ్డాడని, ఈ విషయమై సమాచారం ఇచ్చింది అప్పీల్‌దారుడేనని బెంచ్ తెలిపింది. 'ఈ సంఘటన ఒక మార్గానికి ఆటంకం కలిగించడానికి సంబంధించిన వివాదం నుండి ఉద్భవించినట్లు కనిపిస్తోంది. ఎఫ్ఐఆర్‌లో వెల్లడించినట్లు నిందితులకు ఆపాదించబడిన నిర్దిష్ట పాత్రలు, మరణించిన వ్యక్తి కుప్పకూలిన తర్వాత కూడా వారు ఒక కార్యక్రమంలో పాల్గొన్నారని సూచిస్తున్నది' అని అత్యున్నత న్యాయస్థానం వివరించింది. ఈ కేసులో వచ్చిన ఆరోపణలను, గాంభీర్యత, స్వభావాన్ని మెచ్చుకోవడంలో 'స్పష్టంగా విఫలం అయ్యింది' అని హైకోర్ట్ తెలియజేసింది.8 వారాలలోగా నిందితులు లొంగిపోయి కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. బాధితుడి కుమారుడు నిందితులకు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఒక పిటిషన్‌ను దాఖలు చేసిన నేపథ్యంలో ఈ ఆర్డర్ వెలువడింది. పొరుగువారితో తలెత్తిన వివాదం సమయంలో 2023లో బాధితుడిపై నిందితులు ఇనుప రాడ్లు, కర్రలతో దౌర్జన్యం చేశారు. దాడిలో తలకు తీవ్రగాయాలవడంతో క్షతగాత్రుడు అదే రోజు గాయాలతో మరణించాడు. అప్పీల్‌దారు స్టేట్‌మెంట్ ఆధారంగాపోలీసులు ఏడుగురు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## మంత్రివర్గ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

టి.జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, ఎంఎల్‌ఎ, డిసిసి అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పటిష్టంగా జరగాలని, పార్టీ కార్యకర్తలలోని నిరాశను తొలగించేందుకు నాయకులు సమన్వయం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలు సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటన్నింటినీ ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉద్యోగాలు, వైద్యం, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అయినప్పటికీ ప్రభుత్వ పనితీరుకు తగిన ప్రచారం రావడంలేదని పేర్కొన్నారు. దేశానికిఏ తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, శాస్త్రీయంగా కులసర్వే చేపట్టిన ఘనత, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ పరిష్కారానికి కృషి కొనసాగుతుందన్నారు.

## పరిపాటిగా మారింది

(మొదటి పేజీ తరువాయి)

సమయం పట్టదు. వాస్తవానికి, పెన్ను, పేపర్ స్థానంలో వాట్సాప్‌తో భర్తీ చేయడానికి ఆధునిక సాంకేతికత దారితీసి ఉండవచ్చు' అని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మాజీ ప్రచారక్ అయిన మోదీ కుల గణన డిమాండ్‌కు లొంగిపోయినప్పుడు లొంగిపోయే ధోరణి పనిచేసిందని రాహుల్ అన్నారు. కుల గణన నిర్వహించమని ఒత్తిడి చేస్తామని పార్లమెంట్‌లోనే మోదీకి చెప్పానన్నారు. కానీ, బిజెపి నిజమైన కుల గణనను అనుమతించదు, ఎందుకంటే అది వారి రాజకీయాలను ముగించేస్తుందని ఆయన ఆరోపించారు. 'మోదీ తనను తాను ఓబిసి అని ఎలా చెప్పుకుంటారో, కులం లేదని కూడా ఎలా చెప్పుకుంటారో చూడండి' అని గాంధీ పేర్కొన్నారు. కుల గణనకు రెండు నమూనాలు ఉన్నాయని కూడా ఆయన అన్నారు. 'ఒకటి బిజెపిది, దీనిలో ఉన్న అధికారులు తలుపులు మూసివేసి నిర్ణయాలు చేస్తారు. వారిలో అణగారిన కులాల నుండి ఎవరూ ఉండరన్నారు. 'మరొక నమూనా (కాంగ్రెస్ పాలిత) తెలంగాణది, ఇక్కడ దళితుల సంస్థలు, నాయకులు పరిగణనలోకి తీసుకోబడతారు. సర్వేలో పాల్గొనేవారు అంటరానితనం వంటి విషయాల గురించి తమ అనుభవాలను స్వేచ్ఛగా ప్రసారం చేస్తారు' అని గాంధీ అన్నారు.

### భారత నేర రాజధానిగా బిహార్

బిహార్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు, రాష్ట్రం 'భారతదేశ నేర రాజధాని'గా మారిందని ఆరోపించారు. సైనిక సంఘర్షణ సమయంలో భారత్–పాకిస్థాన్ మధ్య శాంతికి మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండడాన్ని ప్రశ్నించారు. 'ఒకప్పుడు శాంతి, న్యాయం భూమిగా పరిగణించబడిన బిహార్, ఇప్పుడు భారతదేశ నేర రాజధానిగా మారిపోయింది' అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు నొక్కి చెప్పారు. 'ఒబిసి, దళిత లేదా గిరిజన వర్గాల అధికారులు ప్రశ్నాపత్రాన్ని తుది రూపం ఇవ్వకుండా కేంద్రం కుల గణనను సరిగ్గా నిర్వహించగలదా అని తాను ఆందోళన చెందుతున్నానని కూడా గాంధీ అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటానికి, దేశ శ్రేయస్సు కోసం, కుల గణన కోసం పోరాడుతున్నానని, భవిష్యత్తులో మనం ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తామని, ఇది బీహార్ నుండి ప్రారంభమవుతుందన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com